# రెండవ భాగం:

## తెలుగు, బైబులు సామెతలు: ఒక తులనాత్మక పరిశీలనం

### ౨. తెలుగు, బైబులు సామెతలు: ఉపదేశం

## 2. తెలుగు, బైబులు సామెతలు: ఉపదేశం

సామెతల ముఖ్య ప్రతిపాదనలు వివిధ రకాలు. కొన్ని నలుగురి గమనంలో ఉన్నదానిని ఉన్నట్లు చెప్పి ఊరుకుంటాయి. మరికొన్నిటిలో హితబోధ, ఉపదేశం కరతలామలకమై సామెత వినగానే చటుక్కున స్ఫురించే విధంగా ఉంటుంది. 'తినడానికి తిండి లేదు గాని తనవారికి తద్దినాలు', లేదా 'అప్పుచేసి పప్పుకూడు' అనగానే ఇక్కట్లలో ఉన్నప్పుడే డాబుసరి పనికిరాదు (సీరా 18:13) అనే హితోపదేశం ప్రత్యక్షమై ఆకట్టుకొంటుంది. ఈ కోవకు చెందిన సమానార్థకమైన తెలుగు, బైబులు సామెతలను ఈ అధ్యాయంలో  పరిశీలిద్దాం.

'క్రియలు లేని విశ్వాసము వ్యర్థమని' బైబులు చెబుతుంటే 'చెప్పుట కంటే చేయుట మేలు' అని తెలుగు సామెత సెలవిస్తున్నది. తెలుగు సామెత 'గోడకి చెవులుంటాయి' అని ఊరుకుంటే 'మనస్సులో కూడ రాజును విమర్శించకుము' అని బైబులు సామెత హితవు పలుకుతున్నది. ఆ విధంగా ఈ వర్గంలో ఉన్నవన్నీ ప్రబోధాత్మక  సామెతలు.

### 1

తెలుగు సామెత : అందని మాని పండ్లకు ఆశపడకు

బైబులు సామెత : పరకాంత సొగసుకు భ్రమయ వలదు (సామెతలు 6:25)

తెలుగు సామెతలో అందని మాని పండ్లకు ఆశించడం వ్యర్థమన్న మాట ఉండగా బైబులు సామెత పరకాంత పొందును ప్రస్తావించి ఈ నీతిని ఉద్దీపింపజేసింది.

అధిక సంఖ్యలో ఋజువర్తనులున్నప్పటికీ అన్యకాంతలను మోహించే కాముకులు ప్రతి సమాజంలోనూ ఉంటూనే ఉంటారు. వేశ్యాగమనం వేరు. వేరొకని భార్యపై చిత్తం నిలిపి మన్మథాగ్నిలో శలభాలౌతూ పథకాలు రచిస్తూ మనశ్శాంతికి దూరమైపోవడం దుర్జన పద్ధతి. వేమన చెబుతున్నది అదే:

'పరసతి గమనంబు ప్రత్యక్ష నరకంబు
అరయ నిందకెల్ల నాలయంబు
పురుషుడు వినజంపు భూపతి నొప్పించు'

ఇలాటివారిని సమాజం గర్హిస్తుంది. ఆ మగువ మగడు వింటే ప్రళయకాల రుద్రుడౌతాడు. ఇలాటిది చట్టవిరుద్ధం కూడా.

మనశ్శుద్ధి గలిగి పరకాంతా వ్యామోహంలో చిక్కుకొనక వారిని తల్లులుగా ఎంచేవాడే నేర్పరి సజ్జనుడు. ఇదీ వేమన వాక్కే.

'తన్ను గన్నయట్టి తల్లివంటిది సుమ్ము
అన్యకాంత! న్యాయమరసి చూడ
కన్నదాని జనులు కానంగలేరయా'

బైబులులో ఇశ్రాయేలు సార్వభౌముడు దావీదు మునిమాపువేళ రాచనగరు మిద్దెపైకెక్కి స్నానమాడుతున్న బత్షెబ అనే సుందరాంగిని చూశాడు. ఆమె దావీదు కొలువులో నున్న ఒక సేనాని భార్య. ఆమెపై మనస్సుపడి ఆ రాజు జరిగించిన అకృత్యాలు ఇంతింత కాదు.

పరసతి పొందు అందనిదానికై అర్రులు చాచడం దుఃఖహేతువని ఈ రెండు సామెతలు ఘోషిస్తున్నాయి.

## 2

తెలుగు సామెత : అడుసు తొక్కనేల? కాలు కడుగనేల?

బైబులు సామెత : శవమును ముట్టనేల? శుద్ధి చేసుకొననేల? (సీరా 34:25)

దారినపోయేవాడు తన మానాన తాను పోక పంకాన్ని చూచి కుతూహలంతో కాలుపెట్టి కాలు మలినమయ్యాక అలానే ఇంటిదాకా వచ్చి కడుక్కొనడం ఈ తెలుగు సామెతలోని ప్రత్యక్షార్థం. అలాటి వ్యక్తిని చూచి అందరూ నవ్వుతారు. విశేషార్థం చూస్తే కానిపనులకు, లేనిపోని వ్యవహారాలకూ పోకుండా, చేతులు కాలాక ఆకుల కోసం పరిగెత్తే దుస్థితి రాకుండా ఆచితూచి సన్మార్గంలో చరించడం బుద్ధిమంతుల లక్షణం అని తెలుస్తుంది. ఈ సందర్భంలో నవయుగ కవి చక్రవర్తి జాషువా చేసిన 'హెచ్చరిక' శిరోధార్యం. అడుసు త్రొక్కక ముందే, దీపం ఆరకముందే సన్మార్గంలో

నడుచుకొమ్మని ఉద్బోధిస్తున్నాడు కవి:

'విశ్వనిర్మాత చల్లని వీక్షణమున
నేటికిని గెంపుచార గాన్పింపలేదు
మూర్ఖలోకమ దినమెల్ల ముగియలేదు
దీపమున్నది హృదయంబు దిద్దుకొనుము'

బైబులు సామెతలో సైతం సామాన్యార్థం తేటతెల్లం. యూదులు బహు శౌచాచార పరాయణులు. వారికి అంటు, మైల మెండు. శుచికై వారు అనుష్ఠింపవలసిన మత కర్మకాండలు అసంఖ్యాకం. ఒక్కొక్క రకం అశుద్ధికి కడగా ఉండవలసిన కాలపరిమితులు శుద్ధి సంస్కారాలు ఒక్కొక్క రకం. మృత కళేబరాన్ని స్పృశించినవాడు సూర్యాస్తమయం వరకు అశుద్ధుడు. ఆ సమయంలో ఎంత అత్యవసరమైన కార్యమైనా అలా ఉండవలసిందే. అందుకే ఇటువంటి నిర్దుష్టాచార దురంధరులు ప్రతి అడుగూ ఆచితూచి వేయవలసి ఉంటుంది, ముఖ్యంగా తనను మైలపడజేసే వాటి విషయంలో. యూదుల శుద్ధీకరణాచార విధుల నేపథ్యంలో ఈ బైబులు సామెత ఉనికిలోనికి వచ్చింది.

మొత్తమ్మీద ఈ రెండు సామెతలూ అనవసర విషయాల జోలికి వెళ్ళకుండా తీసుకోవలసిన జాగ్రత్తను గురించి తెలియజేస్తున్నాయి.

3

తెలుగు సామెత : అడుసులో నాటిన స్తంభము
అడవి గాచిన వెన్నెల

బైబులు సామెత : ఇసుక మీద కట్టిన ఇల్లు (మత్తయి 4:26)

ఎంత పెద్ద కట్టడం నిలవాలన్నా పునాది గట్టిగా ఉండాలి. భవంతి అందముగా, అన్ని హంగులతో కట్టినా పునాది సరిగ్గా లేకపోతే అది వ్యర్థమే. ఇసుక మీద ఇంటిని కడితే, అది గట్టిగా పట్టు కలిగి ఉండదు గదా! అదే విధముగా స్తంభము ఎంత గట్టిదైనా ఎంత పట్టుకలది అయినా నాటిన స్థలమును బట్టి దాని ప్రయోజనం ఉంటుంది. బురదలో స్తంభం నాటితే దానికి పట్టు దొరుకుతుందా? ఆ స్తంభం

ఏమి ప్రయోజనం లేకుండా పడి ఉండవలసినదే కదా! మనకు ప్రయోజనం కలిగించని విషయాలు, పనులు లేదా సమాజానికి ఏ మాత్రం లాభం చేకూర్చని పనులు చేసేవారిని గురించి వారు చేసే పనులను గురించి మాట్లాడే సందర్భములో ఎక్కువగా ఈ సామెతలను ఉపయోగిస్తారు. రెండు సామెతలు కూడా ఫలవంతం కాని, ప్రయోజనం లేని పనులను గూర్చి చెబుతున్నాయి. కాబట్టి పని మొదలు పెట్టేటప్పుడు అది ఎంతవరకు సమంజసం? ఎవరికి, ఏ రకంగా ప్రయోజనం చేకూరుస్తుంది? అని ఆలోచించవలసిన అవసరాన్ని గుర్తుకు తెస్తున్నాయి ఈ రెండు సామెతలు.

'నవరస భావాలంకృత
కవితా గోష్ఠియును, మధుర గానంబును దా
నవివేకి కెంత చెప్పినా
జెవిటికి సంకూదినట్లు సిద్ధము సుమతీ' అని అంటాడు బద్దెన.

చెవిటివాని ఎదుట శ్రావ్యంగా శంఖమూదడం, సూకరాల ఎదుట నవమౌక్తికాలు వెదజల్లడం, మూర్ఖునికి నీతి సూక్తులు బోధించడం తదితర ఉపమానాలన్నీ ఈ కోవలోనివే. నాగరికులు నడయాడే సైకత స్థలాలలో, ఉద్యాన వనాల్లో పిండార బోసినట్టు వెన్నెల కాస్తే అది సర్వజన మనోరంజకమౌతుంది గానీ ఆస్వాదించి ఆనందించే మనిషే లేని కారడవిలో కాస్తే ఏమి ప్రయోజనం.

భాస్కర శతకకారుడు ఈ సామెతల్లోని భావాన్ని సకారాత్మకంగా వినిపించి కర్తవ్య బోధ గావించాడు.

సిరిగల వానికెయ్యడల జేసి నే మేలది నిష్ఫలంబగున్
నెరిగురి కాదు పేదలకు నేర్పునజేసిన సత్ఫలంబగున్
వరపున వచ్చి మేఘుడొక వర్షము వాడిన చేల మీదటన్
గురిసిన గాక యంబుధుల గుర్వగనేమి ఫలము భాస్కరా!

సామెతలు ప్రబోధత్మకాలు, కర్తవ్య సుబోధకాలు. నిరర్థకమైనవి ఇన్నిన్ని అంటూ చెప్పుకోవడం గాక సత్ఫలితాన్నిచ్చే క్రియలను చేయడం శ్రేయోదాయకం అని ఈ సామెతల ద్వారా తెలుసుకోవచ్చు.

## 4

తెలుగు సామెత : అతి రహస్యం బట్టబయలు

బైబులు సామెత : రహస్యమైనదేదియు బట్టబయలు కాకపోదు (లూకా 8:17)

సాధారణముగా మానవులు, వారికి సంబంధించిన అన్ని విషయాలను అందరితోనూ చెప్పరు. కనీసం కొన్నింటినైనా ఎవరికీ తెలియకుండా దాచి ఉంచుతారు. కొన్నిసార్లు చేయవలసిన పనులను అతి రహస్యముగా చేస్తుంటారు. అలా చేయడం వల్ల తమ విషయాలు ఎవరికీ తెలియకూడదనుకుంటారు. కాని ఈ రహస్యాన్ని కప్పి పుచ్చడానికి చేసే అతి జాగ్రత్త వలన ఇతరులు తొందరగానే విషయాన్ని తెలుసుకోగలుగుతారు. కాబట్టి ఎప్పుడైనా రహస్యాలు దాచేటప్పుడు మన ప్రవర్తన వల్ల, తీసుకునే జాగ్రత్త వల్ల ఇతరులకు విషయం తెలిసిపోతుందనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవలసిన ఆవశ్యకతను ఈ రెండు సామెతలు తెలియజేస్తున్నాయి. కాబట్టి చేసే పనులేవైనా నిర్భయంగా అందరికీ తెలిసేలా చేయడమే ఉత్తమమైన మార్గం అని ఈ సామెతలు పరోక్షంగా తెలియజేస్తున్నాయి.

చేసిన దుష్ట చేష్ట నది చెప్పక నేర్పున గప్పిపుచ్చి తా
మూసిన యంతటన్ బయలుముట్టక యుండదదెట్లన రాగిపై
బూసిన బంగరుం జెదరిపోవ గడంగిన నాడు నాటికిన్
దాసిన రాగి గానబడదా జనులెల్లరెరుంగ భాస్కరా!

అంటూ పై సామెతలను భాస్కర శతకకారుడు విశదీకరిస్తున్నాడు.

## 5

తెలుగు సామెత : అనువుగానిచోట అధికులమనరాదు

బైబులు సామెత : రాజు ఎదుట డంబము చూపకుము,
గొప్పవారున్నచోట నిలవకుము (సామెతలు 25:6)

వసుదేవుడంతటివాడు గాడిద కాళ్ళు పట్టుకున్నాడట. కార్యసిద్ధి జరగవలసిన చోట కొంత తగ్గి మనోరథమీడేర్చుకుంటారు ఉత్తములు. మత్తగజమైనా నీటిలో మొసలిచే ఈడ్వబడుతుంది. సమయాసమయ విచక్షణ కలిగి స్థల సందర్భ వివేచనతో మెలగమన్న హితవు పల్కుతున్నాయి ఈ సామెతలు.

‘నెయ్యపు కిన్క’ బూనిన సత్యభామ తన నాథుని శిరము ‘జలజాతాసన వాసవాది సురపూజా భాజనమని’ కూడా చూడక వామపాదంతో తొలగజేసింది కదా. వెన్నుడు తాను ఘటనా ఘటన సమర్థుడైనా, లీలా మానుష వేషధారియైనా ఆగ్రహించక ‘దాసుని తప్పులు దండముతో సరి’ అంటూ దాసోహమన్నాడు. ప్రణయ కలహంలో నేనధికుడినని అహం చూపితే రసాభాసమవుతుంది.

అది అలా ఉంచి తెలుగు, బైబులు సామెతలు తాహతెరిగి ఆనుపానులు తెలిసి ప్రవర్తించాలని ఉపదేశిస్తున్నాయి. రాజ సన్నిధిలో నిలుచున్నప్పుడు రాజు అడిగితే మట్టు మర్యాదలతో జవాబివ్వాలి తప్ప పూనుకొని అహంకరించి ప్రేలకూడదు. విద్వద్గోష్ఠిలో ప్రల్లదుల ప్రేలాపనలు అపహాస్యం పాలవుతాయి.

కాగా మహాత్ములు అననుకూల పరిస్థితుల్లో మిన్నకుండడం వల్ల వారి మహత్తుకేమీ భంగం వాటిల్లదు. వేమన చెప్పినట్టు పెద్ద కొండ అద్దంలో కొంచెంగా కనిపించదా మరి?

## 6

తెలుగు సామెత : అపకారికి ఉపకారము నెపమెన్నక చేయువాడు నేర్పరి.

బైబులు సామెత : అపకారికి ప్రత్యపకారము తలపెట్టకు (సామెతలు 20:22)
నీ శత్రువు ఆకలిగొని యున్నచో అన్నము పెట్టుము. దప్పికగొని యున్నచో దాహమిమ్ము (సామెతలు 25:21)

ఇది తెలుగు సామెతా, బైబులు వాణీ ఉపదేశించే ఒక ఉదాత్త ధర్మం. ఈ సత్యం కాలాతీతం. యేసుక్రీస్తు ఏనాడో బోధించి, ఆచరించి చూపిన ఘన సత్యాన్ని మన బద్దెన ఈ పద్య మందారంలో వెలయించాడు. ఉత్తమ భావాలు సంస్కృతితో గాని, దేశ కాలపరిస్థితులతో గానీ సంబంధం లేకుండా మహాత్ముల నోట నుండి జాలువారుతుంటాయి. ఇలాటి ఉపదేశామృతం తుది లేని చైతన్య ఝరివలె శతాబ్దాల ఎల్లలు దాటి నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది.

ఉపకారం చేసినవాడికి ప్రత్యుపకారం చేయడం సర్వసామాన్యం. అపకారికి అపకారం చేయడానికి అదను కోసం చూడడమూ సాధారణమే. కుడి ఎడమ కావడమే విశేషం. కుక్క సైతం పెట్టిన చెయ్యిని కరవదు. ఇలాటి వికృత చేష్టలు మానవులకే

పరిమితమైన దౌర్భాగ్యం. అదే సమయంలో అపకారికి ఉపకారం చేయడమనేది అన్ని ధర్మాలలోకీ తలమానికం. కీడుకు ప్రతికీడు, హత్యకు ప్రతిహత్య చేయడం ద్వారా శత్రువును దెబ్బతీయడం, హతమార్చడం మాత్రమే సాధ్యం. అయితే చంపదగిన శత్రువు తన చేతచిక్కితే సాదరంగా చేయగలిగిన మేలు చేసి పంపితే శత్రువును కాదు, అతనిలోని శత్రుత్వాన్ని, విరోధ భావాన్ని హతమార్చిన వారమవుతాము.

క్రీస్తు తనను సిలువనెక్కించి చిత్రహింసలు పెడుతున్నవారినుద్దేశించి 'వీరేం చేస్తున్నారో వీరికి తెలియదు, వీరిని క్షమించు' అని విధాతను వేడుకొన్నాడు. ఇది కేవలం దైవ లక్షణం. సర్వేశ్వరుడు మంచివారితో బాటు సమానంగా చెడ్డవారిపై కూడా సూర్యరశ్మి ప్రకాశింపజేస్తాడు. వర్షం కురిపిస్తాడు. సకలైశ్వర్యాలను ప్రసాదిస్తాడు. ఆయనకు శత్రువులు, మిత్రులు అంటూ లేరు. ఆయన సమవర్తి. ప్రకృతిలో సైతం ఈ దైవ గుణం అడుగడుక్కీ గోచరిస్తుంది. రాతి దెబ్బతిని గున్నమామిడి కొమ్మ సుమధుర ఫలాన్నిస్తుంది. భూమాత యెదను నాగటితో చీల్చి నాట్లు వేస్తే జీవనాధారమైన సస్యలక్ష్మిని సాక్షాత్కరింపజేస్తుంది.

పాండవులు ధర్మాత్ములు. వారు అరణ్యవాసంలో ఉన్న సమయంలో కౌరవులు దుర్బుద్ధితో ఘోషయాత్ర పేరుతో పాండవులున్న ప్రాంతానికి వచ్చి చెరుపు చేయబూనుకున్నప్పుడు గంధర్వులు వారిని బంధించారు. ధర్మరాజు ఆజ్ఞమేరకు భీమార్జునులు వెళ్ళి కౌరవులను విడిపించి సాదరంగా హస్తినకు సాగనంపారు.

ఉపకారికి ఉపకారం మానవుని సహజగుణం. క్షమ, దయ, అంతకు మించి అపకారికి ఉపకారం ఈ లోకంలో అసహజం. మనుషులు ఈ సౌజన్యాన్ని అపార్థం చేసుకొనే అవకాశం కూడా ఉన్నది. అవతలివాడు మన మెతకదనాన్ని ఆసరాగా చేసుకొని వంచిస్తున్నాడని తెలిసి కూడా అతనికి సాయం చేయబూనుకోవడం సన్మార్గం. మనలను దెబ్బతీసిన వాడిని తిరిగి దెబ్బతీయడం వల్ల ఎడతెగక పగ కొనసాగుతూ ఉంటుంది. ఈ కక్షలు, కార్పణ్యాలు తరాలకు తరాలు రావణుని కాష్ఠంలా రగులుతూనే ఉంటాయి. ఒక్క ఉత్తముడు తన ఉదాత్త గుణం చేత కయ్యాన్ని నెయ్యంగా మార్చుకోగలిగే ఔదార్యం ప్రదర్శించగలిగితే ఎన్ని తరాల పగైనా ఇట్టే సమసిపోతుంది. అటువంటివాడే నేర్పరి, జ్ఞాని, మహానుభావుడు. ఈ సత్యాన్నే ఈ సామెతలు చాటుతున్నాయి.

## 7

తెలుగు సామెత : అబద్ధాలాడితే ఆడపిల్లలు పుడతారు

బైబులు సామెత : అబద్ధములు ఆడకుము (కీర్తనలు 34:13)

సత్యవాక్పరిపాలనం సాటిలేని ధర్మం. మహాత్ములకు ఐశ్వర్య లేమిచేత ఆభరణాదులు లేకపోయినప్పటికీ హస్తాలకు సత్పాత్రదానము, శిరానికి గురుపాద నమస్కృతి, తదితర అలంకరణలతో పాటు 'ముఖంబున సూనృతవాణి' శోభనిస్తుందని భర్తృహరి ఉవాచ. పై రెండు సామెతలూ అనృతాన్ని గర్హిస్తున్నాయి.

పురుషాధిక్య సమాజాలలో నాటికీ నేటికీ కూడా ఆడపిల్లను కని పెంచి ఒక అయ్య చేతిలో పెట్టేవరకూ తల్లిదండ్రుల వెతలు చెప్పశక్యం కాదు. ఇది దుర్భరమనీ, శాప ఫలితమనీ ఎంచడం అనాదిగా వస్తున్నది. అందుకే అబద్ధాలాడితే ఆడ పిల్లలు పుడతారనే శిక్ష ద్వారా అబద్ధాలాడటాన్ని గర్హిస్తున్నది తెలుగు సామెత. దీనినే వేమన నొక్కి వక్కాణిస్తూ నేను ద్విజుడిని, అబద్ధాలాడినా నాకేమీ నష్టం కలగదు అనడం బుద్ధిహీనమంటున్నాడు.

'కల్లలాడు కంటె కష్టంబు మరిలేదు
కష్టమెపుడొ కీడు కలుగజేయు
ద్విజడననుట చూడ త్రిమ్మరితనమురా'

'సత్యం వద, ధర్మం చర' అనేవి సర్వకాలీన సత్కర్మలు. బైబులు సామెత దీనినే సమర్థిస్తున్నది. సొలోమోను రాజేంద్రుని సూక్తుల్లో లెక్కకు మిక్కిలిగా అబద్ధాలను గర్హించేవి కనిపిస్తాయి. యూద, క్రైస్తవ ధర్మశాస్త్రానికి ఆయువుపట్టుగా ఉన్న దశాజ్ఞలలో ఒకటి నీ సాటి వ్యక్తిని గురించి అబద్ధ సాక్ష్యం పలుకకూడదన్నది (నిర్గమకాండము 20:16). అబద్ధాలాడేవాడుసైతం ఇతరులు తనతో సత్యమే పలకాలని కోరుకుంటాడు. చిల్లికుండలో నీరు నిలువని రీతిగా అసత్యాలాడే వారి ఇంట లక్ష్మి ఉండదని పెద్దలు అంటారు. అసత్యవాది అనేక ఈతి బాధలపాలౌతాడు. సాటివారు అతనిని నమ్మరు. అలాటి వ్యక్తికి దూరంగా ఉంటారు.

మనమాచరించిన కర్మలన్నిటికీ తగిన ప్రతిఫలం అనుభవించవలసిందే. సత్యవ్రతంలో వాసికెక్కిన ధర్మరాజు ద్రోణవధకై 'అశ్వత్థామ హతః కుంజరః' అని పలికిన అనృతం ఆ మహాత్ముని వ్యక్తిత్వంలో ఒక మాయని మచ్చగా మిగిలిపోయింది.

8

తెలుగు సామెత : అరగడియ భోగం, ఆరు నెలల రోగం
సంకటాల విత్తు సానిదాని పొత్తు
మీద మెరుగులు లోన పురుగులు

బైబులు సామెత : వేశ్యలను కూడువాడు కుళ్ళుపట్టి పురుగులు పడి చచ్చును (సీరా 19:2,3)

సమాజం స్థూలంగా అన్నవస్త్రాదులకు లోటులేని స్థితిలో కొనసాగుతున్నప్పుడు సాహిత్యాది లలిత కళలు కుసుమిస్తాయి. ఇటువంటి అభిలషణీయమైన నాగరికతా చిహ్నాలతో బాటు వేశ్యావృత్తి అనే జాడ్యం కూడా అలాటి సమాజంలో పొడచూపుతుంది. విషయవాంఛలకై విత్తాన్ని వెదజల్లగల విటులున్నచోట పేటలకు పేటలు వారకాంతలుంటారు. వేశ్యల తోడి పొందులోని అనర్థాలను తెలుగు సామెతలు, బైబులు సామెతా మొగమాటం లేకుండా ప్రకటిస్తున్నాయి. అందుకే వేమన

'తొత్తుతోడి పొందు తొర్రి పెసలమూట
లంజెతోడి పొందు లజ్జ చెడుపు
జాంద్రతోటి పొందు చావునకేయగు' అంటాడు

వెలయాలి తళుకుబెళుకుల అత్తరు ఘుమఘుమల తమకంలో పడి పురుషులు కామాతురులై దీపశిఖ చుట్టూ మూగే శలభాల వలె వారి పొందుకు తపిస్తారు. ఆ సుఖానుభవం మూణ్ణాళ్ళ ముచ్చటేయని వారు గ్రహించరు. తనను నమ్ముకొన్న ఇల్లాలికి, పిల్లలకు అన్యాయం చేస్తూ, అయినవారిచే మాటలు పడుతూ, ఇల్లు గుల్లచేసుకొంటూ వేశ్యాలోలత్వంలో మగ్గిపోతారు.

నోటికి రుచిగా ఉన్నది గదా అని పంచభక్ష్య పరమాన్నాలూ ఆత్రుతగా భుజించి ఆరు నెలలు అజీర్తి వాతాలతో మంచాన పడ్డ చందాన ఉంటుంది సానిదాని పొందు. తెలుగు సామెతల సారాంశం ఇదే.

బైబులులో మహాబలుడు సంసోను దెలీలా అనే వేశ్య పంచన చేరి సకల విధాలా భ్రష్టుడైన గాథ లోక ప్రసిద్ధం. బైబులు సామెత వేశ్యాగమనంలోని అనర్థాలను బహు కటువుగా చెబుతున్నది. వెలయాలంటే వెల చెల్లిస్తే తాత్కాలికంగా ఆలిగా ఉండే స్త్రీ.

సాధారణంగా ఆమె శరీరం రోగాల పుట్ట. ఆమెను కూడేవాడికి అవన్నీ మెడకు చుట్టుకుంటాయి. ప్రాణాంతకం కాకపోయినా భరించరాని బాధ కలిగించే వ్యాధులు కొన్నయితే, అనతి కాలంలోనే అసువులను హరించివేసే ఎయిడ్స్ వంటివి మరికొన్ని. మొత్తంమీద వేశ్యాలోలత్వం అన్నివిధాలా అనర్థదాయకమని గమనించమంటున్నాయి ఈ సామెతలు.

వేమన పద్యాలలో ఈ ప్రస్తావనలు తరచుగా వస్తుండడాన్ని బట్టి అతడు తన యవ్వనంలో వేశ్యల విషయంలో అనుభవం గడించి ఉంటాడని పండితుల అభిప్రాయం. విటుని వద్ద ధనమున్నంత కాలం ఇచ్చకాలాడుతూ ఉండడం, అతని ఇల్లు, ఒళ్ళు గుల్ల అయిన తరువాత సానిదాని తల్లి అతనిని మెడబట్టి గెంటడం వేమన పద్యాలలో వ్యక్తమవుతూ ఉంటుంది.

'బొల్లిమాటలాడు భోగము దానితో
దొల్లి డుల్ల నిల్లు గుల్లచేజి
వెళ్ళి రమ్మటంచు వెడలించునింటిని.'

బైబులులోని సామెతలు గ్రంథమంతటా జారస్త్రీకి దూరంగా ఉండమన్న ఉద్బోధలున్నాయి. అలానే మన తెలుగు సామెతలలో కూడా లెక్కకు మిక్కిలిగా భోగము దానితో పొందు కూడదన్న హెచ్చరికలు, హితవులు ఉన్నాయి. అందుకే భోగందాని వలపూ, బొగ్గు తెలుపూ లేవంటారు.

## 9

తెలుగు సామెత : ఆలి మీద లంజరికము ఆకలిగాని భోజనము

బైబులు సామెత : భార్యను శంకింపకుము (సీరా 9:1)

భార్యాభర్తల మధ్య ఉండే అనుబంధానికి లోకంలో మరేదీ సాటిరాదు. ఆ అనుబంధానికి ఆయువుపట్టు నమ్మకం.

స్త్రీ పురుషులు తమ కాపురంలో కలిసి అనుభవించే మిట్టపల్లాలు, వెలుగు నీడలు, కష్టసుఖాలు వారిద్దరి మధ్య వారికే తెలియని ఒకానొక అనిర్వచనీయమైన మానసిక బంధాన్ని ఏర్పరుస్తాయి. ఇద్దరికీ రెండు శరీరాలు గానీ, మనసొక్కటే ఆత్మ

ఒక్కటే. 'నాతి చరామి' అని ఒకరితో ఒకరు ప్రమాణం చేసుకొన్నప్పుడే వారిద్దరూ ఏకమైపోయారు. క్రైస్తవ సంప్రదాయంలో పురుషుని శరీరం అతని భార్య. భార్యకు శిరస్సు భర్త అని నమ్ముతారు. ఒకరి భార్య అతని మాట వినడం లేదంటే అతని అవయవాలలో ముఖ్యమైనది మొరాయించి అతనికి అనువుగావడం లేదని అర్థం. భార్యగానీ, భర్తగానీ తప్పటడుగు వేస్తే ఆ పాపంలో ఇద్దరిదీ భాగం.

తనమీద తనకు నమ్మకం లేని వ్యక్తి తన భార్యను సందేహిస్తాడు. దారి తప్పిన పడతులు నూటికి కోటికొక్కరు తప్పించి ఏ ఆడదీ చేజేతులా కాపురాన్ని పాడుచేసుకొని అక్రమ సంబంధాలకు ఒడిగట్టదు. సంసారమంటే,

పురుషభాగ్యముననె పుణ్యవతి దొరకు
పుణ్యవతికి నట్టె పుట్టు సుఖము
నిరువురనుభవింప హితులును పుత్రులు
అష్టభోగములును అమరు వేమ'

అని వేమన చెప్పిన చందాన ఉండాలి. ఉత్తి పుణ్యానికి ఒకరినొకరు శంకిస్తూ బ్రతుకును నరకం చేసుకొనే దంపతులుంటారు.

అందుకే బైబులులో కూడా భార్యను శంకించరాదన్న ఉవాచ ఉన్నది. అది సామెతగా స్థిరపడింది. నమ్మకం అనేది చెడితే భర్త నోట అటువంటి అనుమానం వెలువడితే అభిమానవతుల బాధ వర్ణనాతీతం. ఒకసారంటూ పురుషుడు తన భార్యకు రంకుతనం అంటగట్టిన తరువాత ఇక వారిద్దరి సంబంధం ఎన్నటికీ గతంలోవలె ఉండదు. పురుషోత్తముడైన శ్రీరామచంద్రుడంతటివాడు తాను నమ్మకపోయినా లోకాపవాదులకు వెరచి శీలవతి కాదన్న నిందవేసి సీతను కానలకు పంపించాడు. ఆ సాధ్వి ఇక జీవితంలో ఎన్నడూ భర్తను చేరలేదు. భార్యాభర్తల అనుబంధం బహు సున్నితమైనది.

అన్యోన్యంగా పరస్పరం అభిమానించుకొంటూ, సన్మానించుకొంటూ గడిచిపోయే కాపురం భూతల స్వర్గం. కడివెడు పాలలో ఒక్క విషపు చుక్క చందాన అనుమానం పెనుభూతమై మనసులో తిష్ఠవేసుకున్నదంటే ప్రణయం ప్రళయంగా పరిణమించక తప్పదు అని ఈ సామెతల నుండి గ్రహించవచ్చు.

## 10

తెలుగు సామెత : ఇంటగెలిచి రచ్చగెలవాలి

బైబులు సామెత : నగరాన్ని జయించడం కన్నా తన్ను తాను గెలవడం లెస్స
(సామెతలు 16:32)

తెలుగు సామెతలోని ఒక సూక్ష్మమైన చమత్కారాన్ని ఆకళింపు చేసుకొంటే బైబిలు సామెతతో దీని సామ్యం అవగతమవుతుంది. ఇంట గెలవడమంటే తన స్వగృహంలో, స్వంత ఊరిలో అనే అర్థాలకు తోడు తనపై తాను అదుపు సాధించడమనే గూఢార్థం కూడా ఇమిడి ఉంది. ఇదే మరింత తేటతెల్లంగా బైబులు సామెతలో ఉన్నది.

రావణబ్రహ్మ ముల్లోకాలను జయించాడు. ఇంద్రాది దేవతలను పాదాక్రాంతం చేసుకున్నాడు. కానీ తనలోని అరిషడ్వర్గాలను జయించలేకపోయాడు. 'తన కోపమె తన శత్రువు' అని విజ్ఞులంటారు. అతడెంత వీరాధివీరుడైనప్పటికీ కోపతాపాలను జయించలేక పోయాడు. సాఫల్యాలకు, విజయాలకు తోడుగా శమదమాది సులక్షణాలున్నవాడే నిజమైన విజేత. సంయమనంతో మనసును అదుపులో ఉంచుకోగలిగినప్పుడే సాధించిన పేరు ప్రతిష్ఠలు శోభిస్తాయి.

ఇంట గెలవడమనేదానిలో భార్య అనుకూలవతిగా చరించడమనే సంగతిని కూడా మననం చేసుకోవాలి. ఇది తెలుగు సామెతలో ప్రధాన ప్రతిపాదన. బయట పులి, ఇంట్లో పిల్లి చందాన ఉండడంలో పరిపూర్ణత లేదు. గుమ్మడి కాయ ఎంత పెద్దదైనా కత్తిపీటకు లోకువ అన్నట్టు మహా ప్రజావాహినిని తన ఉపన్యాసంతో శాసించగలిగిన నేత ఇంట్లో భార్యా విధేయుడుగా ఉండడం పొసగదు. ఉద్యోగ వ్యాపారాలలో ఉన్నతస్థాయికి ఎదిగిన వ్యక్తి భార్య చెప్పుకింది తేలుగా ఉండడం శోచనీయం.

బైబులు సైతం క్రైస్తవ సమాజానికి నాయకుడిగా ఉండగోరే వ్యక్తి తన గృహస్థ జీవితంలో భార్యాబిడ్డలను అదుపులో ఉంచుకొన గలిగినవాడై యుండాలి అనే నియమం ఉంది. రచ్చబండ మీద కూర్చుని తీర్పులు చెప్పే ఊరిపెద్ద భార్య చేతిలో కీలుబొమ్మ అయితే రాణించదు. ఊరికి ఆదర్శంగా ఉండవలసిన కామందు తన పిల్లలను తుంటరి పనులు చేయకుండా వారించలేకపోవడం విడ్డూరమే. రాజులు,

సైన్యాధికారులు ముందు తమ అనుయాయులపై పూర్తిగా పట్టు సాధించి వారిని అదుపాజ్ఞలలో ఉంచుకోలేకపోతే వారి ఆధిపత్యం అంతంత మాత్రమే.

మొత్తంమీద రెండు సామెతల్లోనూ అంతరార్థం ఒక వ్యక్తి తన రాగద్వేషాలను అదుపులో పెట్టుకుంటూ, 'అతి'ని సర్వత్రా వర్జిస్తూ, తన నాలుకను, మనసును, ఇంద్రియాలనూ అదుపులో ఉంచుకొంటూ ఉండడం అత్యుత్తమం. అలా కానిపక్షంలో కోరికలు అదుపు తప్పి మనసు పరిపరివిధాల పోతూ ఉంటే అలాటి వ్యక్తి బాహ్యంగా ఎంత సఫలీకృతుడైనా, ఎన్ని నేర్చినా అదంతా నిరర్థకం అని గ్రహించాలి.

## 11

తెలుగు సామెత : ఇంటికి గుట్టు, మడికి గట్టు

బైబులు సామెత : గుఱ్ఱమునకు కొరడా, గాడిదకు కళ్లెము, మూర్ఖుని వీపునకు బెత్తము అవసరము (సామెతలు 26:3).

"రౌతు మెత్తనైతే గుఱ్ఱం మూడు కాళ్ళమీద నడుస్తుందని" సామెత. అంటే గుఱ్ఱాన్ని కొరడాతో దండించే రౌతు లేకపోతే అది సరిగా నడవదు. గాడిదకు కళ్లెం లేకపోతే, లేక గంతకట్టకపోతే అది మాట వినదు. అలాగే బెత్తంతో దండించకపోతే మూర్ఖుడు మాట వినడు. అంటే అదుపు చేయగలిగిన ఆయుధం లేనిదే గుఱ్ఱం, గాడిద, మూర్ఖుడు బుద్ధిగా పనిచేయరని అర్థం.

తెలుగు సామెతలో ఇంటికి గుట్టు, మడికి గట్టు అవసరమని ఉంది. గుట్టు లేని సంసారం వీధిన బడుతుంది. నవ్వులపాలై నలుగురి చేత నిరసించబడుతుంది. "సంసారానికి గుట్టు, రోగానికి రట్టు" అని మరొక సామెతలో కూడా ఇంటికి గుట్టు అవసరమనే భావం కనిపిస్తోంది. ఇంటి సంగతులు ఇరుగు పొరుగువారితో చెప్పుకుని వారు ఓదార్చుతారని భావిస్తే ఏదో సాయం చెస్తారని ఆశిస్తే, నిరాశ ఎదురుకావడమే కాకుండా, ఇంటి గుట్టు రచ్చకెక్కి మనం చులకనైపోతాం. కాబట్టి సంసారం గుట్టుగా సాగినపుడే సంఘంలో మర్యాద కలుగుతుంది. మాకవి లేవు, ఇవి లేవు. . . మా ఆయన అలాటివాడు, మా అత్త మామలు చాదస్తులూ. . . ఈ విధంగా ఇంటి విషయాలు బయటవేసుకుంటే మనం అందరికీ లోకువైపోతాం. "కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందన్న" సామెతలో కూడా ఇదే అర్థం ధ్వనిస్తుంది.

మడి అంటే పొలం, పొలానికి గట్టు కావాలి. అంటే హద్దని కూడా అర్థం ఉంది. ఇంత వరకు నా పొలం అని ఒక పరిమాణం ఉంటే అంతవరకు మనం బాగుచేసుకుని, పండించుకుని ఫలితాలను అనుభవించవచ్చు. 'గట్టు' అంటే చుట్టూ ఎత్తుగా పోసే కట్ట అని అర్థం. ఆ గట్టు (కట్ట) లేకపోతే మన పొలానికి పెట్టిన నీరు ప్రక్క పొలానికి పోయే ప్రమాదం ఉంది. కాబట్టి హద్దు విషయంలోను, మన పొలంలోని నీరు, సారం వేరొక పొలంలోనికి వెళ్ళకుండాను తప్పకుండా మడికి గట్టు అవసరం.

గుఱ్ఱానికి కొరడా లేకపోయినా, గాడిదకు గంత లేకపోయినా, మూర్ఖునికి బెత్తం లేకపోయినా ప్రమాదమే. అలాగే ఇంటికి గుట్టు లేకపోయినా, మడికి గట్టు లేకపోయినా ప్రమాదమే. కనుక ప్రమాదాల నుంచి బయటపడి సామాజిక జీవనం సవ్యంగా సాగాలంటే సామెతలలో చెప్పినట్లు అదుపు ఉండాలి.

## 12

తెలుగు సామెత : ఎవరు త్రవ్విన గోతిలో వారే పడతారు

బైబులు సామెత : ఎవడు త్రవ్విన గోతిలో వాడే పడును (సామెతలు 26:27; సీరా 27:26)

గుంటలు త్రవ్వడం, గోతులు తియ్యడం అనేవి జాతీయాలు. వీటికి ఎదుటివారికి కీడుచెయ్యడం అనే అర్థం వస్తుంది. ఎదుటివాణ్ణి పడగొట్టడానికి చాటుమాటుగా గుంట త్రవ్వడం అంటే అతనికి తెలియకుండా కుట్ర పన్నడం అని భావం. ఎదుటివాడిని పడగొట్టడానికి గుంట త్రవ్వితే దానిలో త్రవ్వినవాడే పడతాడని, ఎదుటివాడిని పాడు చెయ్యడానికి ప్రయత్నిస్తే తానే పాడైపోతాడని ఈ సామెతల భావం. ఇది ముమ్మాటికీ నిజం. బైబులులోనూ, తెలుగు సాహిత్యంలోనూ నేటి మానవ జీవితాలలోనూ ఈ సామెతలకు అనేక తార్కాణాలు కనిపిస్తుంటాయి. ఉదాహరణకు ఎస్తేరు గ్రంథంలోని హామాను మొర్దెకయిని చంపించబోయి తానే చనిపోవలసి రావడం ఇందుకు మంచి ఉదాహరణం.

'చెఱపకురా చెడేవు' అనే మరొక తెలుగు సామెతను దీనికి సమానార్థకంగా చెప్పుకోవచ్చు. మనం ఒకరిని నాశనం చెయ్యాలని భావిస్తే, మనమే నాశనానికి

పరుగెత్తుతున్నట్టు లెక్క. ఒకరిని పాడుచెయ్యడానికి పరుగెత్తేవాడు తానే పాడైపోయిన సంఘటనలు కోకొల్లలు. యేసు కూడా ఇదే విషయాన్ని పలుమారులు ప్రస్తావించాడు. మీరు ఏది చేస్తే, అదే మీకు సంభవిస్తుందని ప్రబోధించాడు. 'మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరల కొలువబడు'నని యేసు చెప్పాడు (లూకా 6:38).

'చేసుకున్నమ్మకు చేసుకున్నంత మహదేవ' అని ప్రజాబాహుళ్యంలో మరొక సామెత ఉంది. ఎవరు ఎంత చేసుకుంటే అంత ప్రయోజనం కలుగుతుందని భావం. దీనిలో కూడా మనం ఏది చేస్తామో దాని ఫలితాన్నే పొందుతామనే భావనే ఉంది. "తనను కట్టివేయడానికి తానే తాడు తెచ్చుకున్నట్టు" అనే సామెత కూడా దీనికి సమానమైనదే. కాబట్టి తాను త్రవ్వుకున్న గోతిలో తానే పడ్డాడు అనే తెలుగు సామెత, బైబులు సామెత నిత్య జీవితాలలో క్రియారూపం దాలుస్తున్నవే.

కాబట్టి ఒకరికి హాని చెయ్యాలని తలంచకుండా ఉంటే తనకే హానీ కలుగదని నమ్మవచ్చు. తాను ఇతరుల కోసం గుంట త్రవ్వితే, ఇతరులను మోసం చెయ్యాలని భావిస్తే తానే గుంటలో పడడం, మోసపోవడం ఖాయం అని కూడా భావించవచ్చునని ఈ తెలుగు, బైబులు సామెతలు చెబుతున్నాయి.

## 13

తెలుగు సామెత : ఎవరూ దొంగిలించలేనిది చదువొక్కటే

బైబులు సామెత : వెండి బంగారములను చేకూర్చుకొనుట కంటె విజ్ఞానమును ఆర్జించుట మేలు (సామెతలు 3:14)

ప్రజల స్మృతి పథంలో అనుభవ పూర్వకంగా ఉదయించి నలుగురి నోళ్ళలో నానే నిత్య సత్యాలే కవిపుంగవుల, నీతివేత్తల కలాల నుండి సాహిత్యంగా జాలువారుతాయి. విద్యకుండిన అసమాన విలువను ప్రస్తుతిస్తూ భర్తృహరి నుడివిన 'హర్తుర్యాతినగోచరం' శ్లోకాన్ని కమనీయమైన తెలుగులో ఏనుగు లక్ష్మణ కవి ఇలా తెనిగించాడు:

'హర్తకుగాదు గోచర మహర్నివేశమున్ సుఖపుష్టిసేయు స
త్కీర్తి ఘటించు విద్య యను దివ్య ధనం బఖిలార్థ కోటికిం
బూర్తిగ నిచ్చిననె బెరుగు బోదు యుగాంతపు వేళనైన భూ
భర్తలు తద్ధనాధికుల పట్టున గర్వము మాను టొప్పగున్'

భుజకీర్తులు, వడ్డాణాలు, చంద్రహారాలు తదితర ఆభరణ విశేషాలు, స్నానాదికాలు, చందనలేపనాలు, చిత్ర విచిత్ర కేశాలంకరణ మొదలైనవేవీ అలంకారాన్నియ్యజాలవు. జ్ఞానపూరితమైన వాగ్భూషణమే నిజమైన భూషణం. విద్యయే నిక్షేపంగా దాచిపెట్టుకొన్న ధనం. విద్యయే సుఖదాయకం; విద్యయే గురుతుల్యం స్వదేశీమిత్రుడు విదేశ బంధువు విద్యయే; విద్యయే నృపాల పూజితం అంటూ విద్య విశిష్టతను కొనియాడారు పండితులు. విద్యలేనివాడు వింత పశువు అన్నారు.

బైబులు సామెత ఇదే ఆదర్శాన్ని వక్కాణిస్తూ సువర్ణరత్నమణి మాణిక్యాలు విద్యకు సాటిరావనీ, విజ్ఞాన సముపార్జనే అన్ని సంపదలకన్నా మిన్నయనీ తీర్మానిస్తున్నది. ఈ సామెతకు కర్తయైన సొలోమోను తత్త్వసారాంశాన్ని తెలుపుతూ 'జ్ఞానమునకు నీ చెవియొగ్గి హృదయపూర్వకముగా వివేచన నభ్యసించిన యెడల. . . వెండిని వెదకినట్లు దాచబడిన ధనమును వెదకినట్లు దానిని వెదకిన యెడల ... విజ్ఞానము నీకు లభించును' (సామెతలు 2:3–5) అని సిద్ధాంతీకరించాడు.

తథాగతుని మహాపరి నిర్వాణ సమయంలో పరిపూర్ణ జ్ఞానోదయానికి ముందటి జాములో అతనిలోని అవిద్య నశించింది. ఆ పైననే అతడు సంబుద్ధుడైనాడు. యౌవనం దేహాన్ని విడిచిపోవచ్చు, సిరి తరలిపోవచ్చు, సతీసుత బంధుగణం విసర్జించవచ్చు. తాను సముపార్జించిన విద్యను తన నుండి ఎడబాపగల వారెవరూ లేరు. వేరొకరు దోచుకొనగలిగిన దానిని, మనలను విడిచిపోయే ఆస్కారమున్నదానినీ లెక్కకు మిక్కిలిగా సంపాదించి తుదకు భంగపాటు చెందడంకంటే, ఎవరూ మననుండి అపహరింపలేని విద్యాధనాన్ని సంపాదించడం విజ్ఞుల లక్షణం.

## 14

తెలుగు సామెత : ఓటి కుండలో నీరు పోసినట్టు

బైబులు సామెత : దూబర ఖర్చులతో సంసారమును నాశము చేసుకొనువానికి
ఏమియు మిగలదు (సామెతలు 11:29)

నీరు నిలవాలంటే సరియైన పాత్రలో పొయ్యాలి. పగిలిన కుండలో నీళ్ళు పోస్తే నీళ్ళు నిలవవు. ఎంత సంపాదిస్తున్నామని లెక్క చూచుకోవడం కంటే ఎలా ఖర్చుపెడుతున్నామని పరీక్ష చేసుకోవడం ముఖ్యం. అహోరాత్రులు కష్టించి పనిచేసి రెండు చేతులా సంపాదించి, వ్యర్థంగా ఖర్చుపెడితే కష్టమంతా నేలపాలైనట్టే. ఎంతో కష్టపడి నీళ్ళు తెచ్చి పగిలిపోయిన ఓటి కుండలో పోస్తే ఆ నీళ్ళు నిలబడవు. దివారాత్రులు కష్టపడి సంపాదించిన సొమ్మును దుర్వ్యయం చేస్తే అది నిష్ప్రయోజనం! అటువంటి సందర్భాలను తెలియజేయడానికి ఈ తెలుగు సామెతను ఉపయోగిస్తారు.

దీనికి దీటైనదే బైబులు సామెత కూడా. దుబారా ఖర్చులతో సంపాదనను నష్టపరచుకొనే వారికి, చివరకు మిగిలేది చింతలే. డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో, దాన్ని సరియైన అవసరాలకు సద్వినియోగం చేయడం కూడా అంతే ముఖ్యం. దుబారా ఖర్చులు చేయకూడదని, ఆ విధంగా ఖర్చు చేసుకుంటూ పోతే మిగిలేది శూన్యమనీ ఈ బైబులు సామెత తెలియజేస్తుంది.

ఆధునిక యుగంలో చాలామంది దుర్వ్యయాన్ని అరికట్టలేకపోతున్నారు. అనేక దురభ్యాసాలకు లోనై కష్టార్జితాన్ని వ్యర్థం చేసుకుంటున్నారు. ఆడంబరాలకు పోయి ఆస్తిపాస్తులు నాశనం చేసుకుంటే చివరకు మిగిలేది కటిక పేదరికమే. భార్యాబిడ్డలను, బంధువులను, హితులను, స్నేహితులను బాధించి, అనవసరమైన ఖర్చులు పెడితే బాధలు తప్ప ఫలితం లేదు. ఎంత సంపాదించినా ఖర్చును నియంత్రించకపోతే కడగండ్లే. ఎన్ని నీళ్ళు తెచ్చి ఓటి కుండలో పోసినా అవి నేలపాలే. ఈ రెండు సామెతలు ఒకే అర్థాన్ని తెలియజేస్తున్నాయి.

## 15

తెలుగు సామెత : ఓడలు బండ్లగును, బండ్లు ఓడలగును
రాజు కింకరుడగును, కింకరుడు రాజగును

బైబులు సామెత : బానిసలు గుఱ్ఱములనెక్కి తిరుగగా, రాకుమారులు బానిసలవలె కాలి నడకన పోయిరి (ఉపదేశకుడు 10:7)
అడవి సేద్యపు నేలయగును, సేద్యపు నేల అడవియగును (యెషయా 29:17)

మానవుడు కష్టజీవి. కష్టపడి పనిచేసి తన ఐశ్వర్యాన్ని, సంపదలను పెంచు కుంటాడు. ఆ క్రమములో లేమి నుండి కలిమి గలవానిగా మారతాడు. తనమీద తనకు గల నమ్మకముతో ప్రణాళిక ప్రకారము సాగే పనులతో కొద్ది కాలములోనే ఐశ్వర్యవంతుడవచ్చు. దీనిని సూచిస్తూ బండ్లు ఓడలవుతాయి, ఓడలు బండ్లవుతాయి అనే సామెత పుట్టింది. బండి మనిషి సాధారణ జీవితానికి గుర్తు. ఓడ పరిమాణం లోనూ, విలువలోనూ పెద్దదే, బండి స్థాయి నుండి ఓడ స్థాయికి వెళ్ళడమంటే బాగా ఎదిగినట్లే. అదే విధంగా కొందరు తమకున్న కలిమిని వృద్ధిపరచు కోవలసింది పోయి, అనవసర ఖర్చులకు, భేషజాలకు పోయి ఉన్నదంతా హరించివేస్తారు. కొద్ది కాలంలో సాధారణ జీవితానికి వచ్చేస్తారు. అప్పుడు ఓడలు బండ్లు అయినట్టే. అంటే నిరంతరం తనను తాను మెరుగుపరచుకోవడానికి కష్టపడనివాడు తప్పకుండా పరాజయాన్ని చవిచూస్తాడు. ఈ విషయం ఐశ్వర్యంలోనే కాదు, హోదాలోనూ, తెలివిలోనూ అన్ని విషయాలలో జరగవచ్చు. ఇంతటి లోతైన విషయాన్ని అర్థమయ్యే రీతిలో 'రాజు కింకరుడగును, కింకరుడు రాజగును' అనే మరొక తెలుగు సామెత చెబుతుంది. ఇదే విషయాన్ని వేరే ఉపమానాలతో బైబులు సామెతలు కూడా చెబుతున్నాయి.

## 16

తెలుగు సామెత : కడుపు నిండితే గారెలు చేదు

బైబులు సామెత : తేనె కూడా మితిమీరి భక్షింపరాదు, భక్షించినచో వాంతియగును (సామెతలు 25:16)

ఆకలి వేసినవాడికి అన్నం రుచిస్తుంది గాని, కడుపు నిండినవానికి ఏ పదార్థం రుచించదు. ఇటువంటి పరిస్థితులను వివరించడానికి ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు. బైబులు సామెతలో కూడా ఇదే అర్థం ఉంది. తేనె మంచిదే, తీయనైనదే. మితంగా తీసుకుంటే సంతృప్తి కలుగుతుంది. అలా కాకుండ మితిమీరి భుజిస్తే వాంతి చేసుకోవలసి వస్తుంది. కడుపు నిండినవానికి గారెలు పెట్టడం ఎలాంటిదో తేనెను మితిమీరి త్రాగడం కూడా అలాంటిదే.

'అతి సర్వత్ర వర్జయేత్' అన్నారు పెద్దలు. ఏదైనా సామాన్య స్థితి దాటనంత వరకూ బాగానే ఉంటుంది. అతిగా పోయినట్లయితే అభాసుపాలవుతుంది. ఇదే భావాన్ని ఈ రెండు సామెతలు సమానంగా వివరిస్తున్నాయి.

## 17

తెలుగు సామెత : కన్నవారి కంటె ఘనులు లేరు

బైబులు సామెత : తల్లిదండ్రులను గౌరవింపుము
(నిర్గమకాండము 20:12; సీరా 7:27)

తల్లిదండ్రులను సన్మానించడం పరమ ధర్మము అని అన్ని సంస్కృతులు చెబుతున్నాయి. అయితే పెండ్లాము బెల్లమనీ తల్లిదండ్రులు అల్లమనీ ఎంచే తనయులు కోకొల్లలుగా ఉండడం విచారించవలసిన వాస్తవం.

మాతృదేవోభవ, పితృదేవోభవ అనే ఆర్యోక్తి తెలుగువారికి ఉగ్గుపాలతో పోసే ఆదర్శం. జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ అని దాశరథి నోట వెలువడిన అమృతవాక్కు సకల భరతావనికి ఆచంద్రతారార్కం తారక మంత్రం.

బైబులు సృష్టి క్రమం ప్రకారం ఆది మానవుడు ఆదాముకు తల్లీతండ్రీ దేవుడే. తానందరితో ఉండడం అదృశ్యరూపంలోనే గనక ప్రత్యక్ష దైవాలుగా మాతాపితల నుంచాడా భగవంతుడని పెద్దలంటారు. అందుకే బైబులు ధర్మశాస్త్రానికి పిండితార్థమైన పదియాజ్ఞలలో తల్లిదండ్రులను సన్మానించుమనే ఉవాచ సామెతగా వాసికెక్కింది.

వృద్ధులైన తల్లిదండ్రులను కావడిలో మోసిన శ్రావణ కుమారుడు ప్రాతః స్మరణీయుడు. ధర్మవ్యాధుని చరిత్ర ఆదర్శప్రాయం, ఆచరణీయం. అతడు జంతు మాంస విక్రేత అయినప్పటికీ తల్లిదండ్రులను దేవతలనుగా చూచుకొంటున్న కారణాన ఆదర్శ పురుషుడైనాడు. జననీ జనకులు అనవరతం పూజనీయులని ఈ సామెతలు ఘోషిస్తున్నాయి.

## 18

తెలుగు సామెత : కష్టేఫలి
కష్టపడి సుఖపడమన్నారు

బైబులు సామెత : కష్టించి పనిచేయువాడు అధికారి యగును
(సామెతలు 12:24)
కష్టించి పనిచేయువానికి అన్నియు సమృద్ధిగా లభించును
(సామెతలు13:4)

కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు. ఈ తెలుగు బైబులు సామెతలు ఇదే భావాన్ని ప్రతిపాదిస్తున్నాయి. పరిశ్రమ చేసిన వాడెన్నటికీ నిరుపేద కాడు. అంటే ఫలితం తప్పక ఉంటుంది. అయితే మొదట ప్రయత్నించి శ్రమించి ఆ మీదట ఫలితం పొందవలసి ఉంటుంది.

కష్టపడి పనిచేసినవాడికి ఆ కష్టానికి తగిన ప్రతిఫలం తప్పక లభిస్తుంది అన్నది మానవ అనుభవం. వేసవికాలంలో చీమలు నిర్విరామంగా ఆహారాన్ని నిల్వ చేసుకొనేందుకు శ్రమిస్తాయి. ఫలితంగా వర్షా కాలంలో వెచ్చగా తమ పుట్టల్లో ఉండిపోయి సుఖాన్ని అనుభవిస్తాయి. సాంసారిక జీవనంలో కూడా ఇదే సత్యాన్ని వేమన కనుగొన్నాడు:

'మగని కాలమందు మగున కష్టించిన
సుతుల కాలమందు సుఖము పొందు'

కడుపు కట్టుకొని అహర్నిశలూ కాయకష్టం చేసి పిల్లల్ని చదివించుకొంటారు. ఆ పిల్లలు ప్రయోజకులై కన్నవారిని సుఖపెడతారు.

కలిమి లేముల వలె సుఖదుఃఖాలు కూడా కావడి కుండలే. ప్రకృతి ధర్మం ప్రకారం కష్టం చేసినవాడు దాని ఫలం అనుభవించక మానడు. ఇష్టారాజ్యంగా పిత్రార్జితాన్ని గుటకాయ స్వాహా చేసినవానికి ఇనుపగజ్జెల తల్లి సహవాసం అనివార్యం. ఉద్యోగిస్తేనే విజయం. అప్రయత్నంగా ప్రాప్తించే ఫలం అదృష్టవశమే. ధీరుడు అటువంటిదానికి అర్రులు చాచడు.

బైబులు సామెతలు కష్టజీవికి అధికారం లభిస్తుందని సౌభాగ్యం అబ్బుతుందని చెబితే తెలుగు సామెతలు పరిశ్రమ వల్ల ఫలముంటుందనీ సుఖముంటుందనీ చెబుతున్నాయి. తరతరాల మానవ అనుభవాల నుండి పుట్టిన ఈ సామెతలలోని ప్రబోధం శిరోధార్యం.

## 19

తెలుగు సామెత : కీలెరిగి వాతపెట్టాలి

బైబులు సామెత : తగిన సమయములో మందలించవలెను (సీరా 20:1)

దారితప్పిన వ్యక్తిని, స్థితిని మరలా మంచిదారిలో పెట్టాలంటే అదను చూచి ఆ పని చేయాలని ప్రతిపాదిస్తున్నాయి ఈ సామెతలు.

యువతీయువకులు వాడిలో వేడిలో తమకిష్టమైన దారిలో వడివడిగా వెళ్ళి పోతుంటారు. అడుగడుక్కీ వారిని అడ్డగిస్తూ, వారి మనసెరగకుండా మందలిస్తూపోతే పరిస్థితి విషమిస్తుంది గానీ దారికి రాదు. తెలుగు సామెత గ్రామీణ వైద్య విధానాలలో ఒక ప్రక్రియ సాయంతో ఈ భావాన్ని ప్రతిపాదిస్తున్నది. గతంలో నాటు వైద్యులు కీళ్ళవాతానికి సరిగ్గా కీలుపైన చర్మానికి ఎర్రగా కాలిన లోహంతో వాతపెట్టేవారు కాబోలు. కీళ్ళవాతం నొప్పి ఉన్నచోట అటూ ఇటూ కాకుండా ఖచ్చితంగా వాతపెడితనే కార్యం సఫలమవుతుంది గానీ ఇష్టం వచ్చిన చోటెల్లా వాతలు పెడితే తాపం, వాతలు తప్ప ప్రయోజనం ఉండదు. అందుకే సరైనచోట సరైన నివారణోపాయం ప్రయోగించాలన్నది శాస్త్రం.

చదువుసంధ్యలు కౌమార్యంలో, పెండ్లి యవ్వనంలో, బరువు బాధ్యతలు దాంపత్యంలో, వైరాగ్యం వృద్ధాప్యంలో శోభిస్తాయి. అలా జరగనప్పుడు హితవు చెప్పే సందర్భాలలో ఈ సూత్రాన్ని మరింత జాగ్రత్తగా పాటించాలి. ఎవరినైనా మందలించి మంచి దారికి మళ్ళించాలంటే ఏదో మొక్కుబడికన్నట్టు ముక్తసరిగా అసందర్భంగా ఆ పని కానిస్తే ఫలితముండదు. ఎవరికెలా చెబితే నప్పుతుందో పరివర్తన కలుగుతుందో గ్రహించి నిర్వర్తించాలి అన్నది ఈ సామెతల సారం.

## 20

తెలుగు సామెత : కుడిచేయి చేసే దానము ఎడమ చేయి ఎరుగరాదు

బైబులు సామెత : నీవు దానము చేయునప్పుడు నీ కుడిచేయి చేయునది నీ ఎడమ చేతికి తెలియకుండునట్లు రహస్యముగా చేయుము (మత్తయి 6:3)

బహుశః బైబులు సామెతను అనుసరించి ఈ తెలుగు సామెత వెలుగులోకి వచ్చి ఉండవచ్చు. ఏది ఏమైనా ఉన్నదానిలో కొంత లేనివాళ్ళకు ఇవ్వడమనేది ఉత్తమ లక్షణాలలో ఒకటి. ఎంతసేపూ నావాళ్ళకు దాయాలి లేక నావాళ్ళకు ఏమివ్వాలి అనుకునేకంటే, ఏమీ లేనివాళ్ళకు ఇవ్వడం వల్ల వాళ్ళను సంతోషపెట్టిన వాళ్ళము అవుతాము. మనకు కూడా ఎక్కడ లేని సంతృప్తి లభిస్తుంది. కానీ, నేటి సమాజంలో చాలామంది తమ గొప్పను ప్రదర్శించడానికో, లేక తాము గొప్ప దానగుణము కలవారమని నలుగురు చెప్పుకోవడానికో దానధర్మాలు చేస్తుంటారు. కానీ అలా చేయడం వల్ల గొప్పదనమేముంది? ఎవరైనా అలాగే చేస్తారు. ఉత్తములు, గుణవంతులు ఎక్కువగా గుప్తదానాలు చేస్తారు. వారు చేశారని ఎవరికీ తెలియనివ్వరు. తాము చేసేటప్పుడు కుడి చేయి చేసేది ఎడమ చేతికి తెలియకుండా ఉండాలంటే అసలు దానము ఎంత రహస్యంగా చేయాలో అర్థమవుతుంది. రహస్యంగా చేయుట వలన అందరి మెప్పు కోసమో, గొప్ప కోసమో కాక ఇతరులను పైకి తేవాలనే ఉద్దేశ్యముతో చేసినట్లు అవుతుంది. అందుకే వేమన 'పెట్టి చెప్పరాదు పేదకైన' అని అంటాడు.

మనం చేసే సహాయాలు అందరికీ తెలుస్తూ ఉండడంలో ఒక ఇబ్బంది ఉంది. దానం చేసేవాడి ప్రతిష్ఠ పెరుగుతుంది గానీ దానం పుచ్చుకునే వారిని అది ఒక రకంగా కించపరచినట్టే. ప్రియ వచనములతోడి దానము, సర్వత్రా కాంక్షణీయమని మన సంప్రదాయ సాహిత్యం ఘోషిస్తున్నది. ఇచ్చేది అప్పు అయినా దానమిచ్చినట్టు ఎంచుకొంటూ రుణగ్రహీతను బిచ్చగాని వలె చూచే మహానుభావులున్నారు. తాను క్రొవ్వొత్తిలాగా కరిగిపోతూ దానధర్మాలతో ఆర్తులను అదుకొనే పుణ్యాత్ములు కొందరైతే యేడాదికొకసారి నలుగురికి, సంతర్పణ గావించి వార్తాపత్రికల్లో వేయించుకొనే అయ్యలు మరికొందరు.

ఈ సామెతలు దాన గుణానికి సంబంధించి ఒకానొక ఉదాత్త తత్త్వాన్ని సరళమైన మాటల్లో వక్కాణిస్తున్నాయి.

## 21

తెలుగు సామెత : కూటికి పేద గానీ కులమునకు (గుణమునకు) పేద కాదు

బైబులు సామెత : నిరుపేద అయినప్పటికీ పాపము చేయనివాడు గొప్పవాడు (సీరా 20:21)

శ్రమైక జీవన సౌందర్యం అతి విలక్షణమైనది. ఆరుగాలాలూ కండలు కరిగించి పనిచేసి చేతికి వచ్చిన నాలుగు రాళ్ళతో కలో గంజో త్రాగి సంతృప్తిగా జీవనం సాగించే కార్మిక కర్షకాది శ్రమజీవుల్లో తరచుగా నిఖార్సైన నైతిక విలువలు ఉండడం గమనిస్తుంటాము. అలాటివారిని నీతి తక్కువవారనీ, అలగా జనమనీ, పామరులనీ విమర్శిస్తుంటారు ధనికులూ, ఆస్తిపరులూ. స్థూలంగా చూస్తే లోకంలో నిరుపేదల్లో ఉండే నైతిక వర్తన ధనికుల్లో అగుపించదు. గుణగణాలు అనేవి ధనధాన్యాదుల మూలంగా, కులగోత్రాల మూలంగా రావు. పేదలకు కల్లలు, కుత్సితాలు తెలియవు. ఏ పూటకాపూట కడుపుకిన్ని మెతుకులు పడితే సంతసించే అమాయక ప్రాణులు వారు. వారికి ఆస్తులు కూడబెట్టాలన్న అత్యాశ ఉండదు. నయగారాలు, వంచనలు వారికి అవసరం లేదు.

'నక్క వినయములును, నయాగారములు బల్కి, కొడుకు ధనము గూర్ప నడగుచుంద్రు' అంటూ వేమన ధన సముపార్జనకై అడ్డదారులు తొక్కే ధనికులను ఆక్షేపించాడు. ఏపూటకాపూట కడుపు నిండితే చాలనుకునే పేదలకు ఇలాటి మెరమెచ్చులు, మోసాల అవసరం ఉండదు.

ఇకపోతే ధన సముపార్జనకై కాని పనులకు పోవడం మాట అటుంచి దైనందిన జీవితంలో సత్యసంధత, కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడడం, స్నేహ సంబంధాల విషయంలో ఋజువర్తనం, తాను ఇంత తిని ఎదుటి వ్యక్తికి కొంత పెట్టడమనే ఔదార్యం తదితర సద్గుణాలు సైతం పేదలలో కనిపిస్తాయి. వీటన్నిటిని బట్టి కూటికి పేద అయినా గుణానికి పేద కాదు అనే నానుడి సహజంగానే జన సామాన్యంలో జనించి అక్షర సత్యంగా నిలిచింది.

## 22

తెలుగు సామెత : గంగిగోవు పాలు గరిటెడైనను చాలు, కడివెడైన నేమి ఖరము పాలు?

బైబులు సామెత : ద్వేషంతో వడ్డించిన మంచి మాంసం కంటే ప్రేమతో పెట్టిన పట్టెడు శాకాహారం మేలు (సామెతలు 15:17)

మనం ఇతరులకు చేసేది స్వల్పమైనదైనా ఆప్యాయంగా, ఇష్టంగా చేయాలని తెలుపుతూ, ధుమధుమలాడుతూ భారీ మొత్తంలో మేలు చేసేదైనా అందుకు సాటిరాదన్న సుభాషితం పై రెండు సామెతలలోనూ ద్యోతకమవుతున్నది.

తెలుగు సామెతలోని గంగిగోవు శబ్దం అత్యంత ప్రియమైనది. గోవు అన్నప్పుడే మనస్సుకు ఒక సానుకూలమైన భావం స్ఫురిస్తుంది. తెల్లగా, సాధువుగా, ఎవరిపైకీ కొమ్ము విసరక, అతి బలిష్టమైనదైనా, అత్యంత సౌజన్యంగా ప్రవర్తించే ఆవు ప్రేమ, ఆప్యాయతలకు, మాతృత్వానికి ప్రతీక. 'గోవు' కు గంగి శబ్దం జోడించడంతో ఆ పవిత్ర భావం ద్విగుణీకృతమయినది. గంగి అంటే సాధువైనది, పూజ్యమైనది. కల్మషపాదుడనే రాక్షసుడు తన భర్తను భక్షించబోతుండగా ఒక బ్రాహ్మణ స్త్రీ అతనిని ప్రాధేయపడుతూ 'అన్నా, చెల్లెల నయ్యెదన్ విడువు నీ కన్నంబు వెట్టింతు నా హృన్నాథున్, ద్విజు, గంగికుట్టి నకటా హింసింపనేలయ్యా' అంటుంది (భాగవతము 9. 246).

అటువంటి గోమాత పాలు ఒక్క గరిటెడు ఇచ్చినా కొండంత తృప్తి, ఫలం. ఆ ఇవ్వడంలో మాతృత్వపు మమకారం ఉట్టిపడుతుంది. గాడిదపాలు కడవలకొద్దీ పోసినా ఫలమేమిటి? గంపల కొద్దీ ఉమ్మెత్త పూలు ఒక్క తులసీదళం పాటిచెయ్యవు ధార్మికులకు. పగవాడు గంటల తరబడి ఇచ్చకాలు పలికినా, ఇంటి పెద్ద వాత్సల్యంతో పలికే ఒక్క మందలింపు మాట కన్నా దిగదుడుపే. ఇదే భావం బైబులు సామెత కుటుంబ జీవన సరళికి మరింత దగ్గరైన ఉపమానంతో చెబుతున్నది. మమతాను రాగాలతో తల్లి, లేక ప్రియ భాషణంతో ఇల్లాలు సరసన కూర్చుని పచ్చడి మెతుకులు వడ్డించినా కడుపు నిండుతుంది. ఈసడించుకుంటూ కుక్కకు కబళం వేసినట్టు చిత్రాన్నాలు, మాంసాహారాలు కంచంలో విసురుతుంటే సజ్జనులకు కంటగింపుగా తోస్తుంది గానీ అన్నం తిన్న సంతుష్ఠ భావన కలుగదు.

తెలుగు సామెతా, బైబులు సామెతా కూడా, చేసేది కొంచెమైనా సత్సంకల్పంతో చేస్తే పుణ్యముంటుంది గానీ, నిరాసక్తంగా, అన్యమనస్కంగా, మొక్కుబడిగా చేసేది

రాణించదని ఘోషిస్తున్నాయి. ఆర్భాటంగా, పదుగురి మెప్పు కోసం మహా క్రతువును జరిపించడంకన్నా, నిర్మల హృదయంతో సర్వేశ్వరుని స్మరించి ఒక్క నమస్కారం పెట్టుకుంటే ఆ రోజుకు అది చాలు కదా!

## 23

తెలుగు సామెత : గట్టి గింజలు విడిచి పొట్టుకు పోరాడినట్లు

బైబులు సామెత : ఆకలి తీర్చజాలని రొట్టె మీద మీ ధనమును వెచ్చింపనేల?
తృప్తి కలిగింపని దానిపై మీ వేతనము ఖర్చు చేయనేల?
(యెషయా 55:2)

సృష్టి వైచిత్ర్యమొకటున్నది. ప్రాణులన్నీ తమ ప్రధానమైన అవసరాల కోసమే శ్రమిస్తాయి, అనుభవిస్తాయి. మానవుడే ఏ కారణం చేతనో వ్యర్థమైనవాటి కోసం ప్రాకులాడుతాడు. తుమ్మెద, రాజహంస తదితర ప్రాణులు సర్వశ్రేష్ఠమైన వాటిని ఏ విధంగా ఎంచుకుంటాయో బమ్మెర పోతన శ్రీ మహా భాగవతం (7:150) లో లలిత రమణీయంగా అభివర్ణించాడు గదా!

'మందార మకరంద మాధుర్యమునదేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికల దూగు
రాయంచ సనునె తరంగిణులకు
లలిత రసాలపల్లవ ఖాదియై చొక్కు
కోయిల సేరునే కుటజములకు
పూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరక
మరుగునే సాంద్ర నీహారములకు'

ప్రహ్లాదుని దృష్టికి యోగ్యమైనదొక్కటే. ఋజుమార్గంలో ఆ విష్ణుభక్తి మార్గం వీడక చరించడం. పవిత్ర గ్రంథం సహితం –

'...ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో ఏవి పవిత్రమైనవో ఏవి రమ్యమైనవో ఏవి ఖ్యాతి గలవో వాటి మీద ధ్యానముంచుడి" (ఫిలిప్పీయులకు

4:8) అని ఉద్బోధిస్తున్నది. రైతు ముప్పొద్దులా కష్టించి పంట సిద్ధమయ్యాక తప్ప, తాలు పోగుచేసుకొని గట్టి గింజలను కళ్లంలో విడిచివెళితే అతనిని వెఱ్ఱివాడంటారు. కష్టించి పనిచేసి రక్తం చెమటగా మార్చి కూలి డబ్బులు సంపాదించిన కార్మికుడు కల్లు దుకాణంలో ఆ మొత్తాన్ని తగలబెట్టి ఇల్లు చేరితే ఫలితమేమిటి? బైబులు సామెత ముఖ్యంగా మనిషి తన దుర్వ్యసనాలకు బానిసై ధనాన్ని దుర్వినియోగం చేయడంపై దృష్టి సారించింది.

ఈ సామెతల్లో దుర్వినియోగ దుర్వ్యాపార అభిశంసన మున్నది. పనికిమాలిన సుద్దులతో ప్రొద్దు పుచ్చక తనకు తనవారికి ప్రయోజనం చేకూర్చే వ్యాపకంలో నిమగ్నం కావాలనే సందేశమున్నది.

అయితే వీటన్నిటి వెనుక ఉన్న ఆధ్యాత్మిక  భావనను విస్మరించతగదు. ఇహలోక జీవన వ్యాపారాలలో చిక్కుకొని పరలోక చింతన, దైవాన్వేషణాలను నిర్లక్ష్యపెట్టి వ్యర్థులవుతారు మానవులు. బుద్బుద ప్రాయమైన జీవితంలో చేయవలసిందొక్కటే – బ్రహ్మతత్త్వం శోధించి దైవ సాన్నిధ్యానికై శ్రమించడం.

ధన సముపార్జనం, దారాపుత్రుల పైని భ్రమలు ఇవన్నీ కంచి గరుడసేవలేనన్న తాత్త్విక జ్ఞానం కూడా ఈ సామెతలలో వ్యక్తమవుతున్నది.

అయితే ముందు చెప్పినట్టుగా ఈ సామెతలలో దైనందిన జీవితంలో లేనిపోని డాబులకు, భేషజాలకు, దుర్వ్యసనాలకు పోక ప్రధానమైన విషయాలనే పట్టించు కుంటూ జీవించాలన్నది ప్రధాన సందేశంగా భావించవచ్చు.

## 24

తెలుగు సామెత : గ్రుడ్డివాడు గ్రుడ్డివానికి దారి చూపినట్టు

బైబులు సామెత : గ్రుడ్డివాడు గ్రుడ్డివానికి త్రోవ చూపిన యెడల వారిద్దరు గుంటలో పడుదురు గదా (లూకా 6:39)

గ్రుడ్డివానికి ఏ వస్తువూ కనిపించదు. అతడు దారిలో సరిగా నడవలేడు. అటువంటి అంధుడు మరొకరికి యెలా దారి చూపిస్తాడు? వారిద్దరూ గుంటలో పడతారు కదా. ఇదే విషయాన్ని పోతన భాగవతంలో ప్రహ్లాదునితో పలికిస్తాడు

“కాననివాని నూతగొని కాననివాడు విశిష్ట వస్తువునే కానని భంగి...” అంటాడు. విశిష్టమైన వస్తువును చూడడం గాని, దారిలో నడిచే వేరొకరికి దారి చూపడం గాని కేవలం కళ్ళున్న వాళ్ళకే సాధ్యమవుతుంది. “అంధునకు కౌఅమె వెన్నెల?” అంటాడు మనుచరిత్రలో ఆంధ్రకవితా పితామహుడు అల్లసాని పెద్దన.

జాగ్రత్తగా పరిశీలిస్తే అసలీ అంధత్వం బాహ్య నేత్రాలకు కాదు, అంతర్నేత్రాలకేనని మన బుద్ధికి తోచక మానదు. నీతి మార్గం తెలియనివాడు జ్ఞానమంటే, వినయమంటే ఏమిటో అంతుబట్టనివాడు, వేరొకనికి నీతిని గూర్చి, జ్ఞాన వినయాలను గూర్చి ఏమని బోధిస్తాడు? సన్మార్గమంటే ఏమిటో, ధర్మశాస్త్రమంటే ఏమిటో, అసలు ధర్మమంటే ఏమిటో అవగాహన లేనివాడు సన్మార్గాన్ని గూర్చి ధర్మశాస్త్ర పద్ధతిని గూర్చి ఏమని ప్రబోధిస్తాడు? యేసు చెప్పిన సామెతలోని గూఢార్థం ఇదే. ఆనాటి శాస్త్రులు, పరిసయులు ధర్మశాస్త్రాన్ని, సత్యమార్గాన్ని అవగాహన చేసుకొనకుండా, కొన్నిటి యెడల అవగాహన ఉన్నా, ఆచరించకుండా ప్రజలకు వాటిని గూర్చి బోధించారు. దానిని యేసు వ్యతిరేకించాడు. అవగాహన లేని శాస్త్రులను, పరిసయ్యులను యేసు గ్రుడ్డివారితో పోల్చాడు. “వారు గ్రుడ్డివారైయుండి, గ్రుడ్డివారికి త్రోవ చూపువారని” పేరు పెట్టారు. నిజానికి కళ్ళున్నవాడే, అనగా జ్ఞాన సంస్కార సంపత్తి గలవాడే ఇతరులకు దారి చూపిస్తాడు. యథార్థమైన ధర్మమార్గోపదేశం చేస్తాడు. అలాంటివాడే నిజమైన గురువు, అలాంటివాడే అసలైన జ్ఞాని. అంతేగాని నీతిన్యాయాల పట్ల, సత్యధర్మాల పట్ల సదవగాహన లేనివాడు అంధుడే. అతడు ఇతరులను సత్యమార్గాన నడిపించలేడు. ధర్మమార్గోపదేశం చెయ్యనూ లేడు. శాస్త్రులూ, పరిసయులూ అలాంటివారే.

కాబట్టి గుడ్డివాడు గుడ్డివాడికి దారి చూపడం అజ్ఞాని, అజ్ఞానికి బోధించడం వంటిది అని ఈ సామెతలు బోధిస్తున్నాయి.

## 25

తెలుగు సామెత : గోడకి చెవులుంటాయి

బైబులు సామెత : మనస్సులో గూడ రాజును విమర్శింపకుము, ఏకాంతముననైన ధనికులను దూయబట్టకుము, పక్షి నీ మాటలను వారి చెంతకు కొనిపోవును (ఉపదేశకుడు 10:20)

ఎవరి గురించి కూడా చెడుగా మాట్లాడవద్దనీ, వీలైనంతవరకు ఇతరులను గురించి మంచే మాట్లాడమనీ పెద్దలు చెబుతుంటారు. ఎందుకంటే ఇతరులను సరిదిద్దడానికి ప్రయత్నిస్తే వారు నొచ్చుకోవచ్చు. లేకపోతే విన్నవారెవరైనా వారికి మరింతగా కల్పించి చెప్పవచ్చు. అందుకే ఎవరి గురించైనా మాట్లాడేటప్పుడు హెచ్చరించినట్లుగా పెద్దలు గోడలకు చెవులుంటాయి అంటుంటారు. అంటే ఎవరో ఒకరు విని చేరవేస్తారు కాబట్టి జాగ్రత్తగా ఉండమని చెబుతున్నారని అర్థం. బైబులు సామెత కూడా పదవులలో ఉన్నవారిని, ధనవంతులను ఏకాంతములో గానీ, మనసులో కూడా ఏమీ అనవద్దని చెప్పడం ద్వారా, ఇతరుల గురించి మాట్లాడేటప్పుడు ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలో చెబుతుంది. పక్షులు కూడా విషయాన్ని చేరవేస్తాయని తెల్పడం ద్వారా అధికారంలో ఉన్నవారికి, డబ్బున్నవారికి విషయాలను ఎవరైనా చేరవేస్తారు అని గ్రహించమని చెబుతుంది. వారు అయినవాళ్ళు కావచ్చు, కానివాళ్ళు కావచ్చు. అందుకే ఇతరులను గురించి మాట్లాడేటప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించమని హెచ్చరిస్తున్నాయి ఈ రెండు సామెతలు.

నాలుక ప్రకృతి జీవన చక్రానికి చిచ్చుపెడుతుందని బైబులు ఉవాచ. మనస్సులో ఉన్నది మనోవీధి దాటి శబ్దరూపంలో బయటికి వెడలిందా, అదిక మనది కాదు. రెక్కలున్న పక్షి వలె అది ఎక్కడెక్కడికి ఎగిరిపోతుందో ఏ ఏ విన్యాసాలు ప్రదర్శించి ప్రాణం మీదికి తెస్తుందో ఎవరూ చెప్పలేరు. అందుకే మీ నోటి మాటలు కొంచెంగా ఉండాలని బైబులు హెచ్చరిస్తుంది. ఏ మాట అంటే ఏమి తంటా వస్తుందోనని నోరు నొక్కుకుని ఉండాలనే అర్థంలో గాక, విజ్ఞత గలిగి మాటలాడాలనే ఈ సామెతల భావం.

ఇక బైబులు సామెతలో జన సామాన్యంపై నిఘా ఉంచే ప్రభువుల గూఢచారి వ్యవస్థ ఛాయలు కనిపిస్తున్నాయి. పూర్వకాలం జనపదాలలో చారులు సంచరిస్తూ ప్రజావాక్కును ప్రభువులకెరిగిస్తూ ఉండేవారు. అనవసరంగా నోరు పారవేసుకొంటే రాజాగ్రహం చవిచూడవలసి వచ్చేది. మొత్తంమీద తరువాత బాధ పడవలసి వచ్చేమాట పలుకకుండా జాగ్రత్తపడి ఆచి తూచి ఒద్దికగా మన మాటలుండాలని భావం.

## 26

తెలుగు సామెత : చిక్కుల గుఱ్ఱానికి కక్కుల కళ్లెము

బైబులు సామెత : గుఱ్ఱములు లొంగి యుండుటకు కళ్లెము తగిలించినట్లు (యాకోబు 3:3)

సాధారణంగా గుఱ్ఱాలకు కళ్లెం వేస్తారు. కారణం? కళ్లెం లేకపోతే గుఱ్ఱాలు మాట వినవు. కొన్ని చిక్కుల్లో పడవేసే గుఱ్ఱాలుంటాయి. వాటికి కక్కులు ఎక్కువగా ఉండే కళ్లెం వేస్తారు. ఏమాత్రం గుఱ్ఱం సకిలించి విదలించబోయినా ఆ నొక్కులు అంగిట్లో, నాలుక మీద గుచ్చుకొని గాయాలౌతాయి. చిక్కులు పెట్టే గుఱ్ఱానికి ఎక్కువ కక్కులు ఉన్న కళ్లెం వేస్తారు. తద్వారా దానిని అదుపు చేయవచ్చు.

కొంతమంది మానవులు లోబడరు. పొగరుబోతుతనాన్ని ప్రదర్శించి అందరినీ తూలనాడుతూ ఉంటారు. అటువంటివారికి ఎదురుదెబ్బ తగిలి, తెగని సమస్య మెడకు చుట్టుకొని వారు అదుపులోకి వచ్చినపుడు ఈ తెలుగు సామెత అర్థవంత మౌతుంది.

బైబులు సామెత కూడా ఇదే అర్థాన్ని బోధిస్తున్నది. గుఱ్ఱాలను లోబరచుకోవ డానికి కళ్లెం తగిలించినట్లుగా మనిషి తనను తాను అదుపులో ఉంచుకోవాలని ఉద్బోధిస్తున్నది ఈ బైబులు సామెత.

చిక్కుల గుఱ్ఱానికి కక్కుల కళ్లెము అనే తెలుగు సామెత, గుఱ్ఱములు లొంగి యుండుటకు కళ్లెములు తగిలించినట్లు అనే బైబులు సామెత ఒకే అర్థాన్ని బోధిస్తున్నాయి.

'సిరి నిజమ్ముగ వట్టి టక్కరిది సుమ్ము' అంటాడు జాషువ కవి తన 'ఫిరదౌసి' కావ్యంలో. నిన్న మొన్నటిదాకా హిందువుల పరాక్రమాన్ని ఆశ్రయించిన రాజ్యలక్ష్మి, నేడు తురక భూధవుని ఖడ్గాన్ని వలచి, అతని అధీనమైపోయింది. ఈ సిరిని నమ్మరా దంటాడు జాషువ కథానుగుణంగా.

ధనమే అన్నిటికీ మూలమని, అదే సర్వస్వమని, దాని కోసమే అహర్నిశలు తపిస్తే అది లోభమవుతుంది. ధనం అవసరమే, కాని ధనమొక్కటే, లేక ధన సంపాదన మొక్కటే జీవిత పరమార్థం కాదని ఈ సామెతల ద్వారా గ్రహించాలి.

## 27

తెలుగు సామెత : చిత్తశుద్ధి లేని శివపూజలేలరా!

బైబులు సామెత : అయోగ్యమైన బలులు అక్కరలేదు (యెషయా 1:13)

చిత్తం అంటే హృదయం అని అర్థం. హృదయం శుద్ధి చేసుకోకుండా ఎన్ని పూజలు చేసినా, ఎవరిని పూజించినా ఫలితం లేదనే సందర్భంలో ఈ తెలుగు సామెతను ఉపయోగిస్తారు. ఇక్కడ ఆత్మశుద్ధి లేని ఆచారం, భాండశుద్ధి లేని పాకం, చిత్తశుద్ధి లేని శివపూజలు వ్యర్థమని అర్థం. అన్నిటికంటే ముఖ్యమైంది హృదయ శుద్ధి. అది లేకుండా ఎన్ని పూజలు చేసినా, వ్రతాలు చేసినా ఫలితం లేదు.

దేవుడు పైపై మెరుగులు చూడడు. ఆయన హృదయాలను పరిశీలింపగల సమర్థుడు. హృదయాన్ని సృష్టించి మానవునిలో పదిలపరచినవాడు. కాబట్టి హృదయశుద్ధి లేని పూజలు, అర్పించే నైవేద్యాలు సర్వేశ్వరుడు అంగీకరించడు. హృదయాన్ని శుద్ధి చేసుకొని, దుష్క్రియలు మానివేసి పవిత్ర చిత్తంతో ప్రార్థిస్తే ఆయన అంగీకరిస్తాడు.

బైబులు సామెతా, తెలుగు సామెతా సుస్పష్టంగా ఏకార్థ ప్రతిపాదకాలు. దేవుడు కోరేది టెంకాయ, నైవేద్యం కాదు. నిర్మలమైన మనస్సు, సత్ప్రవర్తన, పవిత్ర హృదయం.

## 28

తెలుగు సామెత : చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవైనయట్లు

బైబులు సామెత : నరుడు కష్టించి సుఖములు త్యజించి ఆర్జించిన ధనము అన్యులపాలైనచో పాముకొనునదేమున్నది? (సీరా 11:18)

చీమలు అవిశ్రాంతంగా కష్టించి పుట్టలు పెడతాయి. అంటే ఇల్లు కట్టుకుంటాయి. కాని వాటిలో చివరకు పాములు నివసిస్తాయి. అంటే చీమలు వాటి కష్ట ఫలితాన్ని అవి అనుభవించలేవన్నమాట. ఈ స్థితిని వివరిస్తూ ఎందరో వేదాంతులు ఇదే భావాన్ని సామెతల రూపంలో, ప్రబోధాల రూపంలో తెలియజేశారు.

'చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవైనయట్లు పామరుడు తగన్,

కూడబెట్టిన ధనమెల్ల, భూమీశుల పాలజేరు భువిలో సుమతీ' అంటాడు బద్దెన.

వేమన కూడా

'ధనము కూడబెట్టి ధర్మంబు సేయక
తాను తినక లెస్సదాచుగాక
తేనెటీగ గూర్చి తెరువరికీయదా' అంటాడు. అంటే ఎవరి కష్టాన్ని వారు అనుభవించ కుండా, ఇతరులు అనుభవిస్తున్న పరిస్థితులలో ఈ తెలుగు సామెతను ఉపయోగిస్తారు. తేనెటీగ పువ్వు పువ్వును చేరి తేనెను స్వీకరిస్తుంది. ఒక చోట కూడబెడుతుంది. కాని దానిని ఇతరులు అనుభవిస్తారు. పిసినారి ధనాన్ని కూడబెడతాడు. దానిని పరులు అనుభవిస్తారు. ఇది సమాజంలో నిరంతరం జరుగుతూ ఉన్నదే. ఆ స్థితిని వివరించడానికి పై సామెతను ప్రయోగిస్తారు.

చిన్నయసూరి మిత్రలాభములో ఇటువంటివారి ధనాశ గురించి చెబుతూ "వాయికట్టి, కడుపుకట్టి, ధనము గడించువాడు పరులకయి మోపు మోచువానియట్లు క్లేశమునకు మాత్రము పాత్రము" అంటాడు.

బైబులు సామెత కూడా ఇదే భావాన్ని వ్యక్తీకరిస్తుంది. మానవుడు తాను తినక సుఖవర్జన చేసి సంపాదించిన విత్తం అన్యుల పాలైతే ఆ ధనం వల్ల అతనికి ప్రయోజనం ఏముంది? జీవితాంతం కష్టించి ఆ కష్ట ఫలాన్ని తాను అనుభవించకుండా, పరులకు కట్టబెడితే లాభమేముంది? సర్వసుఖాలూ త్యాగం చేసి కూడబెట్టిన సొమ్మును తాను అనుభవించకపోతే అలా సంపాదించుకొన్నవాడు ఇక పొందే సౌఖ్యం ఏముంది? ప్రపంచాన్నంతా సంపాదించుకొని అనుభవించలేకపోతే దానివల్ల లాభమేముంది? ఇటువంటి వారిని, ఇటువంటి పరిస్థితులనే ఈ బైబులు సామెత కూడా వ్యక్తపరుస్తున్నది.

'దానము, భోగము, నాశము పూనికతో మూడుగతులు భువిధనమునకున్, దానము, భోగము నెరుగని, దీనుని ధనమునకు తృతీయమే (నాశమే) గతి' అంటాడు భర్తృహరి తన సుభాషితాలలో. ఈ తెలుగు సామెత, బైబులు సామెత కూడా ఇదే సత్యాన్ని బోధిస్తున్నాయి.

## 29

తెలుగు సామెత : చెప్పుట కంటే చేయుట మేలు

బైబులు సామెత :క్రియలు లేని విశ్వాసము వ్యర్థము (యాకోబు 1:17)

కేవలం చెప్పడం వల్ల ప్రయోజనం శూన్యమనీ, క్రియచేసి చూపడం మేలని తెలిపే సందర్భంలో ఈ సామెతలను ఉపయోగిస్తారు. ఈ లోకంలో అన్నిటికంటే తేలికైన విషయం ఇతరులకు నీతులు చెప్పడమే. క్రియాశూన్య వచనాల వల్ల ఎలాంటి మేలూ జరగదు. పూర్వాంధ్ర కవి గురజాడ "ఒట్టి మాటలు కట్టిపెట్టి గట్టిమేల్ తలపెట్టవోయ్" అన్నారు. మదర్ థెరిస్సా పనిచేసే చేతుల్ని ప్రశంసించింది. చేసిన మంచిపని చిన్నదైనా అది ఎంతో గొప్ప ఫలితాన్నిస్తుందని విజ్ఞులంతా ప్రబోధించారు. కాబట్టి అస్తమానం మాటలు చెప్పడం కంటే చేతల ద్వారా చూపిస్తే మంచి ఫలితం ఉంటుంది.

కనుక క్రియా శూన్య వచనాలు మాని సత్క్రియలు చేయాలి. అలా చేయనివాడు అద్దంలో తన ముఖాన్ని తాను చూసుకుని, అవతలికి పోయి తన రూపాన్ని మరచిపోయేవాని లాంటివాడే! కనుక చెప్పడం కంటే చేసి చూపడం మేలు. మాటలు కోటలు దాటతాయి. లేత సొరకాయను తురిమినంత సాఫీగా కొందరు కోతలు కోస్తారు. మహా భారతంలో ఉత్తర కుమార ప్రగల్భాలు ఇలాటివే.

పరాత్పరుని పట్ల విశ్వాసమే మనిషిని దైవానుగ్రహపాత్రునిగా చేస్తుందనీ, విశ్వాసమే దేవుడు ఒక వ్యక్తిని నిర్దోషిగా ఎంచే మార్గమనీ ప్రవక్తలు నుడివారు. అయితే ఆ విశ్వాసం క్రియాశూన్యమైనదైతే ఇబ్బందే. ఎందుకంటే అసలు విశ్వాస మున్నదో లేదో చెప్పడమెలా? విశ్వాసమన్నది మనషుల చేత క్రియలను చేయిస్తుంది. తనకు విశ్వాసమున్నదని ఎవరైనా నోటితో అనగలరు. అతనిలో సత్క్రియలు కనిపిస్తుంటే అతడన్నమాట నమ్మగలం. అందుకే యాకోబు భక్తవరేణ్యుడు క్రియా శూన్యమైన విశ్వాసం మృతతుల్యమని సెలవిచ్చాడు. పరిశుద్ధ గ్రంథంలో దర్శనమిచ్చే పుణ్య జీవులందరూ తమ విశ్వాసం చొప్పున వివిధ మహత్కార్యాలు నీతిక్రియలు చేసి చూపారు. దేవుని మెప్పు పొందారు. తెలుగు, బైబులు సామెతలు రెండూ ఆచరణ లేని ఆదర్శాలను గర్హించి క్రియాశీలతను కొనియాడుతున్నాయి.

## 30

తెలుగు సామెత : డబ్బు పాపిష్ఠిది

బైబులు సామెత : ధనకాంక్షే సర్వానర్థములకు మూలము (1 తిమోతి 6:10)

ధనస్సును చేబూని పలుజనపదాలను ఓడించి ధనం విస్తారంగా సంపాదించి నందుకు అర్జునునికి ధనంజయుడనే పేరు వచ్చింది. ధనం అనే పదానికి ఆలమంద అనే అర్థం కూడా ఉంది. పూర్వం నాణేలకు బదులుగా గోవులే క్రయ విక్రయ సాధనాలుగా ఉండేవి. భారతంలో ఉత్తర గోగ్రహణానికి గోధనాన్ని వృద్ధి చేసుకోవాలన్న కౌరవుల దురాశ కూడా ఒక కారణం. ధనాశ అనేది పిశాచివలె పట్టి విడువక పీడిస్తుంది. ఎంతటివారైనా డబ్బు మీద కోరికతో ఎలాటి అడ్డదారి తొక్కడానికైనా వెనుకాడరు. ధనమదం ఆధ్యాత్మిక చింతనను నశింపజేస్తుంది. అందుకే

'ధనమదంబు చేత దైవంబు నెరుగరు
కుటిల భావమొంది క్రూరజనులు' అంటున్నాడు వేమన.
'ధనమొచ్చిన మదమెచ్చును
మదమెచ్చిన దుర్గుణంబు మానక హెచ్చున్' అనే వాస్తవాన్ని వేమన కూడా గుర్తించాడు.

డబ్బు పాపిష్ఠిది. డబ్బు కోసం మనుషులు పడే పాట్లు తొక్కే అడ్డదార్లు లెక్కకు మిక్కిలి. ధని గనుక ధర్మపథంలో పట్టుదల లేనివాడైతే వాడు ధర్మకంటకుడై ధన గర్వంతో పాతకాలను మూటగట్టుకుంటాడు.

బైబులు సామెత కూడా ఇదే భావాన్ని తెలియజేస్తున్నది. ధనకాంక్షే సర్వానర్థాలకు మూలమంటున్నది. ధనం అవసరమే. అయితే దాని కోసమే జీవించడం మంచిది కాదు. దాని కోసం పెడదారిలో పాదమిడడం ప్రమాదకరం. ఈ ధనకాంక్షనే లోభమంటారు. లోభమే అన్ని కీడులకు మూలమంటాడు చిన్నయసూరి మిత్రలాభంలో. కాబట్టి ధనమే సమస్తమని భావించి, తదనుగుణంగా జీవిస్తే ప్రమాదమే.

# 31

తెలుగు సామెత : తప్పులు వెదకువాడు తండ్రి, ఒప్పులు వెదకువాడు ఓర్వలేనివాడు

బైబులు సామెత : తనయుని ప్రేమించు తండ్రి వానిని శిక్షించి తీరును (సామెతలు 13:24)

'సుతో లాలనా వినశ్యతి' అన్నారు ఆర్యులు. అతి గారాబంతో సుతులు చెడిపోతారు. తనయుని మేలుగోరే తండ్రి దండించైనా కొడుకుని ఉత్తమ మార్గంలో ఉంచుతాడు. పరునికి అటువంటి అవసరమేమున్నది? వారు కేవలం శ్లాఘనీయమైనది కనిపించినపుడు మెచ్చుకుని వదిలి వేస్తారు. గర్హనీయమైనది గోచరమైతే మిన్నకుండి పోతారు. పిల్లలకు సహజ చాపల్యం వలన దండించే తండ్రికన్నా లాలించే పరులే ప్రియులుగా కనిపిస్తారు. తెలుగు బైబులు సామెతలు రెండూ తండ్రి దండించేది కొడుకు క్షేమానికేననీ, అది అవ్యాజానురాగ ఫలితమేననీ నొక్కి చెబుతున్నాయి.

పౌలు భక్తుడు రాస్తూ తండ్రి దండింపని కుమారుడెవరు? అని ప్రశ్నించాడు. దండన ప్రస్తుతం దుఃఖకారణమే గాని అది శాశ్వత ఫలమిస్తుంది (హెబ్రీయులకు 12:7-11). దేవుని చేతినుండి వచ్చే శిక్షను మనం నిరసించామా, మనం కొరగాని వారిమే కానీ కుమారులం కామని తేల్చి చెప్పాడు.

'చాకి కోకలుదికి చీకాకు పడజేసి
మైలదీసి లెస్స మడుపు జేయు;
బుద్ధి చెప్పువాడు గుద్దిన నేమయా!'

వేమన చెప్పినట్టుగా చాకలివాడు వస్త్రాన్ని సబ్బుతో క్షారంతో ఏటి ఒడ్డున బండకేసి బాది బాది బాధిస్తాడు. అది దానికంటిన మైల వదలగొట్టేందుకే. అలానే శ్రేయోభిలాషి యైన తండ్రి బెత్తము వాడి బాలుని సన్మార్గంలో నడుపుతాడు.

పరాయివారు పిల్లవాడు చెడు దారిన ఉన్నా అది సవ్యమైనదేనంటూ ఇచ్చకాలాడి అతడు అదే మార్గంలో విచ్చలవిడిగా కొనసాగేందుకు దోహదం చేస్తారు. హితుడు మేలుగోరి గాయం చేస్తాడు, పగవాడు లెక్కలేనన్ని ముద్దులు పెడతాడు అనే బైబులు సూక్తి పై తెలుగు సామెతకు ప్రతిబింబం.

బెత్తం వాడని తండ్రి కుమారుని బద్ధ శత్రువని ఈ సామెతలు హెచ్చరిస్తున్నాయి.

## 32

తెలుగు సామెత : తలకు మించిన బరువు వలదు

బైబులు సామెత : నీకు మించిన బరువు మోయవలదు (సీరా 13:1)

మానవుడు ఆశావాది. ఎప్పటికప్పుడు కొంత ప్రగతి సాధించాలనే చూస్తుంటాడు. అందుకోగలిగిన లక్ష్యాలు నిర్దేశించుకొంటూ అంచెలంచెలుగా సామర్థ్యాన్ని అభివృద్ధి పరచుకొంటూ పోవడం సమంజసం. కొందరైతే పరుగెత్తి పాలు త్రాగాలన్నట్టుగా అత్యాశకు పోయి ఆయాసం కొనితెచ్చుకుంటారు. ఇది తగదని పై రెండు సామెతలు హితవు పలుకుతున్నాయి.

విధి వశాన మోయరాని బరువు మోయవలసి వచ్చిన నిర్భాగ్యులుంటారు. తండ్రి మరణిస్తే తరుణప్రాయంలోనే కుటుంబ భారం సంక్రమించినవారు యౌవనంలోనే వైధవ్యం సంప్రాప్తిస్తే పసిపిల్లల ఆలనా పాలనా చూచుకోవలసి వచ్చిన యువతులు ఉంటారు. తన ప్రమేయం లేకుండా వచ్చిపడినదాన్ని వదిలించుకోలేక మనస్సు రాక సతమతమయ్యేవారు అలాటివారే.

పనిగట్టుకుని తన సామర్థ్యాన్ని ఎక్కువగా అంచనా వేసుకుని దూసుకుపోయే ప్రయత్నం చేసి చతికిలబడే వారిని ఈ సామెతలు హెచ్చరిస్తున్నాయి. భగీరథుడు ఆకాశ గంగనైతే అవనికి రప్పించాడు గానీ ఆ దూకుడికి భూమి బద్దలయ్యే ప్రమాదానికి విరుగుడుకై సాంబశివుణ్ణి ఆశ్రయించాల్సి వచ్చింది. ఎంత చెట్టుకు అంత గాలి. తన పరిమితులెరిగి కార్యం తలపెడితే శ్రేయస్కరం. కొందరికి కాదు లేదు చేయలేను అని చెప్పడానికి మొగమాటం. వ్యక్తిత్వ వికాస నిపుణులు దీనినొక అవలక్షణంగా పేర్కొంటారు. మృదువుగా నిరాకరించడం కూడా ఒక కళ. తనపైనే కొండంత పనిభారముండగా ఇతరుల పనులు నెత్తిన వేసుకోవడం తలకు మించిన బరువు నెత్తికెత్తుకోవడమే.

## 33

తెలుగు సామెత : తినకుండా రుచులు, దిగకుండా లోతులు తెలియవు

బైబులు సామెత : నీవు చెప్పనున్న సంగతి బాగుగా తెలిసికొనిన పిమ్మట మాటలాడుము (సీరా 18:19)

కొంతమంది ఏమీ తెలియకుండా, లోతుపాతులు అర్థం కాకుండా ఒక వస్తువు యొక్క నిజస్వరూపం, దాని స్వభావం, ఆకార వికారాలు తెలియకుండానే మాట్లాడతారు. విషయం ఆమూలాగ్రం అవగతం కాకుండానే, అనాలోచితంగా మాట్లాడుతారు. స్వానుభవంతోనే దేనిని గురించియైనా చెప్పాలి. అలా కాకుండా పై పై మాటలు, అర్థంపర్థం లేని మాటలు మాట్లాడిన మనిషి విలువ తగ్గిపోతుంది. స్థాయి దిగజారుతుంది. పదార్థాన్ని తినకుండా దాని రుచి తెలియదు. ప్రవాహంలో, నదీజలాల్లో దిగకుండా అది ఎంత లోతు ఉన్నదో తెలియదు. ఇలా అనుభవం లేకుండా అమాయకంగా అజ్ఞానంగా మాట్లాడే సందర్భాలలో ఈ తెలుగు సామెత ప్రాచుర్యం పొందుతుంది!

బైబులు సామెత కూడా దీనికి సమానమైన భావాన్ని స్ఫురింపజేసేదే. కొందరు తాము మాట్లాడుతున్న విషయాల గురించి ఆ విషయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతారు. స్నేహితుల సంభాషణలలో, వక్తల ఉపన్యాసాలలో ఒక్కొక్కసారి ఈ ధోరణి కనిపిస్తుంది. అలా కాకుండ మనం మాట్లాడే విషయం యొక్క పూర్వాపరాలు మనకు కూలంకషంగా తెలియాలి. బాగోగులు అర్థం కావాలి. లాభనష్టాలు, దానిలో ఉన్న కష్టసుఖాలు పూర్తిగా మనం తెలుసుకొని, దాన్ని గురించి ఇతరులతో మాట్లాడాలి. అదే విషయాన్ని బైబులు సామెత బయలుపరుస్తూ ఉంది. నీవు చెప్పదలచుకున్న విషయాన్ని పూర్తిగా తెలుసుకొని మాట్లాడమంటున్నది.

'తినకుండా రుచి, దిగందే లోతూ తెలియద'నడంలోనూ, 'నీవు చెప్పనున్న సంగతి బాగుగా తెలిసుకొనిన పిమ్మట మాటలాడుము' అనడంలోనూ ఉన్న భావార్థాలు సమానమే. ఈ తెలుగు, బైబులు సామెతలు రెండూ ఒకే భావాన్ని తెలియజేస్తున్నాయి.

## 34

తెలుగు సామెత : తేనె తీసినవాడు చేయి నాకకుండునా?

బైబులు సామెత : కళ్ళము తొక్కించునపుడు ఎద్దునోటికి చిక్కము పెట్టరాదు (ద్వితీయోపదేశకాండము 25:4)

ఈ రెండు సామెతలలోనూ సేవక వృత్తిలో ఉన్న పరిజనం పట్ల, పశువుల పట్ల దయ, ఔదార్యం కనపరచవలసిన అవసరం వ్యక్తమవుతున్నది. బైబులు సామెత

వ్యవసాయ రంగంలో తారసపడే ఆహ్లాదకరమైన చిత్తరువును కళ్ళెదుట ఉంచుతున్నది. ఎద్దులు కళ్ళం నూరుస్తూ బిరబిరా తిరుగుతూ మధ్య మధ్యలో ఆ కొత్త గడ్డిని చప్పరిస్తూ ఉంటాయి. అది కూడా వాటికి దక్కనియ్యకుండా నోటికి చిక్కం పెట్టడం పిసినిగొట్టు తనానికి పరాకాష్ఠ.

తెలుగు సామెతలో ఇదే భావం ద్యోతకమవుతున్నప్పటికీ ఇది వ్యవసాయ రంగం నుండి దైనందిన వ్యవహారంలోకి మనలను తెస్తున్నది. తేనెతుట్టె మనదే. తేనె తీయడం కోసం కూలికి మనిషిని పిలిపించుకొన్నాం. తేనె అంతా గిన్నెలోకి పిండి గిన్నె అంచుకు చేతులకంటి ఉన్న తేనె రాసిన తరువాత కూడా ఇంకా కొంత తేనె వేళ్ళ మధ్యలో ఉండిపోతే దానిని నోటితో కడిగివేయడమే గత్యంతరం. అలాకాక ఆ కూలివాడు తన చేయి నాకితే నాకేదో ద్రోహం చేశావంటూ పోట్లాటకు దిగడం అర్థం లేని పని. అందుకే వేమన –

'స్నానసంధ్య జపము జరియించు భుజియించు
నిష్ఠ లెన్నియైన నెరపుగాని
ఒకని కీయడేమి సుకృతంబు కలుగునో'

అంటూ వాపోయాడు. ఇంట్లో పనికి చిన్న పిల్లల్ని పెట్టుకుంటారు కొందరు. ఆ పసివారు వంట మొదలుకొని అన్ని పనులూ చేస్తారు. మాంసాది భక్ష్యాలు, భోజ్యాలు వారు వండుతారు, యజమాని కుటుంబం వాటిని ఆరగిస్తుంది గానీ వంట పిల్ల లేశమంతయినా ఆ వంటకాలు నోట బెట్టడానికి ఉండదు. ఆ పిల్ల తమ పిల్లలవంటిదేనని ఆ గృహస్థులు యోచించరు.

అత్తరు కర్మాగారంలో పనిచేసేవారి బట్టలు సువాసనలీనవా? మనుషుల్లోని స్వార్థబుద్ధిని అధిక్షేపిస్తూ పెద్దలు సున్నితంగా చెప్పిన సుద్దులు ఈ రెండు సామెతలు.

## 35

తెలుగు సామెత : దారినపోయే తగులాటాన్ని దాపుకు కొనితెచ్చుకొన్నట్టు

బైబులు సామెత : ఇతరుల తగవులో తలదూర్చుట దారినపోవు కుక్క చెవులు పట్టుకొనుట వంటిది (సామెతలు 26:17)

పిచ్చితనంతో నీవు చెరలాటలాడడం ఫరవా లేదు. కాని పిచ్చితనం నీతో చెరలాటలాడడం ఆరంభిస్తే మొదటికే మోసం. సింహం తీరికగా మ్రాగన్నుగా ఉన్నంతసేపూ చిట్టెలుక దాని జూలు పట్టుకొని లాగుతుంది. శ్రుతి మించిందా ఒక్క పంజా వేటుకు కూడా సరిపోదు. ఎవరి పని వారు బుద్ధిగా చూచుకుంటూ, తనది కానిదానిలో తలదూర్చకుండడం విజ్ఞుల లక్షణమని తెలుగు సామెత చెబుతున్నది. ఈ సత్యాన్నే ఒకింత బలంగా సామ్యంతో సహా చెప్పి మెప్పిస్తున్నది బైబులు సామెత.

ఇద్దరు వ్యక్తులు పోట్లాడుకొంటుంటే వారిని వేరుచేసి సామరస్యం కుదుర్చుదామని వెళతాడు ఒక బుద్ధిమంతుడు. వారిద్దరూ పరస్పర కలహం మాని ముందు వీడి దేహశుద్ధి చేస్తారు. మరీ ముఖ్యంగా భార్యాభర్తల తగవులో తలదూర్చడమంత వెర్రితనం లేదు. అన్నదమ్ముల విరోధంలో జోక్యం చేసుకొని అగ్రజుడు వాలిని తెగటార్చిన రామునికి చుట్టుకున్న బ్రహ్మ హత్యా పాతకం ఆ అవతార పురుషుణ్ణి పట్టి కుదిపింది.

పేడమీద రాయివేస్తే ముఖమంతా చిందుతుంది. మూర్ఖుని మనస్సు రంజింప బూనుకుంటే బెడిసికొడుతుంది. పరుల జోలికి పోవడం పాటిగాదు. తన మానాన తాను నిద్రిస్తున్న కుక్క చెవులు పట్టుకుని లాగితే అది కరవక సంతోషిస్తుందా, పిక్క బలం చూపవలసిన గతి పట్టిస్తుంది. సుమతీ శతక పద్యరత్న ప్రబోధం ఈ సందర్భంలో స్మరణీయం:

'ఎప్పటికెయ్యది ప్రస్తుత
మప్పటి కా మాటలాడి యన్యులమనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ'

సమయోచిత ప్రవర్తనతో తనకు కాని పితలాటకాన్ని నెత్తిన పూసుకోవడంలోని అజ్ఞానాన్ని ఈ సామెతలు ఎండగడుతున్నాయి.

## 36

తెలుగు సామెత : దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి

బైబులు సామెత : వెలుగు ఉండగానే నడువుడి (యోహాను 12:35)

సమయముండగానే, కాలం మీరిపోకుండానే అన్నీ చక్కబెట్టుకోవాలనే సందర్భంలో ఈ సామెతలను ఉపయోగిస్తారు. "చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకుని ఏం లాభం?" అనే సామెత కూడా ఇటువంటి ముందు జాగ్రత్తను సూచించేదే. ప్రతిదానికీ ఒక సమయముంటుంది. చదువుకొనడానికి, పెళ్ళి పేరంటాలు జరుపుకోవడానికి, పని చేయడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నిర్ణీత సమయాలున్నాయి. చదువుకునే సమయంలో అశ్రద్ధగా తిరిగి, వయస్సు మీరిపోయి, చదువుకోలేని సమయంలో చింతిస్తే లాభం ఉండదు. మొదటినుంచీ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోకుండా, శరీరం వ్యాధిగ్రస్థమై, ఔషధాలు కూడా పనిచేయని స్థితిలో గతాన్ని తలచి వగచినందువల్ల వచ్చే ఫలితం శూన్యం! శరీరంలో బలం ఉన్నప్పుడే పనిచేసి, నాలుగు రాళ్ళు సంపాదించి, పొదుపు చేసుకోవాలి. అలా కాకుండా బలం ఉన్నప్పుడు సోమరిగా పడుకొని, బలహీనమైపోయి, దారిద్ర్యంతో మ్రగ్గుతున్నప్పుడు పనిచెయ్యలేక, సంపాదించలేక పోతున్నానని చింతిస్తే ఫలితం శూన్యం! జీవం ఉండగానే సన్మార్గంలో నడిచి, సద్గతిని పొందడానికి సంసిద్ధపడాలి. అన్నీ పోయి అంధకారం అలముకున్నప్పుడు ఆవేదన పడితే ప్రయోజనం ఉండదు. సమయాన్ని సద్వినియోగం చేసుకున్నవాడే సమస్తాన్ని పొందగలడు అని ఈ సామెతలు బోధిస్తున్నాయి.

## 37

తెలుగు సామెత : దీపాన్ని ముద్దు పెట్టుకుంటే మీసాలు కాలవా?

బైబులు సామెత : ఒడిలో అగ్నినుంచుకొనిన యెడల వస్త్రములు కాలకుండునా?
నిప్పుల మీద నడిచిన పాదములు కమలకుండునా?
(సామెతలు 6:27,28)

కర్ణుని మరణానంతరం కుంతీమాత పరివేదనను తమ 'పశ్చాత్తాపము' కావ్య ఖండికలో జాషువా కవి రసవత్తరంగా అభివర్ణించాడు:

'ఏందుకు గంటినో తెలియదీ యినబింబ సమానమూర్తి, నా
క్రందన మాచరించు కసుగాయను, కుండలమండితాంగు, గా
ళింది కొసంగితిన్, జవుకళించెడు దుఃఖము గ్రుక్కుకొంటి, నీ
కుందు గతించునే! తలచుకొన్న సహించునె మాతృ గర్భముల్'

దుర్వాస మహర్షి వరప్రభావాన్ని పరీక్షించనెంచింది కుంతీకన్య. వర ప్రభావాన భానుడు ప్రసన్నుడై కోటిప్రభలతో దీపించే కర్ణుణ్ణి పుత్రునిగా ప్రసాదించాడు. లోకాపవాదుకు వెరచి ఆ శిశువును ఆమె కాళిందికర్పించగా సూత దంపతులు అతనిని పెంచుకున్నారు. గతంలో తెరచాటున జరిగిపోయిన కర్ణ జన్మగాథ కుంతీదేవికి శోక కారణమయింది. ఆకర్షణీయంగా ఉన్నది గదా అని దీపశిఖను ముద్దాడితే మూతీ, మీసాలు కాలకమానవు. పర్యవసానాలను గురించి ఆలోచించకుండా చేసిన పనికి ఫలితార్థం అనుభవించవలసిందే అంటూ ఈ తెలుగు, బైబులు సామెతలు ఘోషిస్తున్నాయి.

విజ్ఞులు కార్యారంభంలోనే పరిణామాలను బేరీజు వేసుకొని కార్యోన్ముఖులౌతారు. ఫలితాలు అంచనా వేయలేక తొందరపడి తరువాత దురపిల్లితే ప్రయోజనం ఉండదు. శౌరి కౌరవుల చెంతకు రాయబారానికేగుతున్న సందర్భంలో కృష్ణ 'చిచ్చొడిగట్టినట్టు' ఇంతవరకు అవమాన భారాన్ని సహిస్తున్నానంటుంది. అగ్ని కణాలను ఒడిలో ఉంచుకుంటే వస్త్రాలు కాలకుండా ఎలా ఉంటాయి?

మొత్తమ్మీద పర్యవసానాలను తెలుసుకొని దేనికైనా పూనుకొనమని ఈ సామెతలు తెలియజేస్తున్నాయి.

## 38

తెలుగు సామెత : దుర్గంధ కుసుమానికంటే నిర్గంధ కుసుమం మేలు

బైబులు సామెత : బుద్ధిహీనుల ముఖస్తుతులను ఆలకించుట కంటే విజ్ఞానులచే చీవాట్లు తినుట మేలు (ఉపదేశకుడు 7:5)

పువ్వులు వాటి సువాసనలతో మనస్సును ఆహ్లాదపరుస్తాయి. శరీరానికి ఉత్తేజాన్ని ఇస్తాయి. భరించరాని వాసనలు వెదజల్లే పువ్వులను ఎవరూ చూడడానికి ఇష్టపడరు. వాటి దగ్గరకు కూడా వెళ్ళరు. వాటికంటే చూడచక్కగా ఉండి ఎటువంటి వాసన లేని పువ్వులు ఎన్నో రెట్లు మంచివి.

అల్పులు, బుద్ధిహీనులు ఇతరులను ప్రసన్నం చేసుకోవడానికి వారి నుండి ఏవో మేలులు పొందడానికి వారిని పొగడ్తలతో ముంచెత్తుతారు. అవి వారి మనస్సు

నుండి వచ్చినవి కూడా కాదు, ఏవో పబ్బం గడుపుకోవడానికి చెప్పే మాటలే! వీటిని దుర్గంధ కుసుమం వాసనతో పోల్చవచ్చు. ఇలాంటి వెగటు పుట్టే ముఖస్తుతుల కంటే ఉత్తములతోను, జ్ఞానులతోను మన తప్పులను ఎత్తి చూపించుకుని చీవాట్లు తినడం మంచిది. ఎందుకంటే ఆ చీవాట్ల వల్ల మన తప్పులు మనం తెలుసుకునే అవకాశం లభిస్తుంది. తప్పులు తెలిసినప్పుడే కదా సరిదిద్దుకోవడానికి ప్రయత్నం జరిగేది. అవి ఎదగడానికి తోడ్పడతాయి. ఏ ప్రయోజనము లేని ముఖస్తుతుల కంటే సన్మార్గములో నడిపే చీవాట్లే మేలైనవి కదా. ఇదే విషయాన్ని తెలుగు సామెత పోలిక రూపంలో తెలియజేస్తుంది. మూర్ఖులకు దూరంగా ఉండాలని జ్ఞానులతో తిరగడం వల్ల వారి లక్షణాలు కొన్నైనా అబ్బుతాయని ఈ సామెతల ద్వారా మనకు తెలుస్తుంది.

తెలుగు సామెత కీడుచేసే వారికన్నా మేలు చేయనివారు మేలని చెబితే, బైబులు సామెత కీడుచేసే వారి ప్రశంసలు పొందడం కంటే మేలు చేయువారి చీవాట్లు తినడం మెరుగని చెప్పడం గమనార్హం.

## 39

తెలుగు సామెత : దుష్టునకు దూరముగా నుండుము

బైబులు సామెత : మూర్ఖునకు దూరముగా నుండుము (సామెతలు 14:7)

మూర్ఖుడు, మూడు తలల విషనాగు ఎదురుపడితే ముందు మూర్ఖుణ్ణి చంపి ఆ పిమ్మట సర్పం సంగతి చూడమన్నారు పెద్దలు. ఊరంతా ఒకదారిన పోతే వేరొక దారిన పోతాడు ఉలిపికట్టె. అటువంటివానికి అనిశం దూరంగా ఉండడం ఉత్తమోత్తమమని పై రెండు సామెతలు సూత్రీకరిస్తున్నాయి.

సీతమ్మవారు రావణునికి భార్య కావడమే సబబంటాడు మూర్ఖుడు. పాండవులకు ఐదూళ్ళు మాత్రం ఎందుకియ్యాలని ప్రశ్నిస్తాడు. అందుకే మూర్ఖుణ్ణి రోటనుంచి దంచినా వాని మూర్ఖత్వం వదలదంటుంది బైబులు. మూర్ఖునికన్నా మృగమే మేలంటాడు వేమన:

‘మృగము మృగమనుచు మృగమును దూషింత్రు
మృగము కన్న చెడ్డ మూర్ఖుడగును
మృగముకున్న గుణము మూర్ఖునకేదయా’

మరి మూర్ఖునితో సాంగత్యం చేయగోరి వాణ్ణి సంస్కరించడమెలా? విద్యా గంధమబ్బితే విమలుడౌతాడా?

'హీనుడెన్ని విద్యలిల నభ్యసించిన

ఘనుడు గాడు మొరకు జనుడెగాని

పరిమళములు గర్దభము మోయ ఘనమౌనె' అని కూడా అంటాడు వేమన.

అందువల్ల మూర్ఖుని విషయంలో మనం పాటించదగిన ఏకైక మార్గాంతరం వానినుండి దూరంగా తొలగిపోవడమేనని ఉపదేశిస్తున్న ఈ సామెతలు శిరోధార్యాలు.

## 40

తెలుగు సామెత : నమ్మకద్రోహం చేయకు
నమ్మించి గొంతుకోయకు

బైబులు సామెత : నిన్ను నమ్మి నీ ప్రక్కనే కాపురముండు తోటి నరుని గొంతు కోయుటకు కుట్రలు పన్నకు (సామెతలు 3:29)

మహాకవి షేక్స్పియర్ విరచిత జూలియస్ సీజర్ నాటకంలో సభామంటపంలో ప్రజాప్రతినిధులు కుట్రపన్ని ముందు వెనుకల నుండి బాకులతో సీజర్ శరీరాన్ని తూట్లు తూట్లుగా పొడుస్తారు. వారందరిలోకీ బ్రూటస్ అనేవాడు సీజరుకు ప్రాణమిత్రుడు, మనసెరిగిన నేస్తం. అతడు సైతం కత్తి దూసి మరొక్క పోటు పొడిచేసరికి 'బ్రూటస్, నీవు కూడానా!' అంటూ ఆ జగజ్జేత సీజర్ విషాదాశ్చర్యాలు ముప్పిరిగొన్న మోముతో కుప్పకూలిపోతాడు. అతనికసలు జీవించాలన్న ఆశే ఆ క్షణంలో నశిస్తుంది. నమ్మినవాడు నట్టేట ముంచితే కలిగే వేదన చెప్పనలవి కాదు. తెలుగు, బైబులు సామెతలు రెండూ దీనినే చెబుతున్నాయి.

ఎదురై కత్తిదూసే శత్రువును ఎదిరించగలము. హితుడై పంచన జేరి వెన్నుపోటు పొడిచే వాని నుండి తప్పించుకొనడం కష్టం.

అగ్నికీలను జలధారలు చల్లార్చాలి. ఆ జలమే భగ్గున మండిస్తే ఏమి గతి? నడిసంద్రంలో తుఫానులో అల్లాడే నావను నావికుడు దరికి చేర్చాలి. నావికుడే నావను నట్టేట ముంచితే దిక్కేది. రక్షకుడే భక్షకుడు కాగా, కంచే చేను మేయగా

మార్గాంతరమేది? మానవులు సాధారణ రాగద్వేషాల జీవన సరళిలో ఒకరిపై ఒకరు కక్షలు పూని హాని తలపెడుతుంటారు. కారణం తెలిస్తే, ఎదుటివాడు తనకెందుకు కీడు చేస్తున్నాడో అవగతమైతే అదొక తీరు. అనుకోని దిక్కునుండి అనువైనవారి నుండి అనూహ్యంగా వాటిల్లే కీడు వినాశాన్నేగాక హృదయ వేదనను కూడా రగిలిస్తుంది.

స్వతహాగా మనిషి దుర్మార్గుడై కాని పనులెన్ని చేసినా, ఎట్టివారైనా చేయకూడనిది నమ్మక ద్రోహం. మనిషన్నవానిలో ఉండే మనస్సాక్షి అతడెంత కఠినాత్ముడైనా నమ్మించి గొంతుకోసే పనికి పాల్పడకుండా చేస్తుంది. అలాంటి కనీస మానవత్వం లేకుండా నమ్మినవారిని నట్టేట ముంచేవాడికి పుట్టగతులుండవు అనే నీతిబోధ ఈ సామెతలలో ద్యోతకమవుతున్నది.

## 41

తెలుగు సామెత : నిదానమే ప్రధానం

బైబులు సామెత : తొందరపడువాడు దారి తప్పును (సామెతలు 19:2)

నిదానమంటే నిగ్రహము, సంయమనము, ఆతురతపడక నిదానించుట అని అర్థం.

చేయవలసినపనిని, కార్యాన్ని కూలంకషంగా పరికించి సాధ్యాసాధ్య వివేచన గావించి నెమ్మనముతో పటాటోపము లేక ఆలోచనా పూర్వకంగా చేయడం బుద్ధి జీవుల లక్షణం. తత్తరపడక కార్యము తుదముట్టించడం మహాత్ముల గుణం.

యేసు నాయకుడు ఒక ఊరిలో ఉండగా మత పెద్దలు ఆయనను ఇరుకున పెట్టాలని తప్పు చేసిన ఒక తరుణిని ఆయన ఎదుట నిలిపి –

'వ్యభిచరించుచుండ బట్టి తెచ్చితిమీమె
పాపురాలు నరక పాత్రురాలు
ధర్మశాస్త్రములను మర్మంబునెరిగిన
వాడవీవు తెలుప వలయునిల' (క్షమాపణ, పద్యకావ్యం, యం.పి. జానుకవి).

అని అడిగారు. ప్రభువు వారి కుటిల బుద్ధులకు క్రుంగుతూ తలవంచి నేలపై ఏదో

వ్రాస్తున్నాడు. ప్రేక్షకులలో ఉత్కంఠ, పరిసయ్యులలో కోపతాపాలు పరిధులు దాటుతున్నాయి. ఆయన తల యెత్తి,

'కొట్టగ వచ్చును భామను
మొట్టమొదట యెట్టి పాపమును జేయనివా
డట్టుల సేయుడు మీరని
పట్టు విడక ప్రభుడు నేల వ్రాయుచునుండెన్'

సంయమనమనగా ఇది. ముందూ వెనుకలు లేకుండా లంఘించేవాడు చిక్కుల్లో పడతాడు. మార్గనిర్దేశనం లేకుండా తొందరపడి అడుగు కదిపేవాడు మార్గం తప్పుతాడు. ఆచి తూచి అడుగు వేస్తూ బ్రతుకును సరళ మార్గంలో సాగించుకోవడం ఆచరణీయం అని ఈ సామెతల ప్రబోధం.

## 42

తెలుగు సామెత : నిప్పు నడుమ పెట్టిన పూరి కాలకుండునా?

బైబులు సామెత : నిప్పును రొమ్ముమీద పెట్టుకొన్నచో బట్టలు కాలకుండునా' (సామెతలు 6:27)

గొంగళిలో కూర్చుని, వెంట్రుకలున్నాయని ఎద్దేవా చెయ్యడం ఎంత అవివేకమో, నిప్పుల నడుమ పెట్టిన గడ్డి కాలకుండా ఉంటుందనుకోవడం కూడా అంతే అవివేకం. 'కాలికి చుట్టుకున్న పాము కరవక మానదు' అనేది దీనితో సరితూగే ఇంకొక తెలుగు సామెత. అసలు నిప్పు జోలికి పోకూడదు. నిప్పు మనల్ని కాల్చేలోపే మనం దానిని ఆర్పివేయకపోతే, అది మనలను అంతం చేస్తుంది. నిప్పుల మధ్య ఏది ఉన్నా, తప్పక బూడిదగా మారవలసిందే గాని, వస్తువు వస్తువుగా ఉండదు. బైబులు సామెత కూడా ఇదే అర్థాన్ని అందిస్తూ ఉంది. నిప్పును ఎక్కడ పెట్టుకున్నా అది కాల్చివేస్తుంది. నిప్పుకు 'జ్వలనము' అనేది పర్యాయపదం. జ్వలనము అంటే దహించేదని అర్థం.

కాబట్టి నిప్పు నడుమ పెట్టిన పూరి కాలకుండునా అనే తెలుగు సామెత, నిప్పును రొమ్ము మీద పెట్టుకున్నచో బట్టలు కాలకుండునా అనే బైబులు సామెత సమానార్థకాలు. ప్రమాదకారకాలైన వస్తువుల, వ్యక్తుల జోలికి వెళ్లవద్దని ఈ సామెతలు బోధిస్తున్నాయి.

## 43

తెలుగు సామెత : పరుగెత్తి పాలు త్రాగుట కంటె నిలబడి నీళ్లు త్రాగుట మేలు

బైబులు సామెత : శ్రీమంతుడవై ఆందోళన చెందుటకంటె పేదవై ప్రశాంతముగా నుండుట మేలు (సామెతలు 15:16)

ఎక్కువగా సంపాదించగోరి శ్రమ జెందుటకంటె తక్కువగా సంపాదించి విశ్రాంతినొందుట మేలు (ఉపదేశకుడు 4:6)

తెలుగు సామెత తెలుగువారి నాలుకపై అహర్నిశలూ నాట్యమాడే లోకోక్తి. తాపత్రయంతో ఏదేదో చేసెయ్యాలని సామర్థ్యానికీ, తాహతుకూ మించిన కార్యాలు తలపెట్టే వారినుద్దేశించి పెద్దలు పలికే మాట ఇది. ఇది కాక ధన సంపాదనే ధ్యేయంగా పెట్టుకుని కుత్తుక బంటి సంపదలార్జించి చరమాంకంలో మనశ్శాంతి చెడి వగచే నిర్భాగ్యులకు ఇది విశేషంగా వర్తిస్తుంది.

నవయుగ కవి చక్రవర్తి జాషువా కలాన వెలసి తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయుడైన 'ఫిరదౌసి' చరిత్ర ఇందుకు తిరుగులేని తార్కాణం. ఉపదేశకుడు గ్రంథంలో ఉదహరించిన బైబులు సామెత ధన సంపాదనకై సమకట్టి శ్రమించడంలోని ప్రమాదాన్ని ఎత్తి చూపుతున్నది. గజనీ సుల్తాను మాట నమ్మి ఫిరదౌసి కృతి రచనలో రక్తస్వేదాలు ఖర్చు చేశాడు. కృతి యొక బెబ్బులివలే అతని శరీర పటుత్వమును హరించింది. కాని ఇనాము దక్కలేదు. నిర్వేదనం చెంది కవి ఇలా వాపోయాడు,

'ముత్యముల కిక్క యైన సముద్రమున
బెక్కుమారులు మున్కలు వేసినాడ
భాగ్యహీనుడ ముత్యమ్ము పడయనయితి
వనధి నను మ్రింగి నోరు వచ్చినది తుదకు'

ఆ మహా వేదనతోనే సత్కవీంద్రుడు తనువు చాలించాడు.

పోనీ లక్ష్మీ కటాక్షం సిద్ధించిదనుకొందామా, దానితోబాటు ప్రాప్తించే ఈతి బాధలు కోకొల్లలు. ఆస్తినాశించి అయినవారూ కానివారూ బంధువులమంటూ రాబందుల్లా వచ్చి చేరుతారు. నక్క వినయాలు శుష్కప్రియాలు ఒలకబోస్తూ చీకాకు పరుస్తారు. చోరభయం, అపాత్ర దాన సమస్య, చంచలమైన సిరిని నిలుపుకోలేక తాపత్రయాలు!

వీటిలో మునకలు వేస్తూ ఆ గృహస్తు పడే బాధలు చెప్పనలవి కాదు. ఇన్ని ఈతి బాధల పాల్బడడం కన్నా అవసరమైన ధనవనరులతో ప్రశాంత జీవనం మేలన్న పై సామెతల హితోపదేశం సర్వదా శిరోధార్యం.

## 44

తెలుగు సామెత : ప్రార్థించే పెదవులకన్నా పనిచేసే చేతులు మిన్న

బైబులు సామెత : చేతిపనివారి రోజువారి పనియే వారి ప్రార్థనము (సీరా 42:13)

శ్రమైక జీవన సౌందర్యానికి పెద్దపీట వేస్తున్నాయి ఈ తెలుగు, బైబులు సామెతలు. కొందరు నడుము బిగించి కార్యం తలకెత్తుకుంటే తమ చేతులకు మట్టి అవుతుందని వెరచి అసలు కార్యోన్ముఖులు కాకుండా మిన్నకుండిపోతారు. అలాటివారికి అటు మెప్పు గాని ఇటు విమర్శలు గానీ అంటవు. వీరు తమ పీఠాల నుండి దిగివచ్చి పనులు చెయ్యరు. మడిగట్టుకున్నట్టూ ఒళ్ళువంచి చాకిరికి మళ్ళితే మైలబడిపోతా మన్నట్టు ఉంటారు. కార్యశూరులు కావాలి గానీ అరణ్యాలలో కొండ గుహలలో తపమాచరించే వారి వల్ల సమాజానికేమి ఉపయోగం లేదని సూచిస్తున్నాయి ఈ సామెతలు.

యోగులలో కర్మయోగులు వేరు. తాము చేపట్టిన కార్యాన్ని తమ వృత్తిని మనసారా నెరవేర్చే శ్రమ జీవులు ఆధ్యాత్మిక గురువులకు ఎంతమాత్రం తీసిపోరు అనే సత్యం జనం గుర్తించరు. శ్రమజీవి చిందించే చెమటలో కల్తీ లేదు. స్వాములలో దొంగలెరవో భక్తులెవరో గుర్తించడం కష్టం.

సంస్కృత పండితుడొకడు నావలో నది దాటిని కథ లోక ప్రసిద్ధం. పడవవానితో 'ఏమోయీ, నీకు తర్కశాస్త్రం తెలుసునా? యోగమెరుగుదువా? జ్యోతిషమందు ప్రవేశమున్నదా?' అని ప్రశ్నించి 'నీ జీవితం వ్యర్థమోయీ' అంటూ మోర ఎత్తి కూర్చున్నాడట. పడవకు చిల్లి పడి మునిగిపోనుండగా పడవవాడు 'స్వామీ, తమకు ఈత వచ్చునాండీ?' అడిగిన వైనం నవ్వు తెప్పించేదే అయినా పై సామెతలు ఇందులో సార్థకమవుతున్నాయి.

అనాదిగా హైందవ సమాజం పునాదులు శ్రమ విభజనపై నిలిచి ఉన్నాయి. క్రతువులను నిర్వర్తించే బాపనయ్యలు లేకున్నా సమాజం కొనసాగుతుంది గానీ కుండలు చేసే కుమ్మరి, బుట్టలల్లే మేదరి లేకుంటే జన జీవనం జరుగుతుందా? మృత పశు కళేబరాన్ని బయటికి మోసుకుపోయే చండాలురే లేకుంటే అంటు వ్యాధులతో జనపదాలు అస్తవ్యస్తమైపోవా?

బైబులు సామెతలోని సందేశం అతి పునీతమైనది. పద్మాసనం వేసుకుని నోరు తిరగని ప్రార్థనా శ్లోకాలు వల్లించడమంత పవిత్రమైనదే దినదినం కార్మిక కర్షకులు ఒళ్లువంచి చేసే పని.

## 45

తెలుగు సామెత : పిండి కొలది రొట్టె

బైబులు సామెత : కట్టె కొలది మంట (సీరా 28:10)

ఒక దర్భను మండించి భూనభోంతరాళాలు వ్యాపించే అగ్నిహోత్రం వెలగాలని చూడడం అత్యాశ. చిటికెడు పిండితో భూదేవంత రొట్టె చేయాలనుకోవడం పేరాశ. ఎవరి తాహతుకు సరిపడిన ఆశలు, ఆకలి వారికుండాలనే హితవు ఈ తెలుగు, బైబులు సామెతల్లో వ్యక్తమవుతున్నది.

రాచవారి బిడ్డను రాకుమారుడే చేపడతాడు. పాలికాపు పట్టిని పేదవాడే పరిణయమాడతాడు. నిరుపేద తండ్రి గంతకు తగ్గ బొంత చందాన తాను తూగగలిగిన సంబంధం కోసమే చూస్తాడు. తోటలో పిల్ల కోటలో రాణి కావాలని కలలు కనడం ఔచిత్యమనిపించుకోదు. ఎంత చెట్టుకు అంత గాలి కదా!

జలధిని లంఘించి లంకాపురి చేరి సీతాన్వేషణం చేపట్టాలి. సుగ్రీవ సుషేణ జాంబవంతాది వానరవీరులు తామొక్కక్కరూ ఇన్ని ఆమడులు మాత్రం లంఘించ గలమని తమ అశక్తతను వెల్లడిస్తారు. అంత దూరం ఆకాశ మార్గాన ఎగిరి వెళ్ళగలిగిన వాడు వాయునందనుడొక్కడే. ఇలా తమ బలపరాక్రమాల, శక్తి సామర్థ్యాల అంచనా ఎరిగి ప్రవర్తిల్లేవాడే బుద్ధిమంతుడు.

పేదవాడు ఎవరిమీదైనా కోపగించుకుంటే పండ్లు కొరికి, పెదవి కొరికి తనను తాను బాధించుకొనడమే మిగులుతుంది. రాజు తలుచుకొంటే మాత్రం దెబ్బలకు కొదువ ఉండదు. సాధ్యాసాధ్య విచక్షణ కలిగి కార్యాలు తలపెట్టాలి. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికై అఱ్రులు చాచిందట!

ముచ్చటగా మూడు పదాలతో పై రెండు సామెతలూ సామాన్యులు పాటించ వలసిన జీవన సరళిని కళ్ళెదుట ఉంచుతున్నాయి. ప్రతివాడూ తన పరిధిలో తన స్థితిని గుర్తెరిగి ఆకాశానికి నిచ్చెనలు వేయక గుట్టుగా జీవనం గడపాలని ఈ రెండిటి సారాంశం. అలా కాక అప్పుచేసి పప్పుకూడు చందాన లేనిపోని భేషజాలకు, బడాయిలకు పోతే భంగపాటే.

'కానలేడు నుదురు కర్ణముల్ వీపును
నెరులు కానలేడు నెత్తిమీద
తన్నె కానలేడు దైవము నెరుగునా' అని అంటాడు వేమన.

మనషన్నవాడు తన నొసటిని, చెవులను, వీపును, నడినెత్తిని తానే చూడలేడు. అలాటిది దేవుణ్ణి చూడాలని కుతూహలపడడంలో అర్థమేముంది. ఎవరికేది సాధ్యమో ఎవరికేది ప్రాప్తమో అంతవరకే అని గ్రహించమని ఈ సామెతల ఉద్బోధ.

## 46

తెలుగు సామెత : మబ్బును చూచి ముంత ఒలకబోసుకోకు

బైబులు సామెత : దూరమున ఉన్న సహోదరుని కంటే దగ్గరనున్న మిత్రుడు మేలు (సామెతలు 27:10)

బైబులులోని పై సామెతలో దూరం, సహోదరుడు – దగ్గర, మిత్రుడు అనే విషయాలు గమనింపదగినవి. తోడబుట్టినవాడు, రక్తసంబంధి అయినవాడు చాలా దూరంగా ఉన్నాడు. నిజానికి ప్రేమ ఉన్నా అతడు దూరాన ఉండడం వల్ల అవసరంలో, ఆపదలో తన సహోదరుని ఆదుకోలేడు. మనకు దగ్గరలో మన పొరుగున ఉన్నవాడు బంధువు, రక్తసంబంధి కాకపోయినా, అతడు అవసరంలో, ఆపదలో, మనలను ఆదుకునే అవకాశం ఉంది. కనుక తక్షణ సహాయం కోసం దగ్గర ఉన్న పొరుగువానినే

ఆశ్రయించాలని దీని అర్థం. పొరుగువానితో సఖ్యం కలిగి జీవిస్తే, శరీర సంబంధమైన దూరపు బాంధవ్యంకన్నా ఎక్కువ సహాయం కలుగుతుందని గ్రహించవచ్చు. అందుకే బైబులు 'తన పొరుగువాని ద్వేషించేవాడు బుద్ధిహీనుడు' అని చెబుతుంది.

ఇదే భావాన్ని తెలుగు సామెత సహజ సుందరంగా చెబుతున్నది. తెలుగు సామెతలోని 'మబ్బు'ను బైబులు సామెతలోని 'దూరమున ఉన్న సహోదరుని'కి, ముంతను దగ్గరనున్న మిత్రునికి అన్వయించుకోవాలి.

## 47

తెలుగు సామెత : మొక్కై వంగనిది మానై వంగునా?

బైబులు సామెత : బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడు దాని నుండి తొలగిపోడు (సామెతలు 22:6)

బాల్యంలో భయభక్తులు నేర్పకుండా, వినయ విద్యా వివేకాలను బోధింపకుండా పిల్లవాళ్ళను నిర్లక్ష్యంగా వదిలివేసి, వాళ్ళు పెద్దవాళ్ళై, మాట వినకుండా, వినయం లేకుండా విచ్చలవిడిగా తిరుగుతున్నప్పుడు అటువంటివాళ్ళను చూచి ఈ సామెతలను గుర్తు చేసుకుంటారు.

ఒక చిన్న మొక్కను గానీ, తీగెను గానీ మన ఇష్టం వచ్చినట్లు వంచి, మళ్ళించవచ్చు. అది విరిగిపోకుండా మనం ఎలా నిర్దేశిస్తే అలా సాగి పెరిగి పెద్దదై ఫలిస్తుంది. అదే పెద్ద మ్రానైపోయిన తరువాత వంచాలంటే వంగదు సరికదా, దాని వల్ల ప్రమాదం కూడా సంభవిస్తుంది. అందుకే వేమన 'చెట్టు ముదరనిచ్చి చిదిమిన పోవునా?' అని అంటాడు.

ఈ సందర్భంలో ఒక కథ కూడా జన బాహుళ్యంలో ఉంది. ఒక తల్లికి ఒక్కడే కుమారుడు. తండ్రి లేడు. పేద కుటుంబం. పిల్లవాడు చిన్నవాడు. ఒకరోజు అతడు ఎక్కడి నుండో ఒక సూదిని దొంగిలించి తెచ్చాడు. తల్లి దాన్ని ఆనందంగా స్వీకరించింది. మరొకనాడు ఒక తోటకూర కట్టను దొంగతనం చేసి తెచ్చాడు. తల్లి సంతోషంగా దాన్ని తీసికొని వండి పెట్టింది. పిల్లవాడు ఈ విధంగా దొంగగా మారి చిన్న చిన్న దొంగతనాలు, దోపిడీలు చెయ్యడం ప్రారంభించాడు. తల్లికి అతని వల్ల వచ్చే రాబడి మాత్రమే కనిపించింది గాని అతడెటువంటి జీవితాన్ని గడుపుతున్నాడో,

ఏమవుతున్నాడో ఆమెకు ఏమాత్రం కనిపించలేదు. ఒకనాడు ఒక పెద్ద దోపిడీ, హత్య చేసిన నేరాలలో అతగాడు పట్టుబడ్డాడు. నేరం పెద్దది కాబట్టి శిక్ష కూడా పెద్దదిగానే ఉంది. అతనికి ఉరిశిక్ష వేశారు. చివరి కోరిక చెప్పమన్నారు అధికారులు. ఒకసారి వాళ్ళ అమ్మను చూడాలని ఉందని చెప్పాడు నేరస్తుడైన ఆ కుమారుడు. తల్లి వచ్చింది. కుమారుడు వెళ్ళాడు. ఆమె దుఃఖంతో కుమారుణ్ణి కౌగలించుకో బోయింది. కుమారుడు ఏ మాత్రం ప్రతిస్పందన లేకుండా ఆమె చెవిని అమాంతం కొరికివేశాడు. తల్లి తల్లడిల్లింది. ఇదేమిటని ప్రశ్నించింది. "తోటకూర కట్ట తెచ్చిన నాడే అది తప్పని నీవు చెప్పిఉంటే నేనిలా తయారయ్యేవాణ్ణి కాదు. నా ఈ దుస్థితికి నీవే కారణం" అని చెప్పి కుమారుడు వెళ్ళిపోయాడు. మొక్కగా ఉన్నప్పుడే అతణ్ణి తల్లి గద్దించి మంచి మార్గంలో పెడితే అతడు మంచివాడయ్యేవాడే. ఇప్పుడేం చెయ్యాలి? "మొక్కయి వంగనిది మ్రానై వంగదు కదా!"

సొలొమోను సామెతలు నిత్య సత్యాలకు అద్దం పడుతుంటాయి. సామెతలు 22:6 లో "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడు దాని నుండి తొలగిపోడు" అని ఉంది. అంటే తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యా వివేకాలు, నడువవలసిన త్రోవలు చిన్ననాడే అలవడేటట్లు చేయాలి. అలా చేయ కుండా, పిల్లవాడు పెద్దవాడై దారి తప్పిన తరువాత చేసేదేమీ ఉండదు. ఏదైనా చేసినా వాడు వినడు. తెలుగు, బైబులు సామెతలు ఈ జీవిత సత్యాన్నే వివరిస్తున్నాయి.

## 48

తెలుగు సామెత : లంజకు పెట్టినపెట్టు గోడకు పూసిన సున్నం
భోగం దాని వలపు బొగ్గు తెలుపు లేవు

బైబులు సామెత : వేశ్యకు హృదయము నర్పింపకుము
నీ ఆస్తియంతయు గుల్లయగును (సీరా 9:6)

ఆలిని విడిచి పర స్త్రీ పొందుకై తిరిగేవాడు ఇంటి పెరడులో తియ్యనైన ఊటబావిని విడిచి దారుల పక్కన నిలిచిన వర్షపు నీటి గుంటలకు పోయేవానితో సమానం. బైబులు సామెతల గ్రంథం తొలి అధ్యాయం నుండి పరస్త్రీ భ్రమలో, ముఖ్యంగా వారకాంతల ఉన్మాదంలో పడిపోయేవారికి అనేకానేక హెచ్చరికలున్నాయి.

వేశ్యలు అనేక వయ్యారాలు పోతూ ప్రేమ నటిస్తారు. వారు కేవలం వెలదులు. వారికి ఈ రోజు ఒకడు, రేపు మరొకడు. ఎవరి చేత ధనపు సంచి ఉంటే వాడే ప్రియుడు. భోగం దాని వలపు ఎండమావి. తెల్లని బొగ్గు ఉంటుందంటే ఎంత విడ్డూరమో వారకాంత వలచిందంటే అంత విడ్డూరం. ఆమె ఇష్టమంతా విటుడు తెచ్చే డబ్బు పైనే. ఒకసారంటూ ధనకనకాలను వేశ్యపాలు చేస్తే అవి ఇక తిరిగి వచ్చే ప్రస్తావన లేదు. తెలుగు సామెతలో లోక వ్యవహారమొకదానితో దీనిని పోల్చడం సమయోచితంగా ఉంది. సున్నం మన పాత్రలో ఉన్నంతవరకే మనది. దానిని గోడకు పూశామో, అది ఇక ఒక్క చుక్క కూడా తిరిగి రాదు.

బైబులు సామెతలో కూడా ఇదే భావం ద్యోతకమవుతున్నది. వేశ్యాలోలత్వం సర్వదా గర్హనీయంగా బైబులు పేర్కొంటున్నది. జారస్త్రీ నడత పాతాళానికి నడిపిస్తుందనీ, ఆమె ఇచ్చకాలు రెండంచుల కత్తివంటివనీ పరిపరివిధాల యువతకు ప్రబోధాలు ఉన్నాయి. పడుపు స్త్రీ మోహంలో తమ బ్రతుకులు, కాపురాలు సర్వనాశనం చేసుకొన్నవారు కోకొల్లలు. వయసు మీరుతున్న ఇల్లాలిని నిరసించి వయసులో ఉన్న పరస్త్రీలకు, వారకాంతలకు మోహితులయ్యే వారు దుర్మార్గులు. తన కుటుంబం, పిల్లాపాపలు అనుభవించవలసిన సంపదలను వారు చేజేతులా వేశ్యలపాలు చేస్తారు. డబ్బు నిండుకుని, దేహం వ్యాధిగ్రస్థమైనాక అదే వేశ్య ఛీత్కరించి గెంటివేస్తే మళ్ళీ తన భార్య పంచకే చేరుతాడు.

బత్తిలేక లంజె పలుమారు పిలిచిన
బత్తికాదు లయపు మిత్తిగాని
మిత్తి చొరగనిల్లు మ్రింగకపోవునా? అంటాడు వేమన.

పురుషులలో ఈ చిత్తచాపల్యం అతి ప్రమాదకరమైనది. వారు అజ్ఞానంగా వేశ్యను నమ్మి సమస్తం ఆమెకు సమర్పించుకొని ఫకీరులౌతారు. ఇటువంటి వారిని మాలవాడలోని మాంసాన్ని మరిగిన కుక్కలతో పోల్చాడు వేమన.

'ఆలు రంభయైన నతి శీలవతియైన
జాలపురుషుడేల జాడమాను
మాలవాడ కుక్క మరగిన విడుచునా!'

## 49

తెలుగు సామెత : వైద్యుడు మొదట తన వ్యాధిని పోగొట్టుకోవాలి

బైబులు సామెత : వైద్యుడా, నీకు నీవే వైద్యము చేసుకొనుము (లూకా 4:23)

దగ్గుతూ, ఆయాసపడుతూ నాడిపట్టి చూచే వైద్యుణ్ణి చూస్తుంటే రోగికి దిగులే, గుండె గుబులే. చెముడు బాగు చేసుకుందామని వైద్యుడి దగ్గరికి పోతే ఆ మహాను భావుడికి బ్రహ్మచెముడైతే చిక్కే. శకునం చెప్పే బల్లి కుడితిలో పడి చచ్చిందంటే నవ్వొస్తుంది. అయితే తెలుగు సామెతలో పండిన హాస్యరసాన్ని పక్కనబెడితే పైకి తేలే నైతికార్థం గమనించదగినది. ఎదుటివానికి ఏదైనా చెప్పే ముందు తనను తాను సరిచేసుకుంటే ఆ హితోపదేశానికి అర్థముంటుంది. ప్రొద్దస్తమానం దొమ్మరి గుడిసెల్లో దూరేవాడు శ్రీరంగ నీతులు చెబితే ఎలా?

'వైద్యుడా, నీకు నీవే వైద్యము చేసుకొనుము' అని జన సామాన్యంలో వాడుకలో ఉన్న సామెతను తన స్వగ్రామానికి వచ్చిన తరుణంలో యేసుక్రీస్తు ఉటంకించాడు. ఆయన బాల్యం గడిపిన ఊరు నజరేతు. యేసు బాల్యమిత్రులెందరో ఆ దినాన ప్రార్థనా మందిరంలో ఉన్నారు. అన్య ప్రాంతాలలో ప్రవక్తగా గుర్తింపు తెచ్చుకున్న ప్రభువు తన స్వస్థలంలో మొదటసారిగా బోధకుడుగా నిలిచి దైవోపదేశమిస్తున్న తరుణం. అక్కడ చేరినవారంతా ఇతడు మనకు తెలిసినవాడే కదా అంటూ చెవులు కొరుక్కుంటున్న తరుణంలో ఆయన వారితో, 'నా విషయంలో మీరు 'వైద్యుడా, నీకు నీవే వైద్యం చేసుకో' అనే సామెతను ఉపయోగిస్తారు' అని అన్నాడు. అక్కడివారి ధోరణి అమ్మ పుట్టిల్లు మేనమామ ఎరుగడా అన్నట్టుగా ఉంది. తమ మధ్య పెరిగిన వ్యక్తిని గురువుగా వారంగీకరించలేకపోతున్నారు. నీవు మాకు చెప్పేముందు నీ సంగతి ముందు నీవు చూచుకో అన్నట్టుగా ఉంది వారి వాలకం. ఇది చెప్పిన తరువాత యేసు లోకుల సహజ ప్రవృత్తిని వర్ణిస్తూ 'ప్రవక్త ఎవడూ స్వదేశంలో ఘనుడు కాదు' అన్నాడు. బైబులు సామెత నేపథ్యం ఇది.

తెలుగు, బైబులు సామెతలు రెండూ ఒకే అర్థాన్ని ప్రతిపాదిస్తున్నాయి. మన ఇల్లు చక్కబెట్టుకున్న తరువాతే ఊరి పెత్తనాలెన్నైనా. తనలో లొసుగులుంచుకుని ఎదుటివారిని సరిదిద్దబోతే తిరస్కారమెదురయ్యే ప్రమాదము.

తెలుగు, బైబులు సామెతలు ముక్తకంఠంతో ప్రసాదించిన ఉపదేశామృతం గ్రోలినవాడు ధన్యుడు. అది మనిషిని సన్మార్గంలో నడిపిస్తుంది. అందని పండ్లకు ఆశపడవద్దంటూ, పరకాంత జోలికి పోవడంలోని ప్రమాదాన్ని వివరించినదొక జంట. అననుకూలమైన చోట అనగా రాజు ఎదుట గొప్పలకు పోవద్దంటుంది మరొక సామెతల జంట. ఇంట గెలిచి రచ్చ గెలవమనీ, అపకారికి ఉపకారం చేయమనీ హితవు పలుకుతున్నాయి. కష్టించి ఆపైన సుఖపడమనీ, దానం గుప్తంగా ఉండాలనీ, మాతా పితలే ప్రత్యక్ష దైవాలనీ, శ్రద్ధగా విద్య గడించాలనీ, పూజలకు చిత్తశుద్ధి ప్రాణమనీ, క్రియాసహిత విశ్వాసం శ్రేష్ఠమనీ, ధనకాంక్ష అనర్థాలకు హేతువనీ, వెలుగుండగానే కార్యాలు చక్కబెట్టుకోవాలనీ, నమ్మకద్రోహమంత ఘోరం వేరొకటి లేదనీ, తొందరపాటు తగదనీ, సంయమనంతో వ్యవహరించాలనీ అనేక విధాలుగా సమానార్థకాలైన తెలుగు, బైబులు సామెతలు మానవాళికి తమ అమరవాణిని వినిపించాయి.

# రెండవ భాగం:

## తెలుగు, బైబులు సామెతలు: ఒక తులనాత్మక పరిశీలనం

### 3. తెలుగు, బైబులు సామెతలు: సార్వత్రిక సత్యాలు

# 3. తెలుగు, బైబులు సామెతలు: సార్వత్రిక సత్యాలు

సార్వత్రిక సత్యాలు ఎప్పుడైనా, ఎక్కడైనా - తెలుగు నేల మీదనైనా, ఇశ్రాయేలు కొండల మీదనైనా - ఒకే విధంగా ఉంటాయి.

ప్రస్తుతం పాశ్చాత్య దేశాలలో యువతీ యువకులు మొదట పరిచయాలు కలిగి, స్నేహ సంబంధాలు పెరిగిన తరువాతనే వివాహం గురించి ఆలోచించడం కద్దు. అది వారికి వాస్తవం. మన సంస్కృతిలో అది చెల్లదు. కాని 'ఆకలి రుచి ఎరుగద'న్నది ఎక్కడైనా, ఎప్పుడైనా ఆమోదయోగ్యమైన సత్యమే. పుట్టినవాడు పెండ్లాడక తప్పదు అన్నది సార్వత్రికం కాదు. కాని 'పుట్టినవాడు గిట్టక మానడన్న'ది మాత్రం సార్వత్రికం. ఈ అధ్యాయంలో పరిశీలించినది ఇలాటి సామెతల జతలనే.

**1**

తెలుగు సామెత : అద్దంలో కనిపించేది మన ముఖమే

బైబులు సామెత : నీటిలో మన ముఖము కనిపించునట్లు ఇతరులలో మన భావములనే చూతుము (సామెతలు 27:19)

తెలుగు సామెతలో చెప్పిన అద్దమూ, బైబులు సామెతలో చెప్పిన నీరూ ప్రతిబింబించే గుణం కలిగినవి. తమకు అభిముఖంగా ఏది ఉంటే దానినే అవి ప్రతిబింబిస్తాయి. అలాగే మనుషులు ఎదుటి వారిలో తమ ప్రతిబింబాలనే చూచుకుంటారు అని ఈ సామెతలు తెలుపుతున్నాయి.

ఉదాహరణకు ధర్మరాజుకు లోకమంతటా దుర్మార్గుడొక్కడూ కనిపించలేదట. దుర్యోధనునికి జగమంతా దుర్మార్గంగానే కనిపించిందట.

అలాగే కాముకుడు పరస్త్రీ తనను చూచి పలకరింపుగా నవ్వితే తనపై ఇష్టంతోనే నవ్విందనుకుంటాడు. దోషభరిత హృదయమున్నవానికి ఎవరెలా మాట్లాడినా తన దోషమే స్ఫురిస్తూ ఉంటుంది.

నరకాసుర వధ ఘట్టంలో సత్యభామ రూపు రేఖా విలాసాలను క్రమాలంకారంలో "రాకేందు బింబమై రవి బింబమై యొప్పు నీరజాతేక్షణ నెమ్మొగంబు" అంటూ భాగవతం దశమస్కంధం 183వ పద్యంలో అభివర్ణిస్తాడు పోతనామాత్యుడు. శత్రుభావం వహించి పోరుసలుపుతున్న రాక్షస వీరులకు ఆమె ముఖం మధ్యందిన మార్తాండుని వలె తీక్షణంగానూ, ముచ్చటగా ప్రియసఖి శౌర్యాన్ని తిలకిస్తున్న శ్రీకృష్ణునికి రాకేందుబింబం వలెనూ కనబడినదట. మనం మన మనోభావాలకు అనుగుణంగా ఎదుటివారిని చూస్తాము అనడానికి ఇది ఇంకొక ఉదాహరణం. దీనినే ఈ సామెతలు తెలుపుతున్నాయి.

పరేంగితజ్ఞుడైనవాడు ఇతరుల మనోభావాలనెరిగి ప్రవర్తిస్తాడు. తనకొక అభిప్రాయమున్నప్పటికీ పరులకు వారి అభిప్రాయాలు వారికుంటాయని గ్రహించిన వాడే విజ్ఞుడు. అలా ఎదుటి వ్యక్తి మనసెరిగి తదనుగుణంగా ఆ భావాలను గౌరవిస్తూ నడుచుకొనే వ్యక్తి మన్ననకు పాత్రుడౌతాడు అని ఈ సామెతలు పరోక్షంగా ప్రబోధిస్తున్నాయి.

## 2

తెలుగు సామెత : ఆకలి రుచి ఎరుగదు
ఆకొన్నకూడే అమృతము
కాలే కడుపుకు మాడోమక్కో

బైబులు సామెత : ఆకలిగా ఉన్నపుడు చేదు కూడా తీయగా ఉండును
(సామెతలు 27:7)

సాధారణంగా ఆకులలములు, పచ్చగడ్డి తదితరాలను మనిషి ఆహారంగా ఉపయోగించడు. క్షామం నెలకొన్నప్పుడు ప్రజలు దేనినీ విడిచిపెట్టరు. మైదానంలో పెరిగే ఏ పచ్చని తీగె అయినా, ఏ కాయ అయినా ఉచితాహారమే.

కొన్నిసార్లు సమృద్ధి ఒక సమస్య అయి కూర్చుంటుంది. అన్నీ తిన్నగా అమరుతూ ఉంటే జీవితం వడ్డించిన విస్తరిలాగా ఉంటే క్రమంగా ఒక్కొక్క దాని మీద ఆసక్తి సన్నగిల్లుతుంది. విచ్చలవిడిగా విషయవాంఛలలో మునిగితేలిన భోగులు ఎట్టకేలకు విరక్తి చెంది విరాగులుగా, యోగులుగా మారిన సందర్భాలూ లేకపోలేదు. ఇక్కడ

బైబులు,  తెలుగు సామెతల్లో ఈ నాణేనికి ఆవలివైపు స్థితిని ప్రస్తావించడం చూస్తున్నాము. ఆకలి బలీయమైనది. దానికి రుచులతో పని ఉండదు. అందుకే పేదలు కలో, గంజో తాగి కడుపు నింపుకుంటారు. బియ్యం కడిగిన నీళ్ళు కూడా వారి పాలిట పరమాన్నమే. నూకలతో గంజి కాచి ఇంత ఉప్పువేసి, దొరికితే ఒక మిరపకాయ నంజుకుని భుజిస్తారు. అదే ధనికులైతే ఎక్కడ చిన్న లోపమొచ్చినా పళ్ళేన్ని పక్కకు నెట్టేస్తారు.

ఆకలి రుచి ఎరుగదు అనే మాటకు జోడు గుణ్ణం వంటిది 'నిద్ర సుఖమెరుగదు' అనేది. శారీరక శ్రమ చేసి అలసిసొలసినవాడు బండరాతి మీదనైనా సరే ఆదమరచి నిద్రపోతాడు. కడుపులో చల్ల కదలకుండా సౌఖ్యంగా జీవించే ఆసామికి పట్టు పరుపులపై కూడా  నిద్రపట్టదు. ఈ సత్యమెరిగినవారు పేదల క్షుద్బాధను గమనించి వారితో తమకున్నదానిలో కొంత వారితో పంచుకోవడం సద్ధర్మం.

మొత్తంమీద అవసరం అనేది మనుషులను ఎంత దీనస్థితికైనా నడిపిస్తుందనేదే ఈ సామెతల్లోని ప్రధాన ప్రతిపాదన. కడుపు మాడినవాడికి మాడిన అన్నం చెక్కలు కూడా మృష్టాన్నమే. అలాటివాడు రుచుల కోసం చూడడు. దొరికిందే మహాభాగ్యంగా స్వీకరించి ఆరగిస్తాడు అని ఈ సామెతలు ఒక జీవిత వాస్తవాన్ని తెలుపుతున్నాయి.

**3**

తెలుగు సామెత :  ఆకును నలిపినప్పుడే సువాసన బయటపడేది

బైబులు సామెత : గోధుమ గింజ  చనిపోయిననే తప్ప ఫలించదు
(యోహాను  12:24)

ఆకును నలిపినపుడే దాని అసలైన సువాసన తెలుస్తుంది. శ్రమైక జీవనంలో ఉన్న సౌరభాన్ని వర్ణించడంలో ఈ సామెతను ఉపయోగిస్తారు. రాపిడి పెట్టనిదే వజ్రానికైనా మెరుగు రాదు. నిప్పులో కాల్చి సమ్మెటతో సరిచేయనిదే ఇనుము ఉపయోగకరమైన పనిముట్టు కాదు. పుటం వేయనిదే బంగారం పనికిరాదు. అలాగే యాతనలు అనుభవించి జయించనిదే జీవిత మాధుర్యం అందదు. ఇది శ్రమానుభవంతో గానీ అనుభవైకవేద్యం కాదు.

క్రొవ్వొత్తి కాలుతుంటేనే వెలుగులు చిమ్మగలదు. ఆ వెలుగులు చీకటిని చీల్చివేసి బ్రతుకులను వికసింపజేయగలవు. క్రొవ్వొత్తి కాలకుండా ఉంటే వెలుగూ లేదు, ప్రగతీ లేదు. కాబట్టి కష్టాలనే సుఖాలుగా భావించి ఉత్సాహంతో ముందుకు పోయిననాడే పురోగతి! కష్టాలకు, కడగండ్లకు భయపడి పారిపోతే అది తిరోగతే!

విత్తనం చావనంతవరకు అది ఒకటిగానే ఉంటుంది. భూమిలో పడి చనిపోయి, అంకురంగా రూపమెత్తినట్లయితే అది విస్తారంగా ఫలిస్తుంది. ప్రాణం పట్ల తీపి ఉండి కష్టాలకు ముఖం చాటువేసేవాడి జీవితంలో ఎదుగూ బొదుగూ ఉండదు.

ఆకును పిండితేనే సువాసన గుభాళిస్తుంది. గోధుమ గింజ మరణిస్తేనే పునర్జన్మతో విస్తారంగా ఫలిస్తుంది అని అందరు గ్రహించాలి.

## 4

తెలుగు సామెత : ఆరునెలలు సహవాసం చేస్తే వారు వీరౌతారు

బైబులు సామెత : జ్ఞానితో చెలిమి చేయువాడు జ్ఞానియగును; మూర్ఖులతో సహవాసం చేయువాడు నాశనమగును (సామెతలు 13:20)

సహవాస దోషమనే పదాన్ని మనం వింటూనే ఉంటాం. మంచిగాని, చెడుగాని సహవాసం వల్ల సంప్రాప్తిస్తుంది. స్నేహితులు మంచివారైతే అతడు మంచివాడుగా తయారౌతాడు. స్నేహితులు చెడ్డవారైతే తాను కూడా చెడ్డవాడుగా మారతాడు. అందుకే "నీ స్నేహితుల పేర్లు చెప్పు, నీవెలాంటివాడివో నేను చెబుతాను" అనే ఆంగ్ల నానుడి పుట్టి ఉంటుంది. అందువలన సహవాస ప్రభావం మానవుల మీద అధికంగా ఉంటుందని చెప్పవచ్చు. సహవాసులు, మిత్రులు మంచివారైతే సత్ఫలితాలొస్తాయి. అందుకే "సాధు సంఘంబు సకలార్థ సాధకంబు" అని నీతిశాస్త్ర కారుడు బోధిస్తున్నాడు. సత్యసౌరభాలు అలవడతాయి. బుద్ధిమాంద్యము నశిస్తుంది. సద్వర్తనం అలవడుతుంది. కనుక మంచి మిత్రబృందం వల్ల మంచే జరుగుతుంది.

లోకంతీరు ఎరుగని బాలుడు తండ్రిచాటు బిడ్డగా ఎదిగి విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టిన తరువాత తనకి తారసపడే వారిలోని కుళ్ళు కుత్సితాలు తెలియక అలాటివారిని నమ్ముతాడు. పయోముఖ విషకుంభాలను ప్రాణమిత్రులని భ్రమిస్తూ తాను కూడా భ్రష్టుడౌతాడు. ఇది జగమెరిగిన సత్యం. తెలుగు సామెత సూచన ప్రాయంగా ఉంటే, బైబులు సామెత వాచ్యంగా ఉండడం ఇక్కడ గమనార్హం.

## 5

తెలుగు సామెత : ఆరోగ్యమే మహాభాగ్యము

బైబులు సామెత : దేహారోగ్యమును మించిన సంపద లేదు (సీరా 30:16)

శరీర రుగ్మతలు మానవ మనుగడలో అవిభాజ్యమైన అంతర్భాగాలు. కష్టం తెలియకుండా పెరిగిన గౌతముడు యుక్తవయసులో గ్రహించిన సత్యమిదే. జన్మమే దుఃఖభోజనం. జరామరణాలు ప్రియా వియోగం తదితర దుఃఖ కారణాలలో అనారోగ్యం కూడా ఉంది. ఇకపోతే తెలుగు, బైబులు సామెతలు రెండూ అన్ని సిరుల కన్నా ఆరోగ్యసిరి మిన్నయని తెలుపుతున్నాయి.

దేహాన్ని దాని పరిమితులు దాటి కష్టపెట్టినా అత్యాశకు పోయి పీకలబంటి మెక్కినా దుర్వ్యసనాలకు దాసులై కలుషభూయిష్టం చేసినా సున్నితమైన దైహిక సమతుల్యం దెబ్బతిని అస్వస్థత ఏర్పడక తప్పదు. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నది ఆరోగ్య రక్షణకు మూలాధారం.

తెలుగు, బైబులు సామెతలలో ప్రస్తావించిన మహాభాగ్యము సంపద అనే పదాలను పరిశీలిస్తే ధనసమృద్ధి కన్నా మించిన వరం శారీరక స్వస్థత అన్నది అవగతమవుతున్నది. వేళకి తినీ తినకా ధనసముపార్జన యావలో ఆరోగ్యాన్ని విస్మరించి కోట్లు కూడబెట్టిన తరువాత కడుపారా ఇష్ట పదార్థాలు తిందామన్నా సుఖసౌఖ్యాలు అనుభవించుదామన్నా శరీరం సహకరించదు. ధనం వెచ్చించి నలభీముల వంటి వంటగాళ్ళను నియమించి నవకాయ పిండివంటలు వండించినా తినే ప్రాప్తముండదు. డబ్బు విరజిమ్మి హంసతూలికాతల్పాలు తెచ్చుకున్నా నిద్ర రాదు. ఎన్ని ఉన్నా వాటిని అనుభవించే యోగముండాలి. దీనికి కీలకం ఆరోగ్యం. సంపదలు పలురకాలు. ఆరోగ్య సంపద ఉంటే అన్ని సంపదలనూ అందిపుచ్చుకోవచ్చునన్నదే ఈ సామెతలు చెప్పేది.

## 6

తెలుగు సామెత : ఈ పొద్దు చిన్నక్కకైన గతి, రేపు పెద్దక్కకు

బైబులు సామెత : నేడు అతని వంతు రేపు నీ వంతు (సీరా 38:22)

సాటి మనిషి ఆపదలో ఉన్నప్పుడు మనం క్షేమంగా ఉన్నాము కదా అని నిశ్చింతగా ఉండిపోయి, వారిని పట్టించుకొనక ఉపేక్షించడంలోని అనర్థాన్నీ, స్వార్థగుణాన్నీ ఈ సామెతలు అధిక్షేపిస్తున్నాయి.

'జర్మనీలో నాజీలు మొదట కమ్యూనిస్టులను వేటాడారు, నేను కమ్యూనిస్టును కాదు గదా అని నోరెత్తలేదు.

ఆ తరువాత వారు యూదులపై మారణహోమం సాగించారు. నేను యూదుణ్ణి కాదు కనుక పెదవి విప్పలేదు.

అటుపైన వారు కార్మిక సంఘాల వారిని పీడించారు. నేను కార్మిక సంఘాలకు చెందినవాడిని కాను కనుక మిన్నకుండిపోయాను.

వారు కేథలిక్కుల కోసం వచ్చారు. నేను కేథలిక్కును కాను కనుక చూస్తూ ఊరుకున్నాను.

ఈసారి వారు నా కోసం వచ్చారు. అప్పటికి ఇక నాకోసం నిలబడేవారెవరూ మిగలలేదు' – అని వాపోయాడు మార్టిన్ నియొమోలర్ ఒక కవితలో.

సాటివారికి ఆపద కలిగినప్పుడు పట్టించుకోకుండా ఉండిపోవడం సంఘజీవిగా మానవునికి తగని పని. కరుణ చూపినవాడే కరుణకు పాత్రుడవుతాడు. కష్టమనేది కాస్త ముందూ వెనుకగా అందరికీ సంప్రాప్తిస్తుంది.

బ్రిటిషువారు రాజ్యకాంక్షతో భరత ఖండంలోని ఒక్కొక్క సంస్థానాన్నీ కబళిస్తూ వస్తున్నారు. పొరుగు రాజ్యం తెల్లవాడి ఫిరంగులకు బలియై కుప్పగూలితే శత్రువు కడతేరాడని సంతోషించారు గానీ, తమ వంతు వస్తుందని గ్రహించలేకపోయారు నాటి రాజులు.

చిన్నక్కను భర్త పుట్టింటికి తరిమాడు. ఆమెను తూలనాడి ఆక్షేపించి, అప్పటికి నిక్షేపంగా కాపురం చేసుకుంటున్న పెద్దక్కను ఆకాశానికెత్తేవారు రేపు ఆ పెద్దక్కను కూడా ఆమె భర్త హింసించే తరుణం రావచ్చునని గ్రహించరు.

బైబులు సామెతలో స్థూలంగా ఇదే అర్థం గోచరిస్తున్నప్పటికీ మరణం తథ్యమనే సార్వత్రిక సత్యం కూడా ఇందులో తొంగిచూస్తున్నది. ముందూ వెనుకగా అందరూ పోయేవారే. ఈ లోకమెవరికీ శాశ్వతం కాదు. మరణం అంచున ఉన్నవారిని చూచి మనకున్న ఆరోగ్యం, సదుపాయాలను గుణించి గర్వించేవారు తెలివిమాలినవారు. ముందూ వెనుకగా అందరూ కష్టాలను అనుభవించేవారే, పోయేవారే అంటున్నాయి ఈ రెండు సామెతలూ.

## 7

తెలుగు సామెత : ఉప్పు లేని పప్పు

బైబులు సామెత : ఉప్పు లేని చప్పిడి కూడు (యోబు 6:5)

వేమన యోగి కాకమునుపు పూర్వాశ్రమంలో భోగిగా ఉండేవాడని రాళ్ళబండి అనంత కృష్ణ శర్మ తదితర పరిశోధకులు అభిప్రాయపడ్డారు. రుచులను గురించి వేమన సహజ సుందరమైన పద్యాలు వ్రాయడం కూడా బహుశః ఇలా ఊహించడానికి దోహదం చేసి ఉంటుంది.

'నేయిలేని కూడు నీయాన కసువది
కూరలేని తిండి కుక్కతిండి
ప్రియము లేని కూడా పిండపు కూడురా'

భోజనం షడ్రసోపేతంగా లేకున్నా చవులూరించేదిగా ఉండాలి. 'వివాహ భోజనంబు' అందరికీ అందని మాని పండయినా ఎవరి పరిధిలో వారు ఉప్పుతో ఉల్లిపాయలతో నోటికి హితవైన ఆహారమే భుజించడానికి ప్రయత్నిస్తారు. తెలుగువారి భాగ్యమేమిటో గానీ ఎంత లేమిని అనుభవించేవారింట అయినా ఆవకాయ, నేతిచుక్క ఉండక మానవు. వేమన అంటున్నది అదే. కమ్మని నేయి వడ్డించుకొనని భోజనం భోజనమే కాదు. కూరలేని అన్నాన్ని ఊహించలేము. ఇల్లాలు ప్రక్కనే కూర్చుని విసనకర్రతో విసరుతూ కొసరి కొసరి ప్రియంగా వడ్డిస్తుంటే ఆరగించేవాడే రాజేంద్ర భోగి.

ఇవేమీ లేకుండా ఉప్పు కూడా లేని పప్పును తినడమంటే నిస్సారమైన, సంతోషం లేని జీవితాన్ని జీవించడం. బైబులు సామెత కూడా ఇటువంటి నేపథ్యం నుండే పుట్టి ఈ అర్థాన్నే బోధిస్తున్నది.

బైబులు సామెత బాధాసర్పద్రష్టుడైన యోబు పలికిన మాట. అరిష్టం ముంచుకు రాకమునుపు తాను నోటపెట్టనొల్లని పదార్థాలిప్పుడు తనకు తప్పనిసరి ఆహారమైనవని చెప్పే సందర్భంలో అతడు వాడిన సామెత ఇది. జిహ్వకు హితము గాని ముద్దనెవరూ నోటబెట్టరు. తన బ్రతుకలా నిస్సారమై చివికి చప్పిడిగా ఉందని యోబు వాపోతున్నాడు.

## 8

తెలుగు సామెత : ఎంత చెట్టుకు అంత గాలి

బైబులు సామెత : ప్రాయమును బట్టి పరాక్రమముండును
(న్యాయాధిపతులు 8:2)

ఈ తెలుగు సామెత సామర్థ్యానికి సంబంధించినది. ఎవరి శక్త్యనుసారం వారు పనిచేస్తారు. ఎక్కువ బలం గలవాడు పదిమందిని జయిస్తే తక్కువ బలం గలవాడు ఇద్దరినే జయిస్తాడు. అటువంటి సందర్భాలలో ఎంత చెట్టుకు అంత గాలి అనే ఈ తెలుగు సామెతను ఉపయోగిస్తారు.

కొందరు తోటివారితో 'ఈ మాత్రం చెయ్యలేవా, ఈ కొద్ది మొత్తం ఖర్చుపెట్టలేవా?' అంటారు. వారి పరిస్థితులు వారివి. వారి శక్తిసామర్థ్యాలు వారివి. 'ఎంత చెట్టుకు అంత గాలి' అనడంలోని భావం ఇదే.

బైబులు సామెత కూడా ఇదే భావాన్ని విశదీకరిస్తున్నది. ఎవరి ప్రాయాన్ని బట్టి, శక్తి సామర్థ్యాలను బట్టి వారి పరాక్రమముంటుందని చెబుతున్నది. దైవ వరప్రసాదిత పరాక్రమశాలి గిద్యోను జాతికంటకులైన జెబహు, సల్మున్నా అనే ఇద్దరు మిద్యాను సర్దారులను సంకుల సమరం సలిపి ప్రాణాలతో పట్టుకుంటాడు. తాబోరు కొండవద్ద మీరు వధించిన వారు ఎలాటివారు? అని వారిని ప్రశ్నిస్తాడు. వారు మొండి ధైర్యంతో తమకు మరణం తథ్యమని భావించి 'వారు నీలాగానే ఉన్నారు' అని జవాబిస్తారు. వారు గతంలో వధించినది తన సోదరులనే అని గ్రహించిన గిద్యోను కుపితుడై వారిని ఖడ్గంతో ఖండించమని తన పెద్ద కుమారుని ఆదేశిస్తాడు. అతడింకా లేబ్రాయపు వాడు గనుక అందుకు భయపడి వెనుకడుగు వేశాడు. అది చూచి బంధితులైన శత్రురాజులిద్దరూ 'వాడు కుర్ర, మావంటివారిని వాడేం వధించగలడు?' అంటూ ఆక్షేపించిన సందర్భంలో ఈ సామెతను ఉపయోగించారు. అంతట గిద్యోను తానే లేచి కత్తిదూసి వారిద్దరినీ తెగనరికాడు. కనుక ప్రాయాన్ని బట్టి పరాక్రమముంటుంది. ఎవరి శక్తి సామర్థ్యాలను బట్టి వారు ప్రవర్తిస్తారు, పరాక్రమిస్తారు.

ఒకరితో ఒకరు పోటీ పడకూడదు. ఒకరి శక్తిని బట్టి వేరొకరిని అంచనా వేయకూడదు. ఎవరి పరిధి వారిదే. ఇటువంటి సమయాలలోనే 'ఎంత చెట్టుకు అంత గాలి' అనే తెలుగు సామెతను, 'ప్రాయమును బట్టి పరాక్రమముండును' అనే బైబులు సామెతను సమతుల్యాలుగా సమానార్థకాలుగా వాడుతుంటారు.

## 9

తెలుగు సామెత : ఒంటి కంటే జంట మేలు

బైబులు సామెత : ఏకాకిగా ఉండుట కంటే ఇద్దరు కలిసి ఉండుట మేలు (ఉపదేశకుడు 4:9)

మానవుడు సంఘజీవి. నలుగురితో కలిసినప్పుడే అతని బుద్ధి వికసిస్తుంది. కొన్నిసార్లు అందరికీ కూడా ఒంటరితనం బాగుందనిపిస్తుంది. కానీ ఆ ఒంటరితనంలో ఒక్కోసారి నిర్లిప్తత ఏర్పడవచ్చు. నిరాసక్తత చోటు చేసుకోవచ్చు. లేకుంటే కొన్ని క్రూరమైన ఆలోచనలు చేయవచ్చు. కనీసం చుట్టూ ఎవరైనా ఉంటే వారు గమనిస్తున్నారేమో అని అయినా అలాటి ఆలోచనలు చేయరు. అందుకే పెద్దలు ఒంటరిగా కంటే జంటగా ఉండడం మేలన్నారు. జంటగా ఉండడం వల్ల ఒకరికొకరం అన్న ధైర్యం మనస్సులో బాధను పంచుకోవడానికి తోడు ఒకరుండడం ఎంతో ఊరటనిస్తుంది. ఇద్దరు కలిసి చేస్తే పని తేలిక కూడా అవుతుంది. ఏ పని అయినా కూడా ఇతరుల సాన్నిహిత్యంలో హుషారుగా ఆడుతూ, పాడుతూ చేయవచ్చు. అదే విషయాన్ని తెలుగు సామెత, బైబులు సామెత కూడా సరళమైన భాషలో స్పష్టం చేస్తున్నాయి. జంటగా పనిచేయడం వల్ల ఎక్కువ పని తక్కువ సమయంలో చేయగలుగుతారు. జంటగా ఉండడంలోని మేలుని నొక్కి చెబుతున్నాయి రెండు సామెతలూనూ.

పై రెండు సామెతల్లోనూ భార్యాభర్తల జత గురించి ప్రత్యేకించి ప్రస్తావన లేకున్నప్పటికీ ఒక వయస్సు వచ్చాక ఈడూ జోడూ చూచి ముడివేయడంగా కూడా దీనిని భావించవచ్చు. సృష్టికర్త మనిషి రూప కల్పనానంతరం "నరుడు ఒంటరిగా ఉండుట మంచిది కాద"ని యోచించినట్టుగా బైబులు చెబుతున్నది. సహధర్మచారిణి లేకుంటే పురుషుడు పరిపూర్ణుడు కాడని ఇందులోని భావం. ప్రకృతి, పురుషుడు

ఏకమైతేనే జీవనసారం. అర్ధనారీశ్వరుడు ఆడమగ నైజాల ఏక శరీర సంగమం. వేదనలో, నిరాశలో, ఒత్తిడిలో ఉన్న మగడిని ఊరడించి తరుణోపాయం సూచించే మగువ నిజంగా దేవుడిచ్చిన వరం.

ఆలోచనల విషయంలో కూడా ఒకడు తన ధోరణిలోనే వెళ్ళిపోతూ ఇతర పార్శ్వం చూడడు. రెండవ మనిషికి అది చటుక్కున గోచరిస్తుంది. దిద్దుకోవడానికి అవకాశ ముంటుంది. ఆ సత్యాన్నే ఈ సామెతలు తేటతెల్లం చేస్తున్నాయి.

## 10

తెలుగు సామెత : ఒక ఒరలో రెండు కత్తులిమడవు

బైబులు సామెత : ఎవరును ఇద్దరు యజమానులను సేవింపలేరు (మత్తయి 6:24)

'కంటికి నిద్ర వచ్చునె...' అని ప్రారంభించి శ్రీనాథ మహా కవి తన భీమఖండంలో 'కంటకుడైన శాత్రవుడొకండు తనంతట తాను కల్గినన్' అంటాడు. తనతో సమానుడైన శత్రువు ఒకడుంటే కంటికి నిద్ర రాదట. వంటకం రుచింపదట. ఇంకే సుఖమూ తృప్తినివ్వదట. పై తెలుగు సామెత కూడా ఒక ఒరలో రెండు కత్తులిమడవని వివరిస్తున్నది.

ఇది స్పర్థలతో వైషమ్యాలతో నడుస్తున్న లోకం. ఒకరి కంటే మరొకరు ప్రజ్ఞావంతులనిపించుకోవాలని, ఒకరి కంటే మరొకరు పండితప్రకాండులని పేరు పొందాలని అందరూ తాపత్రయపడుతున్న కాలం! ఎదుటివాని గొప్పతనాన్ని, సౌమనస్యాన్ని అర్థం చేసుకోలేక, అర్థం చేసుకున్నా అంగీకరించలేక, అసూయా ద్వేషాలతో క్రింద మీదౌతున్న ఈ లోకంలో, ఇద్దరు సమాన ప్రతిభాపాటవాలు గలవారు ఒకరినొకరు సహింపలేరు సరికదా, కొన్నిసార్లు ఒకరి మీద ఒకరు కత్తులు దూసుకుంటారు కూడా. ఇటువంటి సందర్భాలను పై తెలుగు సామెత జ్ఞప్తికి తెస్తుంది.

లోకులు కూడా ఒకే సమయంలో ఇద్దరు వ్యక్తులకు సమాన గౌరవస్థానాలు కల్పించడానికి నానాయాతనలూ పడతారు. ఒకవేళ కల్పించినా ఎవరికి చిన్న లోటు కలిగినా, అతడు అందరి మీదా విరుచుకు పడతాడు. తోడివారిలో తనకు తలవంపులు వచ్చాయని మండిపడతాడు. ఇందువల్లనే ఒక ఒరలో రెండు కత్తులు ఇమడలేవనే తెలుగు సామెత ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఎవరును ఇద్దరు యజమానులను సేవింపలేరు అనే బైబులు సామెత కూడా తెలుగు సామెతలోని భావాన్నే స్ఫురింపజేస్తుంది. ఒక మనిషి ఇద్దరు యజమానులకు కొలువు చేసి ఆ ఇద్దరినీ ఏక రీతిలో మెప్పించడం అసాధ్యం. అతడు ఒక యజమాని పట్ల విధేయతా విశ్వాసాలు, వేరొకరి పట్ల ఉదాసీతన, నిరాసక్తతలు చూపించడం సహజం. అది మానవ నైజం. క్రీస్తు నోటి వెంట వెలువడిన ఈ సామెతలోని ఇద్దరు యజమానులు దైవము, ధనము. దైవం మనిషిని నిస్వార్థపరునిగా చేస్తే, ధనం మనిషిని స్వార్థపరుణ్ణి చేస్తుంది. అందువలన ఎవరూ ఏక కాలంలో ఈ ఇద్దరు యజమానులను ఏకరీతిలో సేవించలేడు.

బైబులు సామెతలోని మనిషిని ఇద్దరు యజమానులను, తెలుగు సామెతలోని 'ఒక' రెండు కత్తులుగా భావించుకుంటే ఈ రెండు సామెతలు సమానార్థకాలవుతాయి.

## 11

తెలుగు సామెత : కడివెడు పాలకు ఒక మజ్జిగ బొట్టు

బైబులు సామెత : గంపెడు బొగ్గులకు ఒక నిప్పురవ్వ (సీరా 11:32)

'కూరిమిగల దినములలో
నేరములెన్నడు తోచవు మరి యా
కూరిమి విరసంబమైన
నేరములే దోచుచుండు నిక్కము సుమతీ '

కుటుంబం నల్లేరుపై బండి నడకలా దీర్ఘకాలం సాగిపోతూ ఉంటుంది. అందరూ ఆప్యాయతలు పంచుకుంటూ అన్యోన్యంగా ఉంటారు. ఎప్పుడో ఎక్కడో పుడుతుంది ముసలం. ఇక మొదలవుతాయి కీచులాటలు. ఉమ్మడి పరివారం నిట్టనిలువునూ చీలి ఆస్తిపంపకాలు, ఆక్షేపణలు, పగలు రగులుకుంటాయి.

పైని చెప్పిన బైబులు సామెతలోనూ, తెలుగు సామెతలోనూ ప్రధానంగా ఉన్నది ఒకటే. పెద్ద ఎత్తున మన్నన, మంచితనం ఉన్న సంబంధం చెడడానికి ఒక్క చెప్పుడు మాట చాలు. దాయాదుల పోరు, యుద్ధాలు, రక్తపాతాలు మొదలవుతాయి. గృహసీమలో ఇల్లాళ్ళందరికీ చిరపరిచితమైన సామ్యం ఈ సత్యానికి ఆసరాగా

నిలిచింది. గిన్నె నిండా పాలుంటాయి. ఆ ఇల్లాలు నాలుగు మజ్జిగ చుక్కలు వేసి మూత బెడుతుంది. అంతే, తెల్లవారేసరికల్లా గిన్నెడు పాలూ రసాయనికంగా మళ్ళీ వెనక్కి వచ్చే వీలు లేకుండా నిర్ణయాత్మకంగా మారిపోతాయి. బొగ్గులు – నిప్పురవ్వ సామ్యం, పాలు – విషపు చుక్క సామ్యం చెప్పేది కూడా అదే. బాణసంచా నిలువచేసిన గిడ్డంగిలో చిన్న నిప్పురవ్వ చాలు, పెను సంక్షోభం సృష్టించడానికి.

అదే విధంగా మానవ సంబంధాల విషయంలో నిబిడీకృతమైన సత్యమేమిటంటే చిరకాల స్నేహ సుహృద్భావాలు ఒక్క అపార్థం మూలంగా సమసిపోయే అవకాశం ఉంది. ఒక నీలివార్త విన్నప్పుడు ఇద్దరూ ఒకసారి కలిసి సంప్రదించుకుంటే ఇట్టే పరిష్కారమైపోతుంది. అయితే అలా ఎటునుంచో విన్నవార్త మనసునెంతగా కలచివేస్తుందంటే ప్రాణ మిత్రులిరువురూ బద్ధ శత్రువులైపోతారు. ఈ విధంగా అమృత భాండంలో రాలిపడే విషపు చుక్కల విషయంలో జాగరూకత అవసరం అని ఈ సామెతలు హెచ్చరిస్తున్నాయి.

## 12

తెలుగు సామెత : కడివెడు పాలకు ఒక విషపు చుక్క

బైబులు సామెత : ఈగలు పడి చచ్చిన బుడ్డిలోని పరిమళ తైలమంతయు పాడగును. ఈ రీతిలోనే కొద్దిపాటి బలహీనత నరుని మహా జ్ఞానమును కూడా నాశము చేయును (ఉపదేశకుడు 10:1)

చెరువంత సాంబారు గుండిగలో ఒక్క బల్లి పడితే అంతా ఒలకబోయాల్సిందే. సకల శాస్త్ర పారంగతుడు వీర విక్రమ ప్రతాపుడూ అయిన రావణ బ్రహ్మకు సీతా వ్యామోహం కలిగి లంకంతా శ్మశాన వాటిక అయింది. శత సోదర పరివేష్ఠితా సనుడైన రారాజు మదిలోని రాజ్య కాంక్ష వంశ క్షయానికి దారితీసింది. 'చెరకు తుద వెన్ను పుట్టిన చెరకు తీపెల్ల చెరచు గదరా సుమతీ' అని బద్దెనార్యుడు వాపోయింది దీని గురించే.

నర్మగర్భంగా, సాదృశ్యరూపకంగా తెలుగు సామెత చెప్పి ఊరుకుంటే దాని అన్వయాన్ని సైతం కరతలామలకంగా బైబులు సామెత విశ్లేషించింది. కొద్దిపాటి నిద్ర, కొంచెం అజ్ఞానం, లేశమంత దుర్బుద్ధి, రవ్వంత అత్యాశ ఉంటే చాలు కొండంత బలాన్ని, కొరతలేని విజ్ఞానాన్ని కొరగానివిగా చేస్తాయని తేటతెల్లం చేస్తున్నది.

అనురాగ సదనంగా సాగిపోయే కాపురంలో ఏదో ఒక చిన్న అపార్థం ప్రవేశిస్తుంది. చిలికి చిలికి గాలివానై, కోతిపుండు బ్రహ్మరాక్షసై తెగతెంపుల వరకు వెళుతుంది. రామభద్రుని పట్టాభిషేక శుభ గడియలు ఆసన్నమౌతున్న తరుణాన మంధర వెడలగక్కిన కాలకూట విషం అమృత భాండం వంటి శుభావసరాన్ని విషాదంలో ముంచెత్తింది.

ప్రేమకూ, ద్వేషానికీ మధ్యనున్న అడ్డు గీత వెంట్రుకవాసి అంటారు. విపరీతంగా ప్రేమ ఉన్నచోట ఆ సున్నితమైన బంధం వికటిస్తే ప్రాణమిత్రులు సైతం బద్ధ శత్రువులౌతారు. ఏది ఏమైనా మానవ సంబంధాల విషయంలో పరేంగితమెరిగి వివేకంగా ప్రవర్తించకుంటే చిన్న అపశ్రుతి సైతం మహా విపత్తుకు దారితీస్తుందని ఈ సామెతలు హెచ్చరిస్తున్నాయి.

## 13

తెలుగు సామెత : కడుపులో ఎట్లా ఉంటే కాపురమట్లా ఉంటుంది

బైబులు సామెత : మంచి చెట్టు చెడ్డ పండ్లనీయదు, చెడు చెట్టు మంచి పండ్లనీయదు (లూకా 6:45)

"చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకోవడం" అనే సామెత తెలుగులో ఉంది. అంటే ప్రసిద్ధమైన చెట్ల పేర్లు చెప్పి కాయలమ్ముకుంటూ ఉంటారు. ఉదాహరణకు "ఇవి పాలకొల్లు బత్తాయిలు" అంటారు. ఒకప్పుడు పాలకొల్లులో మంచి బత్తాయిలు దొరికేవేమో. ఇప్పుడు ఆ పేరు చెప్పి బత్తాయి పండ్లు అమ్మేవారున్నారు. అసలిప్పుడు పాలకొల్లులో బత్తాయి చెట్లు ఉన్నాయా? లేదా? అని ఆలోచించే అవకాశం ఇక్కడ ఉండదు. అలాగే "వడ్లపూడి నారింజ" అంటాము. ఒకనాడు వడ్లపూడి నారింజ పండ్లకు ప్రసిద్ధి కావచ్చు. ఆ పేరుతో నేడు కొందరు నారింజ పండ్లు అమ్ముకొంటారు. ఇప్పుడు వడ్లపూడిలో నారింజలు ఉన్నదీ లేనిదీ ఇక్కడ ప్రధానం కాదు. అంటే మంచి చెట్ల పేరు చెప్పి, పండ్లమ్ముకోవడమన్నమాట.

బైబులు సామెతలో మంచి చెట్టు చెడు పండ్లు కాయదని, చెడ్డ చెట్టు మంచి పండ్లునీయదని ఉన్నది. చెట్టు తన పండ్ల వల్ల ప్రసిద్ధమవుతుంది. బ్రహ్మ జెముడు

పొదలో మధుర ఫలాలు పండవు. కోరింత పొదలకు ద్రాక్షపండ్లు కాయవు. యేసు చెప్పిన ఈ సామెత కేవలం చెట్లకు సంబంధించింది మాత్రమే కాదు. అది మంచి వ్యక్తులకు, వారి హృదయాలకు సంబంధించింది. అందుకే ఇంకా కొంచెము ముందుకు వెళితే, ఇక్కడ మంచి చెట్టు సజ్జనుడితోను, చెడ్డ చెట్టు దుర్జనుడితోను పోల్చబడ్డాయి అని గ్రహిస్తాము.

చెట్టు బైబులులో పలుమారులు మనిషికి ఉపమానంగా కనిపిస్తుంది. నిష్ప్రయోజనమైన చెట్లు ఎలా నరికివేయబడి వంట చెఱకుగా వాడబడతాయో, పనికిమాలిన మనుష్యులు కూడా అలాగే పారవేయబడతారు.

ఇక తెలుగు సామెతలో 'కడుపు' అంటే "హృదయం" అనే అర్థం గ్రహించాలి. హృదయంలో ఏ విధంగా ఆలోచిస్తే, మన క్రియలు ఆ విధంగా అంటే కడుపులో ఉన్నదానిని బట్టి బహిర్గతమవుతాయి. "సజ్జనుడు తన హృదయమను మంచి ధననిధిలోనుండి సద్విషయములను బయటికి తెచ్చును, దుర్జనుడు చెడ్డ ధన నిధిలో నుండి దుర్విషయములను బయటికి తెచ్చును. హృదయములో ఉన్నదానిని బట్టి ఒకని నోరు మాటలాడును అంటుంది బైబులు (లూకా 6:45). అంటే హృదయాలోచనలు ఎట్లా ఉంటే మాటలు చేతలు తదనుగుణంగా ఉంటాయని భావించవచ్చు. అందుకే "కడుపులో లేనిది కౌగలించుకుంటే వస్తుందా?" అని మరొక తెలుగు సామెత పై దానికి సమానార్థకంగా వాడబడుతున్నది. పైకి ఎంత ప్రేమ ఉన్నట్టు మాట్లాడినా హృదయంలో మమతానురాగాలు లేకపోతే, అవన్నీ ఉత్తుత్తి మాటలనీ, నీటిమీది వ్రాతలనీ తెలుసుకోవాలి. దేనికైనా హృదయమే మూలం. దానిని బట్టే మన క్రియలుంటాయి.

హృదయంలో మంచి ఉంటే అది క్రియారూపంలో బహిర్గతమై అందరి మెప్పు పొందుతుంది. పనికిమాలిన చెట్టు మంచి ఫలములు ఫలించనట్టే, పెదవులతో పైపై మాటలు పలికితే వాటి వల్ల ప్రయోజనం శూన్యం. 'విత్తును బట్టి చెట్టు' అనే మరొక తెలుగు సామెత కూడా ఈ భావాలకు బీజం వంటిది. 'విత్తొకటి వేస్తే చెట్టు ఇంకొకటి మొలవదు కదా!' దీని కొనసాగింపే మంచి చెట్టు చెడ్డ పండ్లను, చెడు చెట్టు మంచి పండ్లను ఈయవు అన్న బైబులు సామెత.

## 14

తెలుగు సామెత : కని, కల్ల నిజము తెలిసిన మనుజుడెపో నీతిపరుడు

బైబులు సామెత : జ్ఞానము లేనివాడు ప్రతిమాట నమ్మును; వివేకియైనవాడు తన నడతలను బాగుగా కనిపెట్టును (సామెతలు 14:5)

ఎవరు చెప్పినా వినాలి. ఆవేశం విడిచిపెట్టాలి. బాగా సావధానంగా ఆలోచించి, నిజానిజాలను తెలుసుకోవాలి. అటువంటివాణ్ణే నీతిపరుడు అంటారు. కొందరు ఒక మాట తనకు ఇష్టం లేదని చెప్పగానే చిర్రుబుర్రులాడతారు. వివేకాన్ని కోల్పోయి, ఆవేశంతో అరుస్తారు. అందుకే తిక్కన సోమయాజి మహాభారతంలోని ఉద్యోగపర్వం – తృతీయా శ్వాసం 107వ పద్యంలో ద్రౌపది చేత శ్రీకృష్ణునితో "వీఱిడియైన మానిసికి వెండి వివేకము కల్గనేర్చునే" అనిపిస్తాడు. కోపంతో విసిగివేసారిన వాడికి వివేకం ఉండదు. కనుక వినేటప్పుడు, మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. జ్ఞానం ఉండవచ్చు. అది వివేకంతో కూడినప్పుడు బాగా రాణిస్తుంది. వివేకం లేనివాడు ఎండిపోయిన మోడుతో సమానుడు. సమస్తాన్నీ జాగ్రత్తగా పరిశీలించి మంచిని అనుసరించుటయే నీతి.

జ్ఞానం లేనివాడు ప్రతిమాటా నమ్ముతాడు. అందరినీ నమ్మీ నమ్మీ మోసపోయి అధోగతిపాలవుతాడు. నమ్మకం ఉండవలసిందే. అయితే ప్రతి మోసగాణ్ణీ నమ్మి పాడైపోవడం జ్ఞానుల లక్షణం కాదు. వివేకి ప్రతిదాన్నీ పరిశీలించి, తనకు తాను పరీక్షించుకొని జాగరూకతతో జీవిస్తూ ఉంటాడు. నిజానికి అతడే నీతిపరుడు.

జ్ఞానం అంటే అన్నిటిని గూర్చి తెలిసి ఉండడం. వివేకం అంటే ఏది ఎప్పుడు చేయాలో, ఎలా చేయాలో తెలిసి ఉండడం. జ్ఞాన వివేకాలు తోడైనవాడు సదాకాలం నిలుస్తాడు. "జ్ఞానము వలన ఇల్లు కట్టబడును, వివేకము వలన అది స్థిరపరచబడును" (సామెతలు 24:2). ఏది సత్యం, ఏదసత్యం అనే ధర్మసూక్ష్మాలు గ్రహించడానికి వివేకం కావాలి. ఆ మాటకొస్తే విషయాన్ని సూక్ష్మంగా పరిశీలించి దాని ఆనుపానులు కనిపెట్టి ఒక నిర్ణయానికి వచ్చేవాడే నీతిపరుడుగా, సజ్జనుడుగా పరిగణింపబడతాడు. రాజులకు, అధికారులకు, కుటుంబంలో బాధ్యత కలిగిన పెద్దలకు ఈ వివేచనా దృష్టి అవసరం. బైబులు, తెలుగు సామెతలు ఈ నిశిత దృష్టిని ప్రస్తుతిస్తున్నాయి.

## 15

తెలుగు సామెత : కలలో జరిగింది ఇలలో జరగదు

బైబులు సామెత : స్వప్నములను నమ్ముట నీడను పట్టుకొనుట వంటిది, గాలిని తరుముట వంటిది (సీరా 34:2)

కలలు కల్లలే గాని నిజాలు కావనేది సత్యం. కలలో గాలిలో తేలిపోతాము. నీళ్ళ మీద నడుస్తాము. ఏవేవో అనూహ్యమైన, అసాధ్యమైన కార్యాలు చేసినట్టు కలలు గంటాము. తెల్లవారి లేచేసరికి అన్నిటినీ మరిచిపోతాము. ఎందుకంటే అది కల గనుక. కొందరు కలలో కొన్ని కొన్ని వస్తువులు కనిపిస్తే శుభం కలుగుతుందని, మరికొన్ని వస్తువులు చూస్తే అశుభం కలుగుతుందని భావిస్తారు. తెల్లవారుజామున వచ్చిన కలలు నిజమౌతాయని, మధ్యరాత్రిలో వచ్చిన కలలు కల్లలవుతాయని ఈ కలలను గురించి లోకులు రకరకాలుగా చెప్పుకుంటారు. కలలో జరిగింది ఇలలో జరగదని ఈ తెలుగు సామెత తెలియజేస్తుంది. హేతువాదులు, బాగా చదువరులు కూడా ఇదే విషయాన్ని నమ్ముతారు. కొందరు మూఢ విశ్వాసులు, ఛాందసవాదులు తప్ప కలలు నిజంగా నెరవేరుతాయని ఎవరూ నమ్మరు. ఇదే విషయాన్ని ఈ తెలుగు సామెత చాటి చెబుతున్నది.

బైబులు సామెత కూడా ఇదే అర్థాన్ని అందిస్తుంది. స్వప్నములు జరుగుతాయని నమ్మరాదని తెలియజేస్తుంది. అలా నమ్మడం నీడను పట్టుకోవడం లాంటిదని, గాలిని తరిమి పట్టుకోవడం లాంటిదని వివరిస్తుంది. గాలిని ఎవరూ పట్టుకొనలేరు కదా, అది అసాధ్యం! కలలు నిజం కావడం కూడా అసాధ్యం. అలా భావించడం హాస్యాస్పదం.

కొందరు కలలను నమ్మి జీవితాలను పాడుచేసుకుంటారు. జీవితం కల కాదు. ఊహాతీతమైనదీ కాదు. మనం శ్రమించి, అనుభవించవలసింది జీవితం. కలలో బాగా డబ్బు సంపాదించినట్లు, లాటరీ వచ్చి, లక్షాధికారి అయినట్లు కలగంటాము. తెల్లవారి అది నిజమౌతుందని లాటరీ టిక్కెట్లు కొని, సునాయాసంగా ధనం వచ్చిపడుతుందని ఉవ్విళ్లూరుతూ ఉంటాము. ఇదంతా కల్లయని, కలలు ఇలలో నిజంగా నిజ జీవితాలలో జరుగవని ఈ రెండు సామెతలు వివరిస్తున్నాయి.

## 16

తెలుగు సామెత : కలిసి ఉంటే కలదు సుఖము

బైబులు సామెత : ముప్పేటలు పన్నిన త్రాడు త్వరగా తెగదు (ఉపదేశకుడు 4:12)

ఐదు వేళ్ళు కలిస్తేనే గుప్పిటికి బలం. కలిసి మెలసి ఉన్న కాపురం భూలోక స్వర్గమే. ఈ సార్వత్రిక సత్యాన్ని పై రెండు సామెతలు సరళమైన రీతిలో తేటతెల్లం చేస్తున్నాయి.

తెలుగువాళ్ళు ఎక్కడన్నా ముగ్గురు ఉంటే అక్కడ నాలుగు వర్గాలుంటాయంటారు. అందాకా ఎందుకు? నిమ్న కులాలనిపించుకొనే తెలుగు మాల మాదిగలకు సయోధ్య లేదు. జాషువా గారు తన 'ఇంటిగుట్టు' ఖండికలో ఈ శోచనీయమైన స్థితిని ఇలా చిత్రీకరించారు:

'దేవుడొకడు దేవళంబులు రెండు
దేశమొకటి మాకు తెగలు రెండు
మాట వరుసకొక్క మతమందుమె గాని
కుల సమస్య వద్ద కుమ్ముదమ్ము'

పంచతంత్రంలో నాలుగు గోవులు ఏకమై పులిని ఎదిరించిన కథనం చదువుతుంటే పశువులకున్న ఇంగితం మనిషికి లేదనిపిస్తుంది. 'మిడుతలకు రాజు లేదు అయినను అవన్నియు పంక్తులు తీరి సాగిపోవును' (సామెతలు 30:27) అని జంతుజాలంలో కనిపించి కన్నుల పండుగ చేసే ఐకమత్యాన్ని పరిశుద్ధ గ్రంథం చూపుతున్నది.

సంఘటితంగా మానవుడు సాధించలేనిది లేదు. అనైక్యత అజ్ఞుల లక్షణం, అనర్థదాయకం. గడ్డి పరకలను సైతం త్రాడుగా పేనితే మత్తేభాన్ని కూడా బంధించవచ్చునంటున్నాడు వేమన:

'ఐకమత్య మొక్క టావశ్యకం బెప్డు
దాని బలిమి నెంతయైన గూడు
గట్టివెంట బెట్ట కట్టదా యేనుంగు'

బైబులు సామెత ఐకమత్య ఔన్నత్యాన్ని దైనందిన జీవితంలో వాడుకలో ఉన్న సామ్యం చెప్పడం ద్వారా వివరిస్తున్నది. తాడును తెంచాలంటే పురిని వదులు చేసి

నారపోగులు ఒక్కొక్కటే వేరుచేసి పని జరిగించుకుంటాము. మూడు పేటల తాడును దండిగా పురి ఎక్కించాక తెంచడం దుర్లభం. కుటుంబాలు, సమాజాలు, జాతి ఒక్క త్రాటిపై నిలిస్తే ఆ చెలిమి బలిమి వేరు. ఈ సూత్రాన్ని అనుసరించే ఇన్ని సంఘాలు, యూనియన్లు. ఉద్యమించడానికైనా, ఉల్లసించడానికైనా నలుగురూ చేతులు కలిపితే ఆ దారే వేరు. ఇద్దరు కలిసి ప్రయాణిస్తే క్షేమం. ఎందుకంటే ఒకడు పడిపోతే ఒకడు చేయూతనిస్తాడు. చలిలో ఇద్దరు కలిసి పడుకుంటే వెచ్చదనం పుడుతుంది (ఉపదేశకుడు 4:9–10) అని ఐకమత్యంలోని బలాన్ని పవిత్ర గ్రంథం నొక్కి చెబుతున్నది.

ప్రపంచీకరణం ప్రపంచాన్ని ముంచెత్తుతున్న ఈ తరుణంలో మన దేశంలో కుటుంబ వ్యవస్థను ఇంతవరకు పటిష్టంగా ఉంచిన ఉమ్మడి కుటుంబం మెల్లమెల్లగా అంతరిస్తున్నది. నాటికీ, నేటికీ కలిసి ఉంటేనే కలదు సుఖమన్న నానుడి ఆచరణీయమే.

## 17

తెలుగు సామెత : కుండ వెళ్ళి బిందెకు తగిలినా, బిందె వచ్చి కుండకు తగిలినా, కుండకే మోసం

బైబులు సామెత : మట్టి కుండ, లోహపాత్ర దేనితో ఏది ఒరసికొన్నా కుండయే పగులును (సీరా 13:2)

పై సామెతలను పోలిన వేరొక సామెత, ‘ముల్లు వెళ్ళి అరిటాకుపై పడినా, అరిటాకు వెళ్ళి ముల్లుమీద పడినా అరిటాకుకే నష్టం.’ ఒకే భావం వేరువేరు సూక్తులుగా వేరువేరు పరగణాల్లో చెలామణీ అవుతుంటుంది. కోస్తా ప్రాంతంలో అరిటాకు ముల్లు సామెతను తరచుగా ఆడపిల్లలను హెచ్చరిస్తూ ఉదహరిస్తుంటారు. కన్యలు యవ్వన మధురోహలలో ఉక్కిరిబిక్కిరవుతూ యువకుల చెలిమి కోరుతారు. చెట్టపట్టాలు వేసుకొని తిరుగుతారు. జరగరానిది జరిగితే యువకునికి పోయేదేమీ ఉండదు. యువతి జీవితం పాడైపోతుంది. ఇలాటి భంగపాటు జరగడానికి కారణం యువతి వెళ్ళి యువకునితో సాంగత్యం కోరి యుండవచ్చు. యువకుడే వెంటపడి ఆమె హృదయం దోచుకుని ఉండవచ్చు. ఎలా జరిగినా ఫలితం మాత్రం ఒక్కటే. బైబులు, తెలుగు సామెతలు రెండూ ఈ భావాన్నే బహిర్గతం చేస్తున్నాయి.

పేదవాని కోపము పెదవికి చేటు అన్నారు. రాజుకు పేదవానిపై కోపమొచ్చినా, పేదకు రాజుపై కోపమొచ్చినా కీడు పేదకే. రాజ్య బహిష్కరణ జరిగేది పేదకే. రాజుకు కాదు. బ్రాహ్మణ స్త్రీలు మడిగట్టుకుంటారు. మడిగట్టుకున్న ఆమె తూలి వేరొక మనిషిని ముట్టినా, వేరొక మనిషి పొరపాటున ఆమెకు తగిలినా మైలపడేది మడిగట్టుకున్న స్త్రీయే.

ఈ సామెతల్లో మనకు బోధపడే అంశం ఇది. లోకంలో బలవంతులు, నిరంకుశులు ఉంటారు. లేగదూడల వంటి అమాయకులు, సామాన్యులు కూడా ఉంటారు. ఎవరి పరిధిలో వారు చరిస్తున్నంత కాలం బ్రతుకులు వెళ్ళిపోతుంటాయి. విధి వశాన వారొకరికొకరు తారసపడితే, ఘర్షణ సంభవిస్తే నష్టం జరిగేది లేగదూడలకే. నేరం ఎవరిదైనా శిక్ష మాత్రం సగటు మనిషే అనుభవించవలసి ఉంటుంది. ఇది అనివార్యం.

లోహంతో చేసిన పాత్ర బిందె. వాటి సరసనే మట్టి కుండలూ ఉంటాయి. మట్టికుండే ఒదిగి ఉండాలి కాని బిందెలతో సమానంగా వాటి సరసన చేరరాదు. తాను సున్నితం గనక ఒకింత జాగ్రత్తగా మెలగాలి. అలానే ఎంత చిన్న అవాంతరానికైనా తల్లిడిల్లిపోయే సున్నిత మనస్కులు కొంత వివేచన గలిగి ఒదిగి ఉండడమే శ్రేయస్కరం. బరితెగించినవారు దేనికైనా సిద్ధమే. ఏది జరిగినా వారికి పోయేదేమీ లేదు. గుట్టుగా బ్రతికేవారికి జరగకూడనిదేమైనా జరిగితే ఊరు ఊరంతా విడ్డూరంగా  చెప్పుకుంటారు.

## 18

తెలుగు సామెత :  కూరిమిలో నేరాలుండవు విరసంలో సరసాలుండవు

బైబులు సామెత :  పగ కలహమును రేపును, ప్రేమ దోషములన్నిటినీ కప్పును (సామెతలు 10:12)

ప్రేమతో విషాన్నైనా తినిపించవచ్చు గాని పగతో పాయసాన్ని కూడా తినిపించ లేము అని మరొక సామెత మనమెరిగినదే. సరిగ్గా అదే అర్థాన్ని పై తెలుగు సామెత

మనకు బోధిస్తుంది. కూరిమి ఉన్నన్నాళ్ళూ ఒకరి పట్ల ఒకరు ఓర్పు, శాంతి, సహనాలతో జీవిస్తారు. ఆ ప్రేమ విరసమైతే, పగగా మారితే ఇక మంచి మాటలు గానీ, పరస్పరావగాహన గానీ లేకుండా ఒకరి నేరాలు మరొకరు ఎంచుకుంటూ పతనావస్థకు చేరుతారు. దీనికి కారణం ప్రేమ రాహిత్యమని తెలుస్తూనే ఉంది. కనుక తోటివారి పట్ల ప్రేమజూపిస్తే ఆవేశకావేశాలు నశించి, శాంతి సౌభ్రాత్రాలు వెల్లివిరుస్తాయి.

కాగా పగ కలహాలను రేపుతుందని, ప్రేమ దోషాలను కప్పుతుందని సామెతల గ్రంథం ఉద్బోధిస్తున్నది. పల్నాటి యుద్ధగాథ దాయాదుల పోరు. చిరకాలం అన్యోన్యంగా జీవించిన అన్నదమ్ముల్లో ఆవేశం, అభిప్రాయ భేదాలు తలెత్తగానే, ప్రతి చిన్న పరిహాస వచనం కూడా కుత్తుకలు తెగగోసుకునేదాకా తీసుకుపోయింది. ప్రేమలున్నప్పుడు బావామరుదుల సరస సల్లాపాలు ఆహ్లాదకరంగా ఉంటాయి. ఒకసారంటూ చెడితే హితవాక్యం కూడా బూతు మాటలాగా ధ్వనిస్తుంది. సాటి మనిషి పట్ల ప్రేమ ఉంటే, ఆ మనిషి మనకు ద్రోహం చేసినా ఏదో ఒకటి సమర్థించుకొని దులుపుకుని పోతాము. వర్షాకాలంలో నదులు పొంగి అపార జలధార సాగరంలో కలిసిపోతుంది. ఎండాకాలం గొంతెండిపోయే వేళ ఒక్క చుక్క కూడా దొరకదు. ఇది ప్రకృతి ధర్మం.

## 19

తెలుగు సామెత : కొత్త గుడ్డకు రంగు పట్టినట్టు పాత గుడ్డకు పట్టదు

బైబులు సామెత : పాత గుడ్డకు క్రొత్త గుడ్డతో మాసిక వేయలేము (మత్తయి 9:16)

'పాత' అనగానే కొంత శక్తిహీనమైనదని మనకు బోధపడుతుంది. వయస్సులో ఉన్నపుడు వంకలుండవని చెబుతారు. వయస్సు పోయిన తరువాత అన్ని రంగాలలోను వెనుకబాటుతనం వస్తుంది. ప్రతి రంగంలోనూ క్రొత్తకు ప్రాధాన్యమిస్తాము. క్రొత్తదాన్ని ఏ విధంగానైనా మలుచుకోవచ్చు. క్రొత్తదానికున్న అందచందాలు, నిసర్గ తేజాలు పాత దానికి ఉండవు. నూతనత్వానికున్న సొంపు పాతదానికి ఉండదు. క్రొత్త గుడ్డకు రంగు వేసినా, దానితో మరొకటి చేసినా బాగానే ఉంటుంది. కాని పాత గుడ్డకు రంగు పట్టదు. దాంతో ఇంకే వస్తువునూ చేయనూ లేము. ఇటువంటి సందర్భాలు వివరించడానికి ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

బైబులు సామెత కూడా దీనికి సమానార్థకమే. పాత గుడ్డకు పాత గుడ్డనే మాసిక వేయాలి, క్రొత్త గుడ్డకు క్రొత్త గుడ్డనే మాసిక వేయాలి. అలా కాకుండ క్రొత్తకు పాతది, పాతదానికి క్రొత్తది మాసిక వేసినట్లయితే అది నిలువదు.

భావ సామీప్యం కావాలనేది ఈ సామెతలలోని సారాంశం. క్రొత్త భావాలు గలవారు అలాంటివారితోనే కలుస్తారు. పాత భావాలు గలవారు అటువంటివారితోనే కలుస్తారు. కాబట్టి క్రొత్త క్రొత్తతోనే కలుస్తుంది. పాతది పాతదానితోనే జతగూడుతుంది. ఈ భావాలను బైబులు, తెలుగు సామెతలు రెండూ సమానంగా బోధిస్తున్నాయి.

## 20

తెలుగు సామెత : కోటి విద్యలు కూటి కొరకే

బైబులు సామెత : నరుని కృషి అంతయు పొట్టకూటికే (ఉపదేశకుడు 6:7)

దొమ్మరివాడు గడనెక్కి విన్యాసాలు చేస్తాడు. జోదు కత్తిసాములో చతురుడై స్వామికార్యం నిర్వర్తిస్తాడు. శ్రేష్ఠి వస్తుసముదాయాల విలువనెరిగి వాణిజ్య వృత్తి నెరపుతాడు. గాయకుడు సంగీత స్వరాంబుధిలో శ్రోతలను స్నానమాడిస్తాడు. వృత్తులు వేయి రకాలైనా అన్నిటి పరమార్థం విత్తం ఆర్జించడమే. విత్తమెందుకంటే ఉదర పోషణకే. ఈ సార్వజనీన సత్యాన్ని బహుళ ప్రచారంలో ఉన్న తెలుగు సామెత, దానికి సరిజోడుగా ఉన్న బైబులు సామెత తేటతెల్లం చేస్తున్నాయి.

లక్షాధికారియైనా లవణమన్నమె గాని మెరుగు బంగారంబు మ్రింగలేడు. వస్తు వాహనాలు సిరిసంపదలెన్ని ఉన్నా కడుపుకు కావలసినది ఇంత ముద్ద. ధనికుడైతే జిహ్వాకింపైన షడ్రుచులతో మృష్టాన్నాలు ఆరగిస్తాడు. దరిద్రుడు జొన్నరొట్టెతో అంబలితో కడుపు నింపుకుంటాడు. ఎలాటివారైనా వారి ప్రయాస అంతా జానెడు పొట్ట కోసమే.

ఈ సామెతలలో శ్రమైక జీవన సౌందర్యం కూడా వేరొకవైపు ఆవిష్కారమవుతున్నది. కమ్మరి, కుమ్మరి, మేదరి, రైతు ఇలా ఎవరైనా సరే తమ శక్తిమేర శ్రమిస్తూ ఉదర పోషణ గావించుకొనడం ఉత్తమ మార్గం.

జాషువా గారు ఇటువంటి పరిపూర్ణ జీవన శైలిని ఈ పద్యంలో హృద్యంగా వర్ణించారు –

నివసించుటకు చిన్న నిలయమొక్కటి దక్క
గడనసేయుట కాస పడను నేను
ఆలుబిడ్డలకునై యాస్తిపాస్తులు గూర్ప
పెడత్రోవలో పాదమిడను నేను
నేనాచరింపని నీతులు బోధించి
రాని రాగము తీయలేను నేను
సంసారయాత్రకు చాలినంతకు మించి
గ్రుడ్డి గవ్వయు గోరుకొనను నేను

మానవ నైపుణ్యం శ్రమ పొట్టకూటి నిమిత్తమేనని ప్రత్యక్షంగా వచిస్తున్న ఈ సామెతలు అంతకుమించి ఆత్యాశలకు పోయి ఈతిబాధలలో చిక్కుకొనవలదని ప్రబోధిస్తున్నాయి.

## 21

తెలుగు సామెత : గాడిద కడుపున గుర్రం పుడుతుందా?

బైబులు సామెత : ఉప్పు నీటిబుగ్గ నుండి మంచినీరు ఊరదు (యాకోబు 3:12)

ముళ్ల పొదల నుండి ద్రాక్షలు లభింపవు (లూకా 6:44)

ఉత్తమ గుణాలు నీచునికి కలుగవు! హీన కుల సంజాతుడు, ఉన్నత కుల సంభవునితో సమానుడు కాడు! గుఱ్ఱాన్ని, గాడిదను ఒకే గాట కట్టివేయకూడదు. ఎంత ప్రయత్నించినా హీన మానవుని నుండి ఉత్తముడు ఉత్పత్తి కాడు. ఇటువంటి విషయాలను వివరించడానికి ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

ఒక జాతి లక్షణాలు పోవడం అంత సులభమైనది కాదు. పంది కడుపు నుండి నంది పుట్టడం సాధ్యం కాదు కదా. పంది లక్షణాలు వేరు, నంది లక్షణాలు వేరు. ఏ జాతి కూడా తన లక్షణాలు విడిచి మరొక జాతి లక్షణాలతో పరిణామం చెందలేదు. ఇటువంటి సన్నివేశాలను నిరూపించడానికే 'గాడిద కడుపున గుఱ్ఱం పుడుతుందా" అనే ఈ తెలుగు సామెతనుపయోగిస్తారు.

బైబులు సామెతలలో ఉన్న భావం కూడా ఇదే. 'ఉప్పు నీటిబుగ్గ/జల నుండి మంచినీరు ఊరదు.' ముళ్ల పొదల నుండి ద్రాక్షలు లభింపవు. ఏ జాతి వృక్షం ఆ జాతి ఫలాలనే కాస్తుంది. ఉప్పు నీటి జల నుండి మంచినీరు ఊరదు.

'ఏ గూటి చిలుక ఆ గూటి పలుకే పలుకుతుంది' అనే సామెత కూడా ఇదే అర్థాన్నిస్తుంది. పిల్లి కుక్కలాగా మొరగదు. కుక్క పిల్లిలాగా అరవదు. ఇవి జాతి లక్షణాలు. ఇటువంటి పరిస్థితులలో ఈ బైబులు, తెలుగు సామెతలు రెండూ సమానార్థకంగా వాడబడతాయి.

## 22

తెలుగు సామెత : చవీ, సారం లేని కూర చట్టినిండ, అందం, చందం లేని మొగుడు మంచం నిండా

బైబులు సామెత : ఉప్పు తన ఉప్పదనం కోల్పోయిన యెడల దాని వలన ప్రయోజన మేమి? (మత్తయి 5:13)

'గంగిగోపు పాలు గరిటెడైనను చాలు, కడివెడైననేమి ఖరము పాలు' అంటాడు వేమన. గంగిగోవు పాలు కొంచెమైనా, మంచి బలాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తాయి. రుచిగా ఉంటాయి. ఖరము పాలు ఎన్నైనా లాభం లేదని భావం. మంచి రుచిగల కూర కొంచెమైనా చాలు. సారం, రుచి లేని కూర చట్టినిండా ఉన్నా ప్రయోజనం లేదు. ఈ సామెతలో రెండు భాగాలున్నాయి. రెండవ భాగంలో మగని గురించి చెప్పారు. 'అందం, చందం లేని మొగుడు మంచం నిండా.' భార్యాభర్తలిద్దరూ బద్ధానురాగులై ఉండాలంటే వారికి బాహ్యమైన శరీర సౌష్టవం, అందచందాలూ, ఒడ్డూపొడుగూ కూడా అవసరమే. ఇదేమీ లేకుండా మగడు మంచం నిండా ఉంటే మాత్రం లాభమేముంది? నలుగురూ మెచ్చుకోవడానికైనా భార్యాభర్తలు మంచి ఈడూ జోడూగా ఉండాలి కదా. కనుక సారవిహీనమైన కూర చట్టి నిండా ఉన్నా, సారహీనుడైన మగడు మంచం నిండా ఉన్నా ప్రయోజనం లేదని ఈ తెలుగు సామెత భావం.

బైబులు సామెతలో ఉప్పును గురించి చెప్పారు. ఉప్పు ఎంత చౌక ధరకు లభిస్తుందో, అంత ప్రాముఖ్యమైనది కూడా. ఎందుకంటే దానిలో ఒక సారం (రుచి) ఉంది. అదే ఉప్పదనం. అది ఉన్నంతసేపు ఉప్పు ప్రయోజనకరమైనది, విలువైనది.

ఆ ఉప్పదనాన్ని కోల్పోయినట్లయితే అది ఇంక దేనికీ పనికిరాదు. కాబట్టి సారంలేని కూర, అందం చందం లేని భర్త, సారవిహీనమైన ఉప్పు నిష్ప్రయోజనాలని తేలింది.

మానవులలో నైతిక విలువలకు సంబంధించిన వెలుగు ఉండాలి. అది ప్రతివారిని ఆకర్షించి, వెలిగిస్తూ ఉండాలి. అది లేని మానవుడు జీవన్మృతుడు. అంటే సారంలేని ఉప్పు, రుచిలేని కూరల్లాటివాడు.

'నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు, తళుకు బెళుకురాళ్ళు తట్టెడేల?' అంటాడు ప్రజాకవి వేమన. ఒక రత్నం ఉంటే చాలు, గులకరాళ్ళు తట్టెడున్నా దాని వల్ల ఏ విలువా ఉండదు. కాగా మానవులు రుచిగల కూరవలె, అందగాడైన భర్తవలె, సారవంతమైన ఉప్పు వలె ఉండి బ్రతుకును కళాత్మకంగా మలుచుకోవాలని ఈ తెలుగు, బైబులు సామెతలు ప్రబోధిస్తున్నాయి.

## 23

తెలుగు సామెత : చిక్కుడు తీగెకు బీరకాయ కాస్తుందా? జిల్లేళ్లకు మల్లెలు పూస్తాయా?

బైబులు సామెత : ద్రాక్ష తీగెకు అంజూరములు కాయునా? (యాకోబు 3:12)

ఇది ప్రకృతి విరుద్ధమైన భావం, గుణం ఉండబోదని తెలియజేసే సామెత. 'ఏ గూటి చిలుక ఆ గూటి పలుకే పలుకుతుంది' అనేది దీనికి సమానార్థకమైన మరో తెలుగు సామెత. చిక్కుడు తీగెకు చిక్కుడు కాయలు, బీరతీగెకు బీరకాయలే కాస్తాయి. చిక్కుడు తీగెకు బీరకాయలు కాని, బీరచెట్టుకు చిక్కుడు కాయలు గానీ కాయవు. అలాగే జిల్లేడు చెట్లకు మల్లెపూలు పూయవు. కొద్దిగా స్వరూప సామీప్యత ఉన్నంతమాత్రాన మల్లె జిల్లేడు పువ్వు కాదు. జిల్లేడు పువ్వు మల్లె కాదు, ఇత్తడి పుత్తడి కాదు, పుత్తడి ఇత్తడీ కాదు. దేని గుణాలు దానివే, దేని లక్షణాలు దానివే.

ఇక్కడ చెట్లను గురించి, పువ్వులను గురించి చెప్పినా అదంతా మానవులకే అన్వయించుకోవాలి. ఉపమానాలు ఎన్ని చెప్పినా అంతర్లీనంగా ఉన్న ఉపమేయం మాత్రం మానవుడే. నక్క వాతలు పెట్టుకున్నంతమాత్రాన పులి కాలేదు కదా, అలాగే ఎన్ని వేషాలు వేసినా ఎవరి సహజ గుణాలు వారికే ఉంటాయి గాని ఇతరులకు సంప్రాప్తించవని ఈ సామెతల అర్థాలు.

బైబులు సామెతలో కూడా ఇదే అర్థం ఉంది. ద్రాక్ష తీగెకు అంజూరపు పండ్లు కాయవని చెప్పబడింది. ఉప్పు నీటి ఊట నుండి మంచినీళ్ళు, మంచి నీళ్ళ ఊట నుండి ఉప్పు నీళ్ళు ఊరవని స్పష్టం చెయ్యబడింది. సూక్ష్మంగా పరిశీలిస్తే ప్రకృతిలో సహజత్వం లోపించలేదు గాని, మానవుడే సహజ గుణాలను, అనగా మానవత్వాన్ని విడిచిపెట్టి దానవత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రకృతికి వికృత రూపమును కల్పిస్తున్నాడని భావించాలి. కాగా మానవీయ మూల్యాలను పునరుద్ధరించడమే ఈ రెండు సామెతల భావంగా భావించవచ్చు.

## 24

తెలుగు సామెత : చెఱకు తుద వెన్ను పుట్టిన చెఱకున తీపెల్ల చెరచు

బైబులు సామెత : బుద్ధిహీనుడగు కుమారుడు తన తండ్రికి దుఃఖము తెచ్చును (సామెతలు 17:25)

కుమారులు దేవుడు అనుగ్రహించే స్వాస్థ్యమని, యౌవనంలో పుట్టిన కుమారులు బలవంతుని చేతిలోని బాణాలవంటివారని బైబులు తెలియజేస్తుంది. ఈ సామెతలో బుద్ధిహీనుడైన కుమారుని గూర్చి చెబుతున్నారు. ఇతడు తన తండ్రికి దుఃఖాన్ని కలిగిస్తాడట. పుట్టగానే ఎవరూ బుద్ధిమంతులు కాలేరు. వారికి విద్యాబుద్ధులు నేర్పించవలసిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉంది. అతి గారాబంచేత బిడ్డలు చెడిపోయే ప్రమాదం ఉంది. అందుకే బెత్తము వాడితే కుమారుడు జ్ఞానవంతుడవుతాడని ఉంది. బుద్ధిజ్ఞానాల వైభవమంతా దేవునిలోనే ఉంది. అందుకే బాల్యంలోనే నీ సృష్టికర్తను జ్ఞాపకం చేసుకోమని బైబులు తెలియజేస్తుంది. కుమారుడు బుద్ధిహీనుడయ్యాడంటే తల్లిదండ్రులు వారి బాధ్యతలు సరిగా నెరవేర్చలేదని అర్థం. అటువంటి తండ్రికి దుఃఖం శిక్షగా లభిస్తుంది. పుత్రుడు జన్మించినపుడే సంతోషించి, వాని ఆలనాపాలనా చూడకుండా, అశ్రద్ధ చేస్తే అతడు బుద్ధిహీనుడైతే అతని తండ్రికి దుఃఖం కాక మరేముంటుంది! "జనులాపుత్రుని కనుగొని పొగడగ, పుత్రోత్సాహంబు నాడు తండ్రి పొందుర సుమతీ" అని నీతి బోధ. కాబట్టి కుమారుడు జన్మించగానే సరిగాదు, వాడికి విద్యాబుద్ధులు చెప్పించి, ఉత్తమ పౌరునిగా చేయవలసిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఎంతైనా ఉంది. అలా చేయకపోతే ప్రాప్తించేది దుఃఖమే!

కొరగాని కొడుకు పుడితే అతనివరకే కాదు, తండ్రి గుణాలను కూడా అతడు చెడగొడతాడు. ఎలాగంటే చెఱకు గడ పిలకలు పెడితే అనగా చెఱకునకు వెన్ను పుడితే, చెఱకున తీపినంతా చెరిపేస్తుందట. తీపి చెఱకు గడ నిస్సారం కావడానికి దానికి వెన్ను పుట్టటమే కారణం. అలాగే తండ్రి పేరుప్రతిష్ఠలు చెడిపోవడానికి అతనికి పుట్టిన కుమారుడే కారణం. ఇటువంటివాడు ఉన్నా, లేకున్నా ఒక్కటే. తల్లిదండ్రులను గౌరవించలేని వాని దీపం కారుచీకటిలో ఆరిపోతుందని, అటువంటి కుమారుని కన్నులను లోయకాకులు పీకుతాయని బైబులు చెబుతున్నది. నీ తల్లిని, తండ్రిని సన్మానించుమని దైవాజ్ఞ.

> "తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు
> పుట్టనేమీ వాడు గిట్టనేమి?
> పుట్టలోని చెదలు పుట్టదా గిట్టదా
> విశ్వదాభిరామ వినుర వేమ!"

తల్లిదండ్రులను దయగా చూడని కుమారులు పుట్టలో పుట్టి గిట్టుతూ ఉన్న చెదపురుగులతో సమానమంటున్నాడు వేమన. చెద పురుగులకు తొలచి పాడుచేసే గుణమే తప్ప మంచి గుణం ఒకటి కూడా లేదు. చెదలు వినాశకాలే కాని నిర్మాణాత్మకాలు కావు. తల్లిదండ్రుల్ని ప్రేమించని, గౌరవించని పుత్రుడు కూడా వినాశకుడే. బుద్ధిహీనుడైన కుమారునిది ఎంత తప్పో, అతణ్ణి కని, సరిగా పెంచలేని తల్లిదండ్రులది కూడా అంతే తప్పు అని ఈ తెలుగు, బైబులు సామెతలు పరోక్షంగా చెబుతున్నాయి.

## 25

తెలుగు సామెత : డబ్బుకీ ప్రాణానికీ లంకె

బైబులు సామెత : నీ ధనమెక్కడ నుండునో నీ హృదయమక్కడనే యుండును (మత్తయి 6:21)

కాంతా కనకాల పట్ల వ్యామోహం ఎవరికైనా పుట్టి ముంచుతుందనేది జగమెరిగిన సత్యం. ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే పరకాంతా వ్యామోహం శిక్షార్హం. సమాజం దీనిని హర్షించదు తెగనాడుతుంది. ధనాశ అలా కాదు. అవిశ్రాంతంగా శ్రమిస్తూ డబ్బు కూడబెట్టేవాడిని చూచి లోకం హర్షిస్తుంది.

సిరిసంపదలపై గురి పెట్టుకుని మనసు లగ్నంచేసి అదే ధ్యాసగా దానిపై ప్రాణాలు నిలుపుకొనే నైజాన్ని పై రెండు సామెతలు ఆక్షేపిస్తున్నాయి. ఈ రెండు సామెతలు ఏక భావ ప్రతిపాదకాలు. పైసాను పరమాత్మగా ఎంచేవాడి నైజాన్ని దుయ్యబడుతూ వేమన –

'లోభివాని జంప లోకంబులోపల
మందువేరు వలదు, మతమె కలదు
పైకమడుగ నతడు భగ్గున పడి చచ్చు'

అంటున్నాడు. డబ్బుకీ ప్రాణానికీ లంకె అంటే ఇదే. బైబులు సామెత మరింత సూటిగా వ్యక్తిగతంగా ఈ ఆదర్శాన్ని ప్రబోధిస్తుంది. యేసు ప్రభువు చెంతకు ఒకసారి ఒక ధనిక యువకుడు వచ్చి ముక్తి పొందే మార్గమేదని అడిగాడు. 'నీకున్నదంతా పేదలకిచ్చి వచ్చి నన్నునుసరించుమ'ని సెలవిచ్చాడు కరుణామయుడు. ఆ ధనికుడు ముఖం చిన్నబుచ్చుకొని వెళ్ళిపోయాడు. అతని హృదయం దైవ సాయుజ్యంపై లేదు. ధన దేవత మీదనే లగ్నమై ఉంది. ప్రభువు తన పర్వత ప్రసంగంలో ధనాన్ని గురించి విజ్ఞుల మనోదృక్పథమెలా ఉండాలో కూలంకషంగా ఉపదేశించాడు. ఇక్కడ ధనసముపార్జన చేస్తే కొంత కాలానికి దాని విలువ తరగవచ్చు. దొంగలెత్తుకొని పోవచ్చు. మానవ హృదయంలో ఆముష్మిక చింత ఉంటే ధనాశ ఉండదు.

డబ్బుకు కాపలా కాస్తూ దోపిడి దొంగల నుండి ధనాన్ని రక్షించుకోబోయి ప్రాణం కోల్పోతారు కొందరు. డబ్బు పోతే మళ్ళీ సంపాదించుకోవచ్చు. ఈ సత్యాలను నేర్పించిన పై రెండు సామెతలకు ఫలశ్రుతిగా వేమన ఇలా ప్రబోధిస్తున్నాడు:

ధనము కూడబెట్టి ధర్మంబు చేయక
యూరకుంద్రు పాపు లూహలేక
ధనము వెంటరాదు ధర్మంబు సేయుడీ.'

## 26

తెలుగు సామెత : తన కోపమే తన శత్రువు

బైబులు సామెత : మహా కోపియగువాడు దండన తప్పించుకొనడు
(సామెతలు 9:19)

సాధారణంగా శత్రువుల నుంచి అపాయం వస్తుందని మానవులు భయపడతారు. అపాయాన్ని ఏ విధంగా తప్పించుకోవాలా అని ప్రయత్నం చేస్తూ ఉంటారు. తనకు తానే శత్రువు అని తెలిస్తే మాత్రం ప్రతివారూ ఆశ్చర్యపడతారు. 'తన కోపమే తన శత్రువు' అంటే కోపం మనకు శత్రువువలె అపాయం తెస్తుందని భావించవచ్చు. "తన కోపమే తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష, దయ చుట్టంబౌ" అని సుమతీ శతకకర్త వివరణ. కోపం శత్రువైతే శాంతం రక్షగా, దయ చుట్టంగా ఉంటాయని విశ్లేషణ. శాంతి, దయ మనకు నిజంగా సుఖ సంతోషాల నిస్తాయి. దయను, సత్యాన్ని విడిచిపెట్టవద్దని, వాటిని కంఠహారాలుగా ధరించుకుంటే మానవులు దేవుని దయకు పాత్రులౌతారని సామెతలు తెలియజేస్తున్నాయి. కోపం వల్ల శత్రువులు, వారివల్ల కష్టాలు, వాటివల్ల కన్నీళ్ళూ తప్ప సుఖం లేదు. ఆరోగ్య రీత్యా కూడ కోపం అనర్థదాయకం. దీనివల్ల అనేక శారీరక రుగ్మతలు, దీర్ఘరోగాలూ ప్రాప్తిస్తాయి!

సామెతలు 15:1 లో "మృదువైన మాట క్రోధమును చల్లార్చును. నొప్పించు మాట కోపమును రేపును" అని ఉంది. మృదువుగా, సున్నితంగా మాట్లాడడం వల్ల కోపం మటుమాయమౌతుంది. హృదయంలో పన్నీటి జల్లు కురిసినట్లౌతుంది. కాబట్టి కోపాన్ని విసర్జించి, శత్రుభయం లేకుండా జీవించాలి. కోపించినవాడు దండనార్హుడు. ఎన్ని ఉపదేశాలు చేసినా అతడు మరలా కోపిస్తూనే ఉంటాడు.

కోపం వల్లనే తగవులు, మనస్పర్థలు చెరసాలలు మానవ జీవితాలలో చీకట్లను విరజిమ్ముతున్నాయి. సర్వానర్థాలకు కోపమే కారణమని అందరూ అంగీకరిస్తారు. అందుకే తన కోపమే తన శత్రువు అనే సామెత ప్రాచుర్యం పొందింది.

## 27

తెలుగు సామెత : తన శాంతమె తనకు రక్ష

బైబులు సామెత : శాంతము వలన ఆయురారోగ్యములు కలుగును (సామెతలు 14:30)

కోపమే శత్రువు; సంతోషమే స్వర్గం; దుఃఖమే నరకమని చెబుతూ సుమతీ శతకకారుడు ఒక వ్యక్తికి అతని శాంతమే రక్ష, దయ, అదియే అతని చుట్టమని సూత్రీకరించాడు. శాంతము లేక సౌఖ్యము లేదు అన్నాడు త్యాగరాయుడు. శాంతం ఆరోగ్యకారిణియని బైబులు సెలవిస్తున్నది.

శాంతమనగా నిశ్చలము, నిర్వికారము; కామాది వికారాల క్షోభలేని స్థితి; తృప్తిగా, నెమ్మదిగా, పవిత్రంగా, వినయంగా చరించే గుణం. దీనికి శమం, సుఖం, సౌభాగ్యం ఇంద్రియ నిగ్రహం అనే అర్థ విశేషాలున్నాయి.

నిర్వికార నిరంజనులైన మహాత్ములు పరిస్థితుల ప్రభావాన్ని బట్టి పరితపించరు. భర్తృహరి సుభాషిత రత్నావళి నీతి శతకంలోని సుభాషితం:

'సంపదలు గల్గుతరి మహాజనుల హృదయ
మభినవోత్పల కోమలంబగుచు వెలయు;
నాపదలు వొందునపుడు మహామహీధ
రాశ్మ సంఘాత కర్కశంబై తనర్చు'

సంపదలున్నప్పుడు సుజనుల మనస్సులు కలువల వలె కోమలంగానూ, ఆపత్కాలంలో గండశిలవలె కఠినంగానూ ఉంటాయి. అనగా సంపదలు వచ్చినప్పుడు గర్వించి కఠినులు కారనీ, ఆపదలు వచ్చినప్పుడు వెలవెలబోరనీ భావం. బైబులులో ప్రస్తావించిన పవిత్రాత్మ నవవిధ ఫలాలు: ప్రేమ, సంతోషం, శాంతి, సహనం, దయ, ఉత్తమగుణం, విశ్వాసం, సాత్వికం, ఆశానిగ్రహం (గలతీయులకు 5:22). వీటిలో శాంతానికి సముచిత స్థానముంది.

మానవాత్మలో వేంచేసియున్న ప్రత్యగాత్మయే శాంతి ప్రదాత. భగవన్నామ స్మరణయే శాంతిదాయకం. అలా అబ్బిన శాంతగుణమే ఇహపర సుఖాలకు మూల కారణం. అదే దీర్ఘాయువుకు సమమైన ఆరోగ్యానికీ హేతువు. రక్షకులు లేరనీ, చుట్టాలు లేరనీ దురపిల్లడం అనవసరం. తన శాంతమే తనకు రక్ష పరమౌషధం. అందుకే ఆర్యులు 'ఓం శాంతిశ్శాంతి శ్శాంతిః' అని బ్రహ్మ వాక్యం పలకడం పరమపుణ్యంగా ఎంచుతారు.

## 28

తెలుగు సామెత : తల్లి చేసినది తనయులకు (కార్ 2366)

బైబులు సామెత : తండ్రులు పుల్లని ద్రాక్షపండ్లు భుజింపగా తనయులకు పండ్లు పులుపెక్కెను (యిర్మీయా 31:29)

ఇశ్రాయేలు జాతి వారిది ఉమ్మడి బాధ్యత. అధిక సంఖ్యాకులు అనుసరించిన బాట ప్రకారం ఒనగూడే ఫలితాలను జాతి మొత్తం అనుభవించవలసి వచ్చింది. స్థూలంగా జాతి అంతా తమ దేవుని నియమ నిబంధనలను మీరి భ్రష్టులైపోగా వారికి దాపురించిన శిక్ష వారి భావితరాలపై కూడా ప్రభావం చూపింది. ఇది సాధారణంగా లోక ధర్మమే. పూర్వీకులు రాశులు పోసిన ఆస్తిపాస్తులను ఒక ప్రబుద్ధుడు తన విలాసాలకు పరుశరామ ప్రీతి చేస్తాడు. అతని సంతతి గర్భదారిద్ర్యం అనుభవించవలసి వస్తుంది. అలాటి వ్యక్తి ఆరగించిన పులుపు ద్రాక్షలకు అతని తరువాత తరాల వారికి పండ్లు పులుస్తాయి.

ఇదే భావాన్ని తెలుగు సామెత తల్లి (దండ్రులు) చేసిన పాప, పుణ్యాల పర్యవసానాలను తనయులు అనుభవిస్తారనే విస్తృత పరిధిలో వివరిస్తున్నది.

బైబులు సామెత తండ్రుల పరంగా, తెలుగు సామెత తల్లుల పరంగా ఉండడం ఇక్కడ గమనార్హం.

## 29

తెలుగు సామెత : తల్లిని పోలిన బిడ్డ, నూలును పోలిన చీరె
ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా?
ఆ తానులోని గుడ్డే

బైబులు సామెత : తల్లివలె తనయ (యెహెజ్కేలు 16:44)

తల్లి కడుపున పుట్టిన బిడ్డ ఆమె లక్షణాలను పుణికి పుచ్చుకొంటుంది. గోవు వెన్నంటే గోవత్సముంటుంది. నేతకు వాడిన నూలును మించిన నిగారింపు వస్త్రానికి రాదు. ఒక తానులోనుంచి చించిన వస్త్రాన్ని ఎన్ని రకాలుగా కుట్టినా ఆ పడుగు పేకల సమ్మేళనం కనబడుతూనే ఉంటుంది. ఇది ఈ తెలుగు సామెతల అర్థం.

తన ప్రజలు నిజ దేవుని విడిచి రాతిబొమ్మలకు మొక్కడాన్ని యెహోవా ప్రభువు ఆధ్యాత్మిక జారత్వంలో పోల్చి తన ప్రవక్తచే పలికిస్తున్నాడు. దేవుడే ఆ జాతి భర్త, తండ్రి సఖుడు. అయితే ఇశ్రాయేలు ప్రజలు తమ దైవ భక్తి వారసత్వానికి ఉద్వాసన పలికి తమ ఇరుగుపొరుగు జాతుల దురాచార వారసత్వాన్ని అనుసరించారు. అలా

చేయడం ద్వారా ఆ విగ్రహారాధక జాతులైన హిత్తి, ఆమోరి తదితర జాతులే తనకు తల్లిదండ్రులన్నట్టు ప్రవర్తిస్తున్నది ఇశ్రాయేలు జాతి (యెహెజ్కేలు 16:45). ఆ తల్లికి పుట్టిన బిడ్డ అన్నట్టుగానే ఉన్న తన ప్రజల పోకడను ఈసడించుకొంటూ దేవుని వాణిని వినిపించడంలో ప్రవక్త ఈ నానుడి ప్రయోగించాడు.

ఇందులోని ప్రబోధం స్పష్టం. తనూభవుల గుణ గణాలను నిర్ణయించేది స్థూలంగా తల్లిదండ్రులే. వారి ముద్ర అది మంచిదైనా చెడ్డదైనా పిల్లలపై ప్రస్ఫుటంగా పడుతుంది. కాబట్టి తల్లిదండ్రులైనవారు బాధ్యత గలిగి తమ ప్రవర్తన స్వభావాదులకు మెరుగుపెట్టుకొంటూ ఉత్తమ వారసత్వాన్ని మరుసటి తరానికి అందించవలసి ఉంది.

## 30

తెలుగు సామెత : తేనె / బెల్లం ఉన్నచోట ఈగలుంటాయి
ఉన్నవాడికి ఊరంతా చుట్టాలే

బైబులు సామెత : ధనవంతునికి ఎందరో మిత్రులు కలుగుదురు (సామెతలు 19:4)

తేనె మధురమైన పదార్థం. అందరికీ ఇష్టమైన పదార్థం. అన్ని జీవులను తొందరగా తనవైపునకు ఆకట్టుకునే గుణం కలిగినది. తేనె ఇచ్చే తియ్యదనం కోసం ఈగలు దాని చుట్టూ మూగుతాయి. డబ్బు, అధికారం ఉన్నవారి చుట్టూ చాలామంది ఇలాగే చేరుతుంటారు. వారి గొప్పదనాన్ని పొగడుతూనో, వారి భజన చేస్తూనో ఆ పెద్దవారి దృష్టిలో పడాలనుకుంటారు. ఎంతో కావలసిన వారి వలె, ఆప్తుల వలె ప్రవర్తిస్తారు. ఇదంతా తన మీద, తన వ్యక్తిత్వం మీద వారికున్న అభిమానం అని ఆ ధనవంతుడను కుంటే మోసపోయినట్టే! చుట్టూ చేరినవారి ప్రేమ ధనవంతుని డబ్బుపై, హోదాపైనే గాని అతని మీద కాదు. ఆ డబ్బు, హోదా పోయిననాడే నిజమైన మిత్రులెవరో, ఆప్తులెవరో తెలుస్తుంది. కలిమి బలిమి లేనప్పుడు వదిలివెళ్ళే వాళ్ళు ఎప్పుడూ వారి ప్రేమను సిరిసంపదలమీదే ఉంచారని తెలుస్తుంది. కష్టకాలంలో ధైర్యాన్నిచ్చే స్నేహితులు, ఆప్తులే నిజమైన ఆత్మ బంధువులు. విజయములోనూ, సిరిసంపదలు, హోదా ఉన్నప్పుడు చుట్టూ చేరేవారి గురించి ఈ రెండు సామెతలు హెచ్చరిస్తున్నాయి. ఈ విషయాన్ని సుమతీ శతకకారుడు హృద్యంగా వర్ణించాడు.

'చుట్టములు గాని వారలు
చుట్టములము నీకటంచు సొంపుదలిర్పన్

నెట్టుకొని యాశ్రయింతురు
గట్టిగ ద్రవ్యంబు గలుగ గదరా సుమతీ’

‘తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు గదరా సుమతీ’ అంటూ కూడా ఇంకొక పద్యంలో లోక ధర్మాన్ని సుమతీ శతకకారుడు దర్శించాడు.

పై రెండు సామెతలు సిరిగల సమయంలో దరిజేరే బంధువులను బట్టి సంతోష పడవచ్చునేమో గానీ, కష్ట సమయంలో వారు కొమ్ము కాస్తారని ఊహించడం అనవసరం అని చెబుతున్నాయి. నెయ్యి వేస్తున్నంత కాలమే అగ్నిహోత్రం జ్వలిస్తుంది. బెల్లం చుట్టూ ముసిరిన ఈగల వంటి పరివారాన్ని చూచి మురిసిపోయేవాడు విజ్ఞుడనిపించుకోడు. ‘డబ్బుకు లోకం దాసోహం’ అనే వాస్తవాన్ని ఈ సామెతలు కళ్ళకు కడుతున్నాయి.

## 31

తెలుగు సామెత : ధర్మాన్ని కాపాడితే ధర్మం కాపాడుతుంది
ధర్మో రక్షతి రక్షితః

బైబులు సామెత : ధర్మము కాపాడును (సామెతలు 13:6)

‘ధర్మం శరణం గచ్ఛామి’ అన్నది శాక్యముని దివ్యోపదేశం. ధర్మమనగా లోకాన్ని మంచి స్థితిలో నిలిపేది. శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు మూడవ సంపుటంలో ఉటంకించిన మనస్మృతి శ్లోకం ప్రకారం ధర్మం దశవిధాలు. అవి ధృతి, క్షమ, దమము, అస్తేయము, శౌచము, ఇంద్రియ నిగ్రహము, ధీరత్వము, విద్య, సత్యము, అక్రోధము.

ధర్మ శబ్దానికి న్యాయము, ఆచారము, అహింస, యజ్ఞము, సుగుణాలు మొదలైన అర్థాలు కూడా ఉన్నాయి. ధర్మాత్ములకు ధర్మమే శ్రీరామ రక్ష అని ధర్మకోవిదులు వక్కాణించే గీర్వాణ సూక్తి ఈ సామెతగా అవతరించింది.

కృతత్రేతా ద్వాపర కలియుగాలలో ధర్మం వరుసగా నాలుగు, మూడు, రెండు, ఏక పాదాలతో చరిస్తున్నదట. ప్రస్తుతమున్న కలికాలం తీరు చూస్తే ఆ ఒక్క కాలూ విరిగి ధర్మం మంచాన పడిందేమోనని అనిపించకమానదు. మానవులు ధర్మం తప్పి

చరిస్తున్నందువల్లనే అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు, ఉత్పాతాలూనని కాలజ్ఞులు, ధర్మవేత్తలు  అభిప్రాయపడుతున్నారు.

హైందవ సంప్రదాయాన్ని బట్టి చూస్తే ధర్మమంటే వర్ణాశ్రమ ధర్మాలనే అర్థమే ప్రధానంగా వస్తుంది. మన ఇతిహాసాలలో దర్శనమిచ్చే ఆర్య రాజపుంగవుల ముఖ్య విధి వర్ణాశ్రమ ధర్మస్థాపనే. సమాజ హితం కోసం నిర్దేశించబడిన ఈ ధర్మాలను కాపాడుకొంటూ ఉన్నంతకాలం మానవ సమాజం క్షేమ సౌభాగ్యాలతో విరాజిల్లు తుందని విశ్వాసం.

మొత్తంమీద మనుషులు దయా ధర్మాలకు కట్టుబడి ధర్మాన్ని ప్రోదిచేసుకొంటే ఆ ధర్మమే వారిని ఆదుకొంటుందనేది నిర్వివాదాంశం.

'ధర్మబుద్ధి చేత దైవంబు తెలిసిన

గాలుదేమి చేయగలడు ప్రజల

ధర్మమంటి వెంట దైవంబుగా నుండు' అంటాడు వేమన.

ధర్మాత్ములను యమధర్మరాజు సైతం ఏమీ చేయలేడట. ధర్మమే అలాటివారి వెంట నుండి సంరక్షిస్తూ ఉంటుందని వేమన ఉవాచ.

'ధర్మమునకు గీడు తలచిన వాండు తా

దుష్టుడగుచు తుదకు ద్రోవయె చెడు' అని కూడా వేమన అంటాడు.

గురుపత్నిని కామించి కూడిన చంద్రుడు కళ తప్పి నశించిన రీతిగా ధర్మం తప్పేవానికి వెతలు తప్పవని ధర్మాన్ని కాపాడేవారిని ధర్మం కాపాడుతుందని ఈ సామెతల ప్రబోధం. వ్యవస్థను మనం కాపాడితే వ్యవస్థ మనలను కాపాడుతుంది అనే అర్థం వీనిలో స్ఫురిస్తుంది.

## 32

తెలుగు సామెత :   నిజం నిలకడ మీద తేలుతుంది

బైబులు సామెత :   సత్యము కలకాలముండును (సామెతలు 12:19)

సత్యసంధతకు మన సంస్కృతిలో ఆపాదించిన విలువ, ప్రాముఖ్యత సాటిలేనివి. వేమన వాణి ఈ పరమ సత్యాన్ని పొదుపుగా ప్రస్తావించి వన్నెకెక్కింది.

'నిజములాడునతడు నిర్మలుడై యుండు

నిజమునాడు నతడు నీతిపరుడు

నిజము పల్కకున్న నీచ చండాలుడు'

అయితే సూనృత వాక్యంతో ఉన్న ఇబ్బంది ఏమిటంటే ప్రస్తుతానికి దానిని లోకులు నమ్మరు, మెచ్చరు. ఈసడించవచ్చు, హేళన చేయవచ్చు. అయితే లోకుల ఆమోద తిరస్కారాలతో నిమిత్తం లేకుండా సత్య వచనం శిలాక్షరం వలె అజరామరం.

తాను దుష్యంత పత్నిననీ తన చంకనున్న బిడ్డడు అతని తనూజుడనీ శకుంతల పేరోలగంలో దుష్యంతునితో ఎలుగెత్తి ఆక్రోశించిన వేళ పలికిన విషయాలు లోకప్రసిద్ధాలు. 'నుతజల పూరితంబులైన నూతులు నూరిటి కంటె' ఒక బావి మేలనీ, నూరు బావులకన్నా ఒక సత్క్రతువు మేలనీ, అలాటి నూరు యజ్ఞాలకన్నా ఒక కుమారుడు మిన్నయనీ, అలాటి సుత శతం కన్నా ఒక్క సత్యవాక్కు మేలనీ మహా భారతంలో నన్నయ శకుంతల నోట పలికించిన సూక్తి వేదవాక్కు.

దుష్యంతుడు సంప్రదాయానికి వెరసి ఆమెను తిరస్కరించినప్పటికీ నిజం నిలకడమీద తేలి ఈ రమ్య కథనం సుఖాంతమయ్యింది.

అనృత వాక్యాలు రేపే కారుచిచ్చు వలన కొంపలు కూలుతాయి. కల్లమాటలు కలతలకు కారణమవుతాయి. అందుకే వేమన

'కల్లు ద్రాగువాని కల్లు మ్రుచ్చనరాదు

కల్లలాడు వాడె కల్లు మ్రుచ్చు

కల్లు ద్రాగుకంటె కల్లలాడుట కీడు' అని అంటాడు.

అబద్ధం చీకటి. సత్యం అఖండ జ్యోతి. కాంతి కిరణాలు చీకటిని పటాపంచలు చేసినట్టు ఆలస్యమైనా సత్యమనేది సూర్యప్రకాశం వలె ఉదయించినప్పుడు అసత్యానికి కాలుమోపే స్థలముండదు. తెలుగు సామెత నేపథ్యం, సారాంశం ఇది.

బైబులు సామెత దీనితో ఏకీభవిస్తూ సత్యం కలకాలం ఉంటుందని చెబుతున్నది. అబద్ధాలు చెప్పి పబ్బం గడుపుకునేవారు కలకాలం వర్ధిల్లలేరు. సత్యహరిశ్చంద్రుడెన్ని ఇడుముల పాలైనా అతని సత్యసంధత ఎట్టకేలకు సర్వులకూ విధితమై షట్చక్రవర్తుల్లో ఒకడుగా అతడు వినుతికెక్కాడు. సత్యానికే అంతిమ విజయం అని ఘోషిస్తున్న ఈ సామెతలు అక్షర సత్యాలు.

## 33

తెలుగు సామెత : నిన్న ఉన్నవాడు నేడు లేడు

బైబులు సామెత : నరుల జీవితము గడ్డి పరక వంటిది (కీర్తనలు 103:15)

ఇది మానవ జీవితం అశాశ్వతమని తెలియజేయడం కోసం ప్రయోగించే తెలుగు సామెత. చాలామంది ఈ లోకంలో శాశ్వతంగా జీవిస్తామనే భావంతో ప్రవర్తిస్తూ ఉంటారు. భూములు, నగలు, మిద్దెలు మేడలు సంపాదిస్తారు. పిల్లికి భిక్షం పెట్టరు. అంతా తామే నిరంతరం అనుభవిస్తూ జీవించాలని ఆశిస్తారు. నిన్నా నేడూ రేపూ తమ ఉనికి, తమ ఆస్తిపాస్తులు నిలుస్తాయని భ్రమిస్తారు. మానవ జీవితం నీటి బుడగలాంటిదని గ్రహించరు. నిన్న ఉన్న మన పెద్దలూ, తల్లిదండ్రులూ నేడు లేరు కదా, మనం రేపు ఉంటామన్న నమ్మకం ఏమిటని వీరికి తోచనే తోచదు. రాజులు పోయారు, రాజ్యాలు అంతరించాయి. నిన్న ఉన్న పరిస్థితులూ నేడు లేవు, నిన్నటి మానవులూ నేడు లేరు.

'కారే రాజులు, రాజ్యముల్ గలుగవే, గర్వోన్నతిం బొందరే
వారేరీ, సిరి మూట గట్టుకొని పోవంజాలిరే, భూమిపై
బేరైనం గలదే' అని బలి చక్రవర్తి చేత పోతనకవి భాగవతంలో అనిపిస్తాడు (అష్టమ స్కంధము, 589 వ పద్యం). నిజమే, నిన్న ఉన్నవాడు నేడు లేడు. ఇదొక యాత్ర. అందుకే జాషువ కవి,

'ఆవిరి యోడలో జలధియాన మొనర్చెడు బాటసారులో
భూవర! రేవులందు దిగిపోయెద రించుక వెన్కముందుగా
నీ వసుధా ఫణంబు పనియెల్ల ముగించి స్వదేశ గాములై
పోవుచు వచ్చుచుంద్రు సతమన్ ప్రజలీ నరజమ్మ వర్తకుల్' (ఖండకావ్యము).

ఈ జీవిత యాత్రలో నిన్న ఉన్నవాడు నేడు, నేడున్నవాడు రేపూ ఉంటాడన్న నమ్మకం లేదు. ఈ భావాన్ని బోధించడానికే పై సామెత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

నిరంతరాయంగా సాగిపోతున్న ఈ లోకం ఒక సత్రమనీ ఇరు సంజెలు రెండు వాకిళ్ళనీ రమణీయంగా వర్ణించారు దువ్వూరి రామిరెడ్డిగారు తమ పానశాల కావ్యంలో. ఇక్కడ జమిషీదులు మున్నగు భాగ్యవంతులు కొంత సుఖించి ఎక్కడికో వెళ్ళిపోయారు.

‘అంతము లేని ఈ భువనమంత పురాతన పాంథశాల వి
శ్రాంతి గృహము అందు ఇరుసంధ్యలు రంగుల వాకిళుల్ ధరా
క్రాంతులు పాదుషాలు బహిరాం జమిషీడులు వేనవేలుగా
కొంత సుఖించి పోయిరెటకో, పెరవారికి చోటొసంగుచున్’

బైబులు సామెత కూడా ఇదే అర్థాన్ని విశదీకరిస్తున్నది. మానవ జీవితం, వారి ఆయుష్షు గడ్డివంటిదని, అడవి పూవుల వంటిదని తెలియజేస్తుంది. ఎండ, గాలి, వానలు ప్రబలితే గడ్డీ, అడవిపూలు నశించే విధంగా మానవులు నశిస్తారని గుర్తు చేస్తున్నది. ఇందులో కూడా నిన్న ఉన్నవాడు నేడు లేడనే భావమే స్ఫురిస్తుంది. మానవుని ఆయుఃప్రమాణం అరవై సంవత్సరాలు, ఇంకా బలవంతుడైతే ఎనుబది సంవత్సరాలు. తరువాత అతడు రాలిపోతాడని పలికి దావీదు మహారాజు జీవితం అశాశ్వతమని గుర్తు చేస్తున్నాడు. మానవ జీవితం నీటిబుడగ వంటిదని మరొక సామెత బైబులులో ఉన్నది.

వేదాంతులు, సిద్ధాంతులు, మహా మేధావులు కూడా జీవితం అశాశ్వతమని తెలియజేస్తూనే ఉన్నారు. ఈ తెలుగు, బైబులు సామెతలు కూడా ఇదే సత్యాన్ని ఎత్తి చూపుతున్నాయి.

## 34

తెలుగు సామెత : నిప్పు లేనిదే పొగ రాదు

బైబులు సామెత : పొగలు సెగలు నిప్పు మంటలకు సూచనములు అట్లే పరావమానములు హత్యలకు సూచనములు (సీరా 22:24)

కోడలుపిల్ల పచ్చి మామిడి కాయలు తింటున్నదంటే ఏదో విశేషం ఉండి తీరాలి. తొలకరి చినుకులు మొదలైనాయంటే జడివానలిక ఎంతో దూరాన లేవు. కొందరు పాలు పొంగిన వాసనను, పొగవాసనను ఇట్టే పసిగట్టేస్తారు. ఏదో కాలుతోంది అని హెచ్చరిస్తారు. అనుకోకుండా ఉరుములేని పిడుగులా వచ్చిపడేవి కొన్ని అయితే, మొత్తంగా మానవ జీవన స్రవంతిలో జరగనున్న విశేషాల తాలూకు సూచనలు ముందుగానే అవగతమవుతుంటాయి. నిప్పు లేనిదే పొగ రాదు అన్న తెలుగు సామెతా, బైబులు సామెతలోని మొదటి భాగం ప్రత్యేకించి సమాజంలో ఒక సందర్భంలో ఉపయోగించడం కద్దు. అదేమిటంటే ఎవడో ఒకడు కాని పని ఏదో రహస్యంగా

వెలగపెడుతుంటాడు. ఆ గుట్టు పూర్తిగా రట్టు కాకముందే గాలివార్తగా అక్కడక్కడా ప్రస్తావనలు వస్తుంటాయి. 'ఏమో మనం చూశామా' అని కొందరు తీసిపారవేయబోతే 'నిప్పు లేకుండా పొగ వస్తుందా?' అంటారు మరికొందరు. పైకి సహజంగా కనిపిస్తున్నప్పటికీ పొగ కనిపించిందంటే ఎంతో కొంత నిప్పు ఉండి తీరాలి.

మనుషుల మధ్య పొరపొచ్చాలు పొడచూపి దూషణలు, తోపులాటలు జరిగితే అది మరింత విపరీత పరిణామాలకు దారితీయడం సహజం. నరుని అంతరంగంలో ద్వేషాగ్ని కణమొక్కటి పడితే చాలు, చిచ్చురేపి హింసాగ్ని కీలలను వ్యాపింపజేస్తుంది. ఎవరో ఏదో అన్న ఒక్కమాట జాతివైరంగా పరిణమించిన సందర్భాలు కోకొల్లలు. పల్నాటి యుద్ధగాథ నేర్పించే పాఠమిదే. తిరస్కారం, అవమానం హత్యలకు దారి తీయగలవని బైబులు సామెత హెచ్చరిస్తున్నది.

ఇలా ఈ రెండు సామెతలు కారణ, కార్య సంబంధాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

## 35

తెలుగు సామెత : పుట్టినవారు గిట్టక మానరు

బైబులు సామెత : మట్టినుండి పుట్టినవన్నీ మట్టిలో కలియక తప్పదు (ఉపదేశకుడు 3:20)

జాషువాగారు శ్మశాన వాటిక ఖండికలో తెలుగు పద్యమున్నంత కాలం చిరస్థాయిగా నిలిచే ఈ క్రింది పద్యంలో పైని చెప్పిన తెలుగు సామెతలోని ఆత్మ ఆవిష్కృతమవు తున్నది:

ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని
కలము, నిప్పులలోన గఱగిపోయె!

యిచ్చోటనే భూము లేలు రాజన్యుని
యధికారముద్రిక లంతరించె!

యిచ్చోటనే లేత యిల్లాలి నల్లపూ
సలసౌరు గంగలో గలసిపోయె!

యిచ్చోట నెట్టిపేరెన్నికం గనుగొన్న
చిత్రలేఖకుని కుంచియ, నశించె!

ఇది పిశాచులతో నిటాలేక్షణుండు
గజ్జె గదలించి యాడు రంగస్థలంబు;
ఇది మరణదూత తీక్ష్ణమౌ దృష్టు లొలయ
నవని బాలించు భస్మసింహాసనంబు

ఆ మరుభూమిలో ఒక వంక ఒక మహాకవి కమనీయ ఘంటం బూడిద కుప్పగా మిగిలింది. ఒక చెంప ఒక రాజేంద్రుని అధికార ముద్రిక మట్టిపాలయ్యింది. ఒక మూల ఒక ఇల్లాలి నల్లపూసల శోభ వసివాడింది. సమవర్తి యమధర్మరాజు మరణ పాశాన్ని తప్పించుకోగల ప్రాణి లేదు. ఈ అక్షర సత్యాన్ని అన్ని మతాలలోని, జాతుల లోని మానవులు గుర్తించారు. ఆ ఎరుకలోనుండి ఉద్భవించినవే ఈ రెండు సామెతలు.

మానవ దేహం మట్టిలో కలుస్తుందనీ, అందులో వెలుగొందే ఆత్మదీపం జ్యోతిర్మయుడైన భగవంతునిలో లీనమవుతుందనీ బైబులు ఉపదేశం.

ఈ సామెతలు నేర్పించే గుణపాఠం ఏనుగు లక్ష్మణకవి కమనీయ వాక్కుల్లో,

ధృతిగొని రోగముల్ జరయు దేహము నొంపకముందె, యింద్రియ
ప్రతిహతి లేకముందె, తన ప్రాణవిరామము కాకముందె, పం
డితజను డాచరింపదగు రీవి బ్రయత్నము ముక్తికిన్, మహో
ద్ధతశిఖి నిల్లు గాలుతటి దాలిమి నూతులు ద్రవ్వటొప్పునే?

(భర్తృహరి సుభాషిత రత్నావళి, వైరాగ్య శతకము, ఏనుగు లక్ష్మణకవి)

మరణం తథ్యమని తెలిసినా, తెలియకపోయినా ఈ కఠోర సత్యం అనివార్యం. గ్రహించినవాడు ధన్యుడు.

## 36

తెలుగు సామెత : పూవు పుట్టగానే పరిమళిస్తుంది

బైబులు సామెత : పసివాడు తన పనుల ద్వారా తన భావి జీవితమును సూచించును (సామెతలు 20:11)

అనేకమంది మహనీయుల జీవిత చరిత్రలో ఈ సామెత దర్శనమిస్తుంది. యేసుక్రీస్తు తన పన్నెండవ యేటనే ఆనాటి యూదుల మతకేంద్రమైన జెరుసలేంలో విద్వద్గోష్టిలో చర్చిస్తూ, తర్కిస్తూ అఖండ పండితులను నివ్వెరపోజేశాడని బైబులులో చదువుతాము. ఆది శంకరుడు తన 3వ యేటనే మాతృభాష లిపి నేర్చాడనీ, ఉద్గ్రంథాలు పఠించాడనీ, రచించాడనీ అంటారు. కారణజన్ములు తమ శైశవంలోనే తమ మహాత్మ్యాన్నీ, కుశాగ్రబుద్ధినీ, తదితర గుణ విశేషాలను చాటే పనులు చేసి పరికించి చూసేవారిలో ఒక జిజ్ఞాస రేకెత్తిస్తారు. ఈ బాలలు పెరిగి పెద్దవారయ్యాక మహనీయులవుతారని అవగతమైపోయేలా వారి చేష్టలు, వాలకం ఉంటాయి.

తెలుగు సామెతలో ప్రకృతి ధర్మమొకదానిని పేర్కొనడం ద్వారా ఈ సత్యాన్ని మనోహరంగా తెలియజెప్పడం చూస్తున్నాము. బైబులు సామెత సూటిగా ఇదే భావాన్ని ప్రదిపాదిస్తున్నది. అన్ని సంస్కృతుల్లో, అన్ని కాలాల్లో పసివారు తమ భావి ప్రతిభావ్యుత్పత్తులను బాల్యంలోనే ప్రదర్శించడం ఉన్నదని ఈ సామెత ద్వారా అర్థమవుతున్నది. ఒక బాలుడు కొంటె పనులతో తుంటరి మాటలతో నలుగురినీ నవ్విస్తుంటాడు. వాడు పెద్దవాడైనాక అదే ధోరణి కొనసాగుతుంది. ఒకడు రంగులు ముందు వేసుకొని వచ్చీరాని చిత్రాలు గీస్తుంటాడు. తగిన ప్రోత్సాహముంటే వాడు మంచి చిత్రకారుడౌతాడని భావించవచ్చు. వేరొకడు గిల్లికజ్జాలు పెట్టుకుంటూ ఇతర పిల్లలను బాధిస్తూ, ఏడిపిస్తూ ఉంటాడు. వాడు పెద్దయ్యాక విస్తృత పరిధిలో లోక కంటకుడౌతాడని ఊహించవచ్చు.

మొత్తంమీద ఈ సామెతలు రెండూ ఒకానొక ఆశావహ, సకారాత్మక దృక్పథంలో లబ్ధ ప్రతిష్ఠ వ్యక్తులు తమ జీవితం తొలి దశల నుంచే ఆ మహనీయత తాలూకు సూచనలు ప్రదర్శిస్తుంటారనే అర్థాన్ని వెల్లడిస్తున్నాయి. బాలల్లో ఇలాటి నిపుణతలు, మేధో సంబంధమైన చురుకుతనం, చాతుర్యం లీలగా గోచరమవుతున్న తరుణంలో వాటిని ప్రోత్సహించి, ప్రోదిచెయ్యాలి.

## 37

తెలుగు సామెత : పెద్దల మాట చద్దిమూట

బైబులు సామెత : జ్ఞానుల ఉపదేశము జీవజల ధారలు (సామెతలు 13:14)

పెద్ద తలకాయ లేకుంటే కనీసం ఎద్దు తలకాయ తెచ్చి పెట్టుకోమంటారు. వయస్సులోను, జ్ఞానంలోనూ సమాజంలో పెద్దరికం వహించిన వారిని ఆచార వ్యవహారాలకు పిలిచి కూర్చోబెట్టుకోవడం మర్యాద. మర్యాద మాత్రమే కాదు, అదెంతో మేలు. కొన్నిసార్లు వారు చెప్పే మాటలు రుచించకపోవచ్చు గానీ అనుభవజ్ఞులు చెప్పే మాటలను ఔదలదాల్చడం మన విధి. పెద్దల మాట చద్దిమూట అనే తెలుగు సామెత తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రమైనది. అక్షర లక్షల విలువ చేసేది. అందుకే వేమన

'కస్తూరినటు చూడ గాంతి నల్లగనుండు

పరిమళించు దాని పరిమళంబు

గురువులైన వారి గుణము లీలాగురా!' అని అంటాడు.

గురుతుల్యుల మాటలు, గుణాలు కస్తూరి పరిమళ సదృశాలు. ఈ సామెత అంత ఆత్మీయంగా ధ్వనించడానికి కారణం అందులో చల్లగా ధ్వనిస్తున్న 'చద్దిమూట' అనే పదబంధం. కృషీవలుడు తొలికోడి కూసే వేళకే లేచి రాత్రి మిగిలిన అన్నంలో ఇంత చల్లపోసి రెండు పచ్చిమిరపకాయలు వేసుకొని గిన్నెను మూట కట్టుకొని పొలం వెళతాడు. పొద్దేక్కే వరకు వంచిన నడుము ఎత్తకుండా పనిచేసి ఎండ చిటపడలాడిస్తుంటే తలపాగా తీసి జలజలా పారుతున్న బోదె నీటిలో ముఖం కడిగి నీడలో కూర్చుని చద్దిమూట విప్పి తింటుంటే అంతకన్నా పరమాన్నం లోకంలో వేరే లేదనిపిస్తుందతనికి. ఆ మాధుర్యం తెలిసిన జానపదుల వ్యవహారంలో చల్ల చిలికితే పుట్టిన వెన్నపూసలాగా ఈ సామెత పుట్టింది.

యూదుల దేశం పర్వతమయం. కొండల్లో పుట్టి ధారకట్టి జాలువారే జలతారు తీగెల వంటి జలధారలు ఆ జాతికి అమృత సదృశ్యాలు. మిట్టపల్లాలలో మిట్ట మధ్యాహ్నం వేళ పయనించే పాంథునికి ఆ కొండల్లోని చిరుజలపాతాలు సేద

దీరుస్తాయి. అందుకే యూదుల్లో పుట్టిన సామెత పెద్దల సదుపదేశాన్ని చన్నీటి ఊటతో పోల్చింది.

దగ్గర చేరినవారికి వటవృక్షం చల్లని నీడనిచ్చినట్టు సజ్జనులైన పెద్దలు మంచి మాటలతో మనస్సును రంజింపజేసి హితం చేకూరుస్తారు. యుక్తాయుక్త విచక్షణ, అపారమైన జీవితానుభవం, లౌక్యం ఎరిగిన పెద్దలు సమయానుకూలమైన మాటలతో పరిస్థితిని చక్కదిద్దుతారు. సంయమనంతో, చనువుగా, మందలింపు మాటలతో ఆవేశాలు చల్లారుస్తారు. దిక్కుతోచని వేళ కర్తవ్య బోధనతో శంకానివృత్తి కలిగించి మనస్సు చల్లబరుస్తారు. 'ఫక్కి తెలిసి పలుక నొక్క వాక్యమె చాలు' అని వేమన అన్నట్టుగా విధం తెలిసి సరియైన సలహా ఇచ్చే పెద్దలు పూజ్యులు. అలాటివారి పల్కులు శిరోధార్యం. ఈ సత్యాన్ని ఈ సామెతలు వివరిస్తున్నాయి.

## 38

తెలుగు సామెత : మెరిసేదంతా బంగారం కాదు

తెల్లనివన్నీ పాలు కావు, నల్లనివన్నీ నీళ్ళు కావు

బైబులు సామెత : మంచిదారివలె కనిపించునది కూడా మృత్యువుకు దారితీయును (సామెతలు 14:12)

యదుకుల తిలకుడు శ్రీకృష్ణునికి తాను సాటి అని భావించిన పౌండ్రక వాసుదేవుని గాథ లోక విదితం. అతడు కూడా కృష్ణుని వలె పీతాంబరాలు ధరించి, శంఖచక్రాలు చేబూని, అష్ట భార్యలను చేపట్టి వాసుదేవ నామధారియై విర్రవీగేవాడట. శ్రీకృష్ణుని మీదకు కాలు దువ్వి చివరకు ఆయన చేతిలోనే చనిపోయాడు. పై ఆకారము, నిగారింపులు ఒకటిగా ఉన్నంత మాత్రాన మౌలిక భేదాలు సమసిపోవు అనే సార్వత్రిక సత్యాన్ని ఈ తెలుగు సామెత ప్రతిపాదిస్తున్నది.

'కట్టుబట్ట జూచి ఘనత చెప్పగరాదు
కానరావు లోని ఘనతలెల్ల
జంగమైన వాని జాతినెంచగ నిట్లు'

అంటున్నాడు వేమన. ఆర్భాటంగా వేసుకొన్న ఆహార్యాన్ని బట్టి యోగ్యతను నిర్ణయించరాదు. విభూతి పూసుకొన్నంత మాత్రాన ఒకడు జంగమదేవర అయిపోడు. బీరాలు పలికినా ఉత్తర కుమారుడు లోకోత్తర వీరుడు కానేరడు. వేమన గుర్తించినదే మరొకటి ఉప్పుకప్పురంబుల కున్న ఒక్క పోలిక. అయితే కర్పూరానికున్న విలువ ఉప్పుకెక్కడిది? బాగా తోమి తళతళా మెరిసేలా చేస్తే ఇత్తడి పుత్తడిని మించి ప్రకాశిస్తుంది గదా!

బైబులు సామెత కూడా ఇదే సత్యాన్ని ఆవిష్కరిస్తున్నది. మనుషులు లోతుపాతులు తెలుసుకోకుండా తాము నడిచేది సన్మార్గమే ననుకుంటూ జీవిస్తారు. కాబట్టి కంటికి మంచిగా కనిపించినంత మాత్రాన అది సన్మార్గమని భ్రమించడం తగని పని అని ఈ సామెతలు హెచ్చరిస్తున్నాయి.

## 39

తెలుగు సామెత : రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా?

బైబులు సామెత : రాజు తలచినదల్లా చేయగలడు (ఉపదేశకుడు 8:3)

రాజులు నిరంకుశులు. రాజు చిత్తవృత్తి అగమ్య గోచరము. 'చారు మాణిక్య భూషిత శస్త మస్తకంబు గల పన్నగంబు భయంకరము గాదె' అన్నట్లు శిరస్సుపై మణియున్నది గదా అని పామును చేరదీయని రీతిగా సంపన్నులు గదాయని రాజుల పంచన చేరడం క్షేమం కాదు. రాజసేవ కత్తిమీద సామన్న మాట ఏనుగు లక్ష్మణ కవి ఇలా సమర్థిస్తున్నాడు:

'మనుజులలో నెవ్వడు దగ
దనవాడను వాడు దుష్ట ధరణీశునకున్
తనకయి వ్రేలిమి వ్రేల్చెడు
జనుని తనువు గాల్చు వాయు సఖు డదయుండై' (భర్తృహరి సుభాషిత రత్నావళి, దుర్జన పద్ధతి. పే. 69, ఏనుగు లక్ష్మణకవి)

అగ్నిహోత్రుడు తన తృప్తికై హోమము చేసేవారిని సైతం తాకినంత మాత్రాన మొహమాటము లేకుండా కాలుస్తాడు. అలాగే భూపాలురు సైతం ఒకడెంత హితకారి యైనప్పటికీ కొంచెము కినుక కలిగితే సంహరిస్తారు.

జాషువా విరచిత ఫిరదౌసిలో గజనీ మహమ్మదు నిరంకుశ వర్తనం తేటతెల్లంగా ఉంది.

'ఒక్కొక్క పద్దియంబున
కొక్కొక్క బంగారు రూక యొసగెదను కవీ
మక్కా మసీదు తోడని
వక్కాణించెన్ మహాసభా మధ్యమునన్'

తీరా కృతి ముగించాక వెండి నాణేలు పంపించాడు. రాజు తలపై కవి కర్పూరం చల్లితే కవితలపై నృపాలుడు నిప్పులు పోశాడు. అది చాలదన్నట్టు కవిని మట్టుబెట్టమని ఆజ్ఞాపించాడు.

అటు అనుగ్రహించడానికైనా, ఆగ్రహించడానికైనా సమర్థుడు రేడు. పేదను క్షణమాత్రంలో కనక వర్షంలో ముంచెత్తడానికైనా తల తీయించడానికైనా తాహతున్న ఘటనా ఘటన సమర్థుడు. అధికారుల ఎదుట జాగరూకతతో ఉండాలన్న సామాన్య పరిజ్ఞానాన్ని ఈ సామెతలు తెలుపుతున్నాయి.

## 40

తెలుగు సామెత : – రౌతును బట్టి గుఱ్ఱము
– యథా రాజా తథా ప్రజ

బైబులు సామెత : పాలకుడెట్టివాడో ప్రజలట్టి వారగుదురు (సీరా 10:2)
రాజు నీలివార్తలు వినువాడైనచో, మంత్రులు కొండెములు చెప్పుదురు (సామెతలు 29:12)

స్థూలంగా పాలకులను బట్టి పాలితులుంటారని ఈ సామెతలు ప్రతిపాదిస్తున్నప్పటికీ, అల్పులు, దుష్టులు అయిన పాలకులకే సాధారణంగా వీటిని అన్వయిస్తారు. చెప్పు తినే కుక్క చెఱకు తీపి ఎరగనట్లు అల్పబుద్ధి గలవానికి అధికారమిస్తే మంచివారందరినీ వెళ్ళగొడతాడు. పీనుగు ఉన్నచోట రాబందులు చేరినట్టు మూర్ఖుడైన

రాజు చుట్టూ దుర్మార్గులు చేరుతారు. రాజులు నిరంకుశులు. అప్రియాలు మాటలాడేవారిని నిరసిస్తారు. రావణాసురుని కొలువులో నుండి విభీషణుడు వైదొలగినట్టుగానే అనువుగానిచోట అధికుల మనరాదు అని గ్రహించి విజ్ఞులంతా దుష్ట పాలకుల పంచ నుండి నిష్క్రమిస్తారు.

'ప్రభువు క్రోతియైన ప్రగ్గడ పందియౌ

సైనికుండు పక్కి సేన పనులు

ఏన్గులశ్వంబులును నెలుకలు పిల్లలు' అని అంటాడు వేమన.

ఇకపోతే స్థూలంగా యజమాని దుష్టుడైతే ఆ నైజం గల వ్యక్తులే అధికార స్థానాల్లో ఉంటారు. అదొక పాముల పుట్టలా తయారవుతుంది. అలాటివానిని నమ్మిన బంటులు తమ పబ్బం గడుపుకొనేందుకు లేనిపోని వార్తలు పుట్టించి చాడీలు చెప్పి వాస్తవానికి దూరం చేసి అతని పతనానికి కారణమవుతారు. దుర్యోధనుని ఆంతరంగిక వర్గం దుష్ట చతుష్టయమే ఇందుకు మంచి ఉదాహరణ. విదుర నీతులు చెవిని పెట్టకుండా, శకుని తదితరుల కుటిల వాక్కులకు సమ్మతిస్తూ, చివరికి కురు వంశక్షయానికి కారకుడైనాడు రారాజు.

అటువంటి యజమాని వద్ద చేరేవారు అతని క్షేమమేమాత్రం ఆశించక వంచనతో తమ బొజ్జలు నింపుకొనేందుకు కపటాలు పలుకుతుంటారు. ఇలా పరస్పరం వంచించుకొంటూ ఆ రాజును ఆశ్రయించిన వారికి న్యాయం జరగనీయకుండా చేస్తారు. రాజులకు ఉన్నత భావాలు, ఉదాత్త గుణం ఉండాలి. తనవారిలో యోగ్యులెవరో, పండితులెవరో, పుణ్యాత్ములెవరో పసిగట్టగలిగే కుశాగ్రబుద్ధి ఉండాలి. చెప్పుడు మాటలకు చెవినియ్యక యుక్తాయుక్త విచక్షణ కలిగి ప్రతి విషయంలోనూ తానే ఒక అంచనాకు రాగలిగి యుండాలి. తెలుగు సామెత ఈ చర్చనీయాంశాన్ని మరికొంత దూరం తీసుకువెళుతున్నది. రాజు దుష్టుడైతే ప్రజలు కూడా అలాటివారే అవుతారన్న భావం కూడా గమనించదగినదే. యథా రాజా తథా ప్రజ అనే నానుడి లోక ప్రసిద్ధమైనదంటే అటువంటి పరిస్థితులు లోకంలో కనిపిస్తున్నాయి. కనుకనే రాజు ధర్మం తప్పి, విషయలోలుడై చరించేవాడైతే మొత్తంగా ప్రజానీకంలో ధార్మిక దృష్టి నశిస్తుంది. అరాచకం ప్రబలుతుంది. బలవంతులదే పెత్తనమవుతుంది అని ఈ సామెతలు సెలవిస్తున్నాయి.

## 41

తెలుగు సామెత : వచ్చినపుడు తెచ్చింది లేదు, పోయేటప్పుడు పట్టుకెళ్ళేది లేదు

బైబులు సామెత : నరుడు వట్టి చేతులతో ఈ లోకములోనికి వచ్చినట్లే వట్టి చేతులతోనే వెళ్ళిపోవలెను (ఉపదేశకుడు 5:15)

తనువును వీడి ఆత్మ ఊర్ధ్వలోకాల కేగే సమయానికి జరిగే సంభవాలను భర్తృహరి ఏకరువు పెట్టాడు –

మానము గ్రుంగగా, ధనము చుట్టముగా, నిజబాంధవాశ్రితుల్
దీనత జెంది యేగ, నతిథి ప్రకరంబు నిరాశమై జన,
మానుగ జవ్వనంబరుగ. . . (భర్తృహరి సుభాషిత రత్నావళి, వైరాగ్య శతకము, పే.365, ఏనుగు లక్ష్మణకవి).

గౌరవం తగ్గుతుంది; ధనం వెడలిపోతుంది; యాచకులు వట్టి చేతులతో వెను దిరుగుతారు; పరిజనం విడనాడుతారు; యౌవనం ఉడిగిపోతుంది. నగ్న శరీరిగా వచ్చిన నరుడు నగ్న శరీరిగానే వెళ్ళిపోతాడు. తెలుగు బైబులు సామెతలు రెండూ ఈ సత్యాన్నే చాటి చెబుతున్నాయి.

జగజ్జేత అలెగ్జాండరు గురించి ఒక సంగతి చెబుతారు. పిన్న వయసులోనే హిందూ దేశం వరకు తన శౌర్య ప్రభ వెలిగించి మృత్యువాత బడే సమయంలో అతడొక ఆజ్ఞ ఇచ్చాడట. నా దేహాన్ని మోసుకుపోయే సమయంలో నా చేతులు రెండూ ఇరు ప్రక్కలా చాపి గుప్పిలి విప్పి ప్రజలకు కనుపరచమన్నాడట. ఇంత పాటుపడి ఇన్ని రాజ్యములను చేపట్టి ఇదిగో నేడు రిక్తహస్తుడినై తరలిపోతున్నానని లోకానికి ప్రకటించేందుకు అతడీ ఆనతినిచ్చాడని చెబుతుంటారు. ఈ సత్యాన్ని అందరూ గ్రహించి, దాని ప్రకారం జీవిస్తే లోకం ఎంత బాగుంటుంది! అదే ఈ సామెతల సందేశం.

## 42

తెలుగు సామెత : వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి

బైబులు సామెత : ఇనుమును ఇనుముతోనే పదును పెట్టినట్టు నరుడు తోటి నరుని పరిచయంతోనే సునిశితుడగును (సామెతలు 27:17)

బైబులు, తెలుగు సామెతలు రెండూ వ్యక్తుల పరిణతి, సుశిక్షణలకు వారికి ధీటైన గురువులు ఉండవలసిన ఆవశ్యకతను తెలుపుతున్నాయి. గనిలో దొరికే ముడివజ్రాన్ని సానబెట్టి బహుముఖాలుగా చెక్కి తళుకులీనే రూపానికి తేవాలి. ప్రకృతి అంతటిలోకీ అత్యంత దృఢమైన పదార్థం వజ్రమేనంటారు శాస్త్రజ్ఞులు. మరి అస్తవ్యస్తమైన ఆకారంలో శిలాసదృశ రూపంలో మట్టిలో లభ్యమైన వజ్రాన్ని కోసి పదును పెట్టడానికి దానితో సమానమైన సత్వమున్న పరికరమే కావాలి. అందుకే వజ్రాన్ని కోసే యంత్రంలో వజ్రం అతికి ఉంటుంది. బైబులు సామెత సైతం ప్రకృతిలో లభ్యమయ్యే వేరొక దృఢమైన లోహాన్ని ప్రస్తావించి అదే సత్యాన్ని వక్కాణిస్తున్నది.

అర్జునుడు విలువిద్యలో రాటుదేలాలంటే ద్రోణాచార్యుడంతటివాడే కావాలి. వివేకానందుని ఆధ్యాత్మిక ప్రతిభా పాటవాలకు మూల కారణం రామకృష్ణ పరమహంస దివ్యోపదేశాలే. శిష్యుడు అప్రతిహత ప్రతిభ గలవాడై అతనికి బోధించే గురువులు పేలవమైన వారైతే ఆ పరిస్థితి సంకటప్రాయంగా పరిణమిస్తుంది. ప్రహ్లాదుని గురువులు చండామార్కుల వారికి దాపురించిన ఇబ్బంది ఇదే.

ఈ సామెతలకు మరొక మహోదాత్తమైన నెరవేర్పు యేసుక్రీస్తు శిష్యుల విషయంలో ద్యోతకమవుతున్నది. ఆ పన్నెండుమందీ పన్నెండు వజ్రపుతునకలు. గనిలో త్రవ్వితీసిన వజ్రాల వలె ధూళి ధూసరితమై ఒక ఆకారం, వ్యవహారం లేనివారు యేసు ప్రభుని శిష్యరికంలో మణిమాణిక్యాలై రాణించారు. లోకాన్ని తలక్రిందులు చేసేవారు అని వారి ప్రత్యర్థులు వారిని గురించి చెప్పుకున్నారు. తమ తరంలో క్రీస్తు బోధనామృతాన్ని లోకమంతటికీ వీరు పంచారు. మరణానికి వెరవలేదు.

జ్ఞాన సముపార్జన, స్ఫూర్తి మనుషులకు వివిధ విధానాలలో కలుగుతుంది. సద్గ్రంథ పఠనం కొందరికి ఉపకరిస్తే కొందరికి జీవితమే పాఠాలు నేర్పుతుంది. సర్వసంగ పరిత్యాగం కొందరిని మునులుగా మారిస్తే వృత్తి వ్యాపార విజయాలు మరికొందరిని రాటుదేలేలా చేస్తాయి. అయితే మనిషికి ప్రేరణ మనిషి ఇచ్చినంతగా వేరెవరూ ఇవ్వలేరు. సాటి మనిషి ఉత్తమ గుణాలు, ఆదర్శాలు మనుషులను ప్రేరేపించి వారిలో నిద్రాణమై ఉన్న శక్తియుక్తులను వెలికితీస్తాయి. “పనితొడవులు వేరు బంగారమొక్కటి, పడు ఘటములు వేరు ప్రాణమొకటి” అని వేమన వాక్రుచ్చినట్టుగా మనుషులు వేరు వేరుగా ఉన్నారు గానీ మనుషులందరి అస్థిత్వమొక్కటే కనుక మనిషే వేరొక మనిషిని ఉద్దీపింపజేసి మహోన్నత శిఖరాలు స్పర్శించేలా చేయగలడు.

గురూపదేశాలకు స్పందించి జ్ఞానాంబరాలను చుంబించిన వారెందరో! చెలి రూపలావణ్యాదులకు మురిసి కలం పట్టి ఆచంద్రతారార్కం నిలిచే కావ్యాలు వెలయించిన వారెందరో! కుంచె, ఉలి చేబూని కళాఖండాలు ఆవిష్కరించిన వారెందరో!

వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి అనే సామెతను మరో కోణంలో కూడా ఉపయోగిస్తారు. శక్తి సంపన్నుడైన మనిషిని లొంగదీయడానికి అతనితో సరిపోలిన శౌర్య ప్రతాపాలున్నవాడే సరిజోడు. ఉత్తర గోగ్రహణానికి కురువీరులంతా తరలివచ్చారు. విరాటరాజు అర్భకుడు. కాగల కార్యం నల్లేరుపై బండి నడకగా దుర్యోధనాదులు భావించారు. కానీ అజ్ఞాతవాస గ్రహణం వీడి ద్విగుణీకృత శౌర్యంతో అర్జునుడు కట్టెదుట కనిపించే సరికి 'వచ్చినవాడు ఫల్గుణుడవశ్యము గెల్తుమనంగరాదు' అని నిరుత్సాహపడ్డారు. వీరులు తమ సాటి వీరుణ్ణే పోరుకై ఎన్నుకోవడం మన సంప్రదాయ సాహిత్య వీరగాథల్లో చూస్తాము.

## 43

తెలుగు సామెత : వాన రాకడ ప్రాణం పోకడ ఎవరికి తెలుసు?

బైబులు సామెత : రేపేమి జరుగునో తెలియదుగదా (యాకోబు 4:14)

ఏ సమయంలో ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియదనే విషయాన్ని విశదీకరించడం కోసం ఈ తెలుగు సామెతను ఉపయోగిస్తారు. ఆధునిక శాస్త్ర పురోగతి ఎంత జరిగినా చాలా విషయాలలో నిజానికి ఏ నిమిషంలో ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియదనే విషయం మాత్రం ముమ్మాటికీ నిజం. శాస్త్రవేత్తలు, వేదాంతులు, హేతువాదులు కూడా ఈ విషయాన్ని తెలుసుకోలేకపోతున్నారు. ఇటువంటి పరిస్థితిని వివరించడానికి మానవుని అశక్తతను జ్ఞాపకం చెయ్యడానికి 'వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరికి తెలుసు?' అనే తెలుగు సామెతను ఉటంకిస్తారు.

బైబులు సామెత కూడా రేపు ఏమి జరుగునో ఎవరికీ తెలియదని విశదీకరిస్తున్నది. మానవుడు మహాజ్ఞానియని, భూమ్యాకాశాల గుట్టును తెలుసుకున్నాడని, చంద్ర మండల రహస్యాలను ఛేదించాడని భావిస్తున్న ఈ రోజుల్లో కూడా ఎప్పుడు ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియదంటే ఆశ్చర్యపోనవసరం లేదు. ఇది ముమ్మాటికీ నిజం.

పోతులూరి వీరబ్రహ్మంగారితోపాటు మరికొంతమంది పాశ్చాత్యులు కూడా భవిష్యద్దర్శనం (కాలజ్ఞానం) చేశారన్నమాట వాస్తవమైనా, ఇది స్థూలంగా దేశ కాల పరిస్థితులను పరిశీలించి మూకుమ్మడిగా, కొంత కాల వ్యవధిలో సంభవించే మార్పులను సూచించే ప్రయత్నమే గాని ఖచ్చితంగా రేపు ఫలానా వ్యక్తి చనిపోతాడని, తెల్లవారి ఈ సమయంలో ఇది జరిగి తీరుతుందని గాని చెప్పింది మాత్రం కాదు. కనుక వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరికీ తెలియదని, రేపేమి జరుగుతుందో ఎవరూ ఎరుగలేరనే ఈ తెలుగు, బైబులు సామెతలు సమానార్థకాలని నిస్సందేహంగా చెప్పవచ్చు.

## 44

తెలుగు సామెత : విత్తునుబట్టి పంట

బైబులు సామెత : నాటిన దానినే కోసుకొనవలెను (గలతీయులకు 6:7)

రాజరాజనరేంద్రుడు కొడుకు పెండ్లాడవలసిన కన్యను తానే వివాహమాడాడు. ఇటువంటి వావి వరసలు తప్పిన పనికి తగిన శిక్షగా కుటుంబ జీవనం అల్లకల్లోలమై శోక సముద్రంలో మునిగిపోయాడు. అటు చిత్రాంగి ప్రేమను చూరగొనలేక, ఇటు కొడుకును కోల్పోయి తల్లడిల్లాడు.

కొడుకును వరియింపగోరి వచ్చినదాని
తండ్రి పెండ్లియాడ ధర్మమగున్
తప్పని తెలిసియు దా జేయు కర్మంబు
తప్పదెపుడు భువిని తగులు వేమ.

ఇది తప్పు అని తెలిసి చేసినా, తెలియక చేసినా దాని పర్యవసానం ఒకటే. చేసినవాడు తాను చేసినవాటి ఫలాన్ని అనుభవించక తప్పదు. పల్లేరు కాయలు పంట వేసినవాడు ముండ్లనే ఫలసాయంగా పొందుతాడు. మధుర ఫలాల ఉద్యానవనం నాటినవాడు ఆ పండ్లు ఆరగిస్తాడు. ఈ సాధారణ న్యాయం తెలుగు, బైబులు సామెతలలో ప్రతిబింబిస్తున్నది.

శ్రేయస్సు కోరేవాడు సర్వవిధాలా సత్కర్మను అనుష్ఠించాలని ఈ సామెతల భావం.

ఆశాసంహరణం, ఓర్మి, మదత్యాగం, వాంఛాశూన్యత్వం, సత్యవాక్పరిపాలన, శత్రులాలనము, మాన్యప్రీతి దీనుల పాలిట కృప, ఇవి శిష్టాచారాలు. ఈనాడు నాటిన మామిడి విత్తు భావికాలంలో రసస్ఫోరకాలైన ఫలాలనిచ్చినట్టు ఆ శిష్టుని భావిజీవితాన్ని ఇవి సకల సౌభాగ్యపూరిత మొనర్చుతాయి.

ఇందులో సంప్రదాయ భారతి ఆమోదించే కర్మ సిద్ధాంత ఛాయ కూడా లేకపోలేదు. గత జన్మ కర్మ ఫలాన్ని అధిగమించడం ఎవరి తరమూ కాదన్న భావాన్ని ఈ సామెతల్లో గ్రహించేవారూ లేకపోలేదు. దేనిచేత విష్ణువు పది అవతారాలెత్తవలసి వచ్చిందో, రుద్రుడు దేనిచేత పుర్రెను పాత్రగా గొని బిచ్చగాడై తిరిగాడో, దేనిచేత సూర్యుడు ఆకాశంలో దేశదిమ్మరి అయ్యాడో ఆ సర్వనియంత్రణ శక్తిగల కర్మ అనివార్యమైనది, అప్రతిహతమైనది. ఈ వ్యాఖ్యానాన్ని సంప్రదాయవాదులు హర్షిస్తారు. అయితే మనిషి తన పనులకు తగిన ప్రతిఫలాన్ని అనుభవించక తప్పదనే సత్యాన్నే ఈ సామెతలు బోధిస్తున్నాయని గ్రహించక తప్పదు.

## 45

తెలుగు సామెత : విత్తొకటి వేస్తే చెట్టొకటి మొలుస్తుందా?

బైబులు సామెత : దుష్టుల నుండి దౌష్ట్యము పుట్టును (1 సమూయేలు 24:13)

'నా బంగారు పుట్టలో వేలుపెడితే నేను కుట్టనా?' అనేది బాలానందం కోసం చెప్పుకునే కథ హాస్యభరిత ఉపసంహారం. కుట్టడం చీమ నైజం. స్వకీయాన్ని ఎవరు నివారించగలరు? బుద్ధిని బట్టి గమనముంటుందన్న సత్యాన్ని సూచించేందుకు పై సామెతలను ప్రయోగిస్తారు. భాస్కర శతకకారుడు చేదు పుచ్చకాయ సాదృశ్యాన్నెత్తి పై సత్యాన్ని ఉల్లేఖిస్తున్నాడు

'పాపపు త్రోవవాని కొక పట్టున మేను వికాసమొందినన్
లోపల దుర్గుణంబె ప్రబలుంగద నమ్మగ గూడ దాతనిన్
బాపట కాయకున్ నునుపు పైపయి గల్గిన కల్గుగాక నే
రూపున దానిలో గల విరుద్ధపు జేదు నశించు భాస్కరా!'

దుర్మార్గునికి శరీర సౌందర్యమున్నా వాడి మనస్సులోని చెడు గుణం అలానే ఉంటుంది. పాపట కాయ పైకి రమణీయంగా కనిపించినా స్వతస్సిద్ధంగా దానిలోని చేదు విరగడం అసాధ్యం. ఉప్పు నీటి యూట నుండి మంచినీరు పుట్టనట్లు పాతకుని మదిలో పాపపు తలంపులే ఊరుతుంటాయి.

ఏ విత్తనం వేస్తే ఆ చెట్టే మొలుస్తుందన్నది జగమెరిగిన సత్యం. శునకం నీచ జంతువు. దానికెంత ముస్తాబు చేసినా, గద్దెనెక్కించినా కుక్కబుద్ధి మానదుగదా అంటున్నాడు సుమతీ శతకకారుడు!

'కనకపు సింహాసనమున
శునకము గూర్చుండబెట్టి శుభలగ్నమునన్
వొనరగ బట్టము గట్టిన
వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ'

సౌలు ఇశ్రాయేలు జాతినేలిన మొదటి ప్రభువు. అతని దురాచాలకు విసిగి దేవుడు వేరొక వంశ శ్రేష్ఠుడు దావీదును అతనికి వారసుడిగా నియమించాడు. ఆ నియామకం తాలూకు చిహ్నాలు స్పష్టంగా వ్యక్తమవుతూ ఉండగా, స్వయానా తన అల్లుడని కూడా చూడక, సౌలురాజు అతనిని మట్టుబెట్టడానికై సైన్యసమేతంగా అతనిని అరణ్యంలో వెంటాడాడు. కాని ఒక గుహాంతరాళంలో ఒక్క వేటుతో సౌలును వధించగలిగి కూడా దావీదు అతనిని విడిచిపెట్టాడు. సౌలు గుహనుండి బయటికి వెళ్ళిన తరువాత దావీదు కొండ కొమ్మున నిలిచి పలికిన కరుణాప్రేరిత వాక్కులలో ఈ సామెతను ఉదహరిస్తూ దుష్టుల నుండి స్వభావసిద్ధంగా దౌష్ట్యం జనిస్తుంది కాని తన మనసులో అటువంటి దుష్ట భావన లేదని వేడికోలుగా పలికాడు.

మానవుల అంతరంగమే వారి బుద్ధులకు, ప్రవర్తనకు మూలమని ఈ సామెతల సందేశం.

## 46

తెలుగు సామెత : సీత బాధలు సీతవి, పీత బాధలు పీతవి

బైబులు సామెత : ఎవరి బాధలు వారివి (సామెతలు 14:10)

సీత మహా సాధ్వి. శ్రీరామచంద్రుని సహధర్మచారిణి. ఇనకులాన మెట్టి భోగభాగ్యాలతో తులదూగవలసిన ఆ అసూర్యంపశ్య అడవులపాలై, అక్కడా సుఖానికి నోచుకోక కాముకుడైన రావణుని ఇంట నిర్బంధంలో పుట్టెడు దుఃఖంలో జీవించింది. ఆ తల్లి దీనగాథ మనసులో మెదలుతుండగా వెనువెంటనే ఒక తుచ్ఛప్రాణి పీత ప్రస్తావన రావడంలో ఒకానొక చతురలలిత హాస్యం విరబూసి హాయిగా నవ్వుకొనేలా చేస్తుంది ఈ తెలుగు సామెత. మళ్ళీ అంతలోనే ఈ సాధారణ పదాలతో అమరిన సామెతలోని బృహత్సత్యం స్ఫురించి బోధ, ఆనందానుభూతి అనుభవైక వేద్యమవుతాయి. బైబులు సామెత కూడా ఇదే విషయాన్ని సంక్షిప్తంగా బలంగా ప్రస్తావించి లోకం తీరును, మానవ జీవితంలోని వాస్తవాలను ఆకళింపుకు తెస్తున్నది.

ఈ రెండు సామెతలు ప్రతిపాదించే సాధారణ సత్యం బాధల విషయంలో ఎంత చెట్టుకు అంత గాలి అన్నదే. బాధలు అందరికీ ఉంటాయి. బుద్ధ భగవానుని గాథలో ఒక స్త్రీ విగత జీవుడైన తన కుమారుని బ్రతికించమని అర్థించిన కథ లోకప్రసిద్ధం. తథాగతుడు ఆమెను గుప్పెడు నువ్వులు తెమ్మని ఆదేశించాడు. అయితే ఎవరి ఇంటిలో అంతవరకు మరణం సంభవించలేదో ఆ గృహంలో నుండి తిలలు తేవాలి అని షరతు విధించాడు. ఆ ఇల్లాలు ఇల్లిల్లూ తిరిగి వేసారి సత్యం గ్రహించింది. జీవితంలో కష్టసుఖాలు పడుగుపేకలు. రెండూ ఉంటేనే వస్త్రం తయారైనట్టు కష్టాలు లేని కాపురం గానీ, కడగండ్లు లేని మనుషులు గానీ ఉండరు.

పై చెప్పినట్టు ఎవరి స్థాయికి తగిన ఇరుకులు, ఇబ్బందులు వారికుంటాయి. కడుపుకు కాసింత అన్నం దొరకని క్షుధార్తుల బాధ ఇక్కడ, తిన్నది అరగక ఔషధాలు సేవిస్తూ ఉండే ధనికుల బాధ అక్కడ. ఉన్నవాడికి అరగని జబ్బు, లేనివాడికి ఆకలి జబ్బు అన్నాడు ఒక సినిమా కవి. అద్దె చెల్లించడానికి వెయ్యి రూపాయలు లేక ఒక మధ్య తరగతి సగటు మనిషి విలవిలలాడుతుంటాడు. భారీ పరిశ్రమ నిర్మాణానికి వేయి కోట్ల రూపాయలు ఋణం అనుకున్న సమయానికి చేతికి దొరకక ఇంకొక పారిశ్రామికవేత్త వాపోతుంటాడు. నాథునికి దూరమై రాక్షసుని చెరలో విలపించేది సీత అయితే తాను దూరవలసిన బొరియ కనిపించక పైనుండి తన్నుకు పోవడానికి వస్తున్న పక్షి బారి నుండి తప్పించుకొనేందుకు ఆరాటపడేది పీత. ఎవరి కష్టం వారికి ప్రాణ సంకటమే. 'నీ బాధలేం బాధలు నా బాధలతో పోల్చుకుంటే' అని తీసిపారెయ్యడానికి వీలు లేదు.

'హరి విధి సుర మునులాదిని
మెరిసియు జన్మించి పిదప మేలులకెడగా
జరమందును మరణమందును
మరున్ వర్తిలిరి కర్మవాసనవేమా'

బ్రహ్మ, విష్ణు, సురలు, మునులు కర్మఫలాన్ని బట్టి కష్టాల పాలయ్యారని ఈ వేమన పద్యం కూడా ఈ సామెతలు చెబుతున్న సత్యాన్నే వేరొక విధంగా చెబుతున్నది.

## 47

తెలుగు సామెత : సంతోషం సగం బలం

బైబులు సామెత : సంతోష చిత్తత మందు వలె ఆరోగ్యమును చేకూర్చును (సామెతలు 17:22)

సంతోషంగా ఉండడమనేది ఒక వరం. ఈ సంతోషాన్ని ధనకనక వస్తు వాహనాలతో కొనలేము. సంతోషం హృదయం పొందే ఒక మహోల్లాసమైన స్థితి. ఇటువంటి సంతోషం మనస్సుకు శరీరానికి కూడా ఆరోగ్యదాయకం. కొందరు ఎప్పుడూ చూచినా ఏదో ఒకటి పోగొట్టుకున్నవారిలా దిగాలుపడి, నీరసంగా దుఃఖసాగరంలో మునిగి తేలుతున్నవారిలాగా కనిపిస్తారు. వారి స్థితికి తగిన కారణం కనిపించదు. మరి ఎందుకలా ఉన్నారో వారు కూడా విడమరచి చెప్పలేరు. మరికొందరు చుట్టూ సమస్యల వలయాలు కమ్ముకొస్తున్నా, అడుగడుగునా అవరోధాలు ఆవరిస్తున్నా, ఏమున్నా, లేకున్నా, చిద్విలాసంగా, నిత్యం సంతోషంగా ఉంటారు. ఇటువంటి సంతోషం ఆరోగ్యదాయకమని బైబులు సామెత వివరిస్తుంది. ఆనందంలో శాంతి ఉంది. ఆనందంలో సమాధానం ఉంది. ఆనందంలో సంతృప్తి ఉంది. అందుకే అది ఆరోగ్యకరం!

తెలుగు సామెత సంతోషమే సగం బలమని వివరిస్తుంది. మనం తినే ఆహారం వల్ల సగం బలం సమకూరితే, సంతోషం వల్ల సగం బలం ప్రాప్తిస్తుందన్నమాట. హాస్యం ఆనంద సంతోషాలకు గుర్తు. హాస్యం (నవ్వు) లో శరీర భాగాలన్నీ ప్రభావితమై, ఉత్తేజవంతమై ఆరోగ్యం చేకూరుతుందని నేడు వైద్యులు కూడా సమ్మతిస్తున్నారు. మానవులే నవ్వి, హృదయావిష్కరణ గావించి, ఆరోగ్యం పొందగల అదృష్టవంతులు.

అందుకే గుఱ్ఱం జాషువా,

నవ్వవు జంతువుల్ నరుడు నవ్వును! నవ్వులు చిత్తవృత్తికిన్
దివ్వెలు! కొన్ని నవ్వులెటు తేలవు, కొన్ని విషప్రయుక్తముల్
పువ్వులవోలె ప్రేమరసమున్ వెలిగ్రక్కు విశుద్ధమైన లే
నవ్వులు నాకు నిమ్ము వినాశక వ్యాధులు సోకవెన్నడున్" **(క్రొత్త లోకము – జాషువ)**

అంటాడు. విశుద్ధమైన నవ్వు సంతోషంవల్లనే కలుగుతుంది. అటువంటి నవ్వు నవ్వితే వ్యాధులు సోకవని కవిగారి సహేతుకమైన భావన.

సంతోషించండని చెప్పడం తేలికే. అయితే సంతోషించడమే మహా కష్టం. నేటి ప్రపంచ పరిస్థితులన్నీ ప్రతికూలంగా ప్రవర్తిల్లుతున్నాయి. ఇంటా బయటా సమస్యల తోరణాలు ఉచ్చులు బిగిస్తున్నాయి. ఎటు చూచినా అంధకారమే రాజ్యమేలుతుంది. తనకు తానే ఒక తెగని సమస్యగా మానవుడు తయారయ్యాడు. మానవత్వం మంటగలిసి, దానవత్వం విలయతాండవం చేస్తున్నది. మనుగడ ప్రశ్నార్థకమైనప్పుడు సంతోషించడం సాధ్యమౌతుందా? అవును, సాధ్యం కాదు!

అయితే స్థితప్రజ్ఞుడై మనిషి జీవింపగలిగితే సంతోషించడం అసాధ్యం కానేకాదు. కనుక కష్టాలకు క్రుంగిపోక, సుఖాలకు పొంగిపోక స్థిరచిత్తంతో ఉన్ననాడే సంతోషించడం సాధ్యమౌతుంది. ఆ సంతోషమే సగం బలమౌతుంది. కనుక సంతోషకరమైన మనస్సు కలిగి, ఆరోగ్యాన్ని పొందమనీ, సంతోషమే సగం బలమనీ బైబులు, తెలుగు సామెతలు ఘోషిస్తున్నాయి.

ఎవరికి వారు సంతోషంగా ఉండడం ఒక ఎత్తైతే ఇతరులను సంతోషింపజేయడం, ఇతరుల సంతోషాలలో పాలుపంచుకోవడం మరొక ఎత్తు. ఇందులో పరోపకారం, ఉదారగుణం దాగి ఉన్నాయి. కేవలం మన సుఖం మాత్రమే చూచుకొని సంతోషిస్తే గొప్పేముంది? ఇతరులను కూడా సంతోషపెట్టాలి. "ఏవాడు జీవింపననేకులు జీవింతురో, వాని మనుగడయే మనుగడ, వాడొక్కరుండ జీవించువాడ" అని దమనకుని చేత మిత్రభేదములో ఉత్తమాధమ జీవితములను వర్ణింపజేస్తూ కరటకునితో అనిపిస్తాడు చిన్నయసూరి. నిజమేకదా మరి. ఇతరుల కష్టాలలో మనం పాలుపంచుకొని చేయూతనివ్వాలి. వారికి కూడ సంతోషించే పరిస్థితులు కల్పించాలి.

అందులోనే అసలైన సంతోషం ఉంది. కాబట్టి సంతోషంగా ఉండాలి, ఇతరులను సంతోషవంతంగా ఉంచాలి. ఇటువంటి సంతోషం మానసికోల్లాసాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తుంది. తెలుగు సామెతలో చెప్పినట్లు సగం బలాన్ని సమకూరుస్తుంది. సంతోషించుదాం! అందరికీ సంతోషాన్ని పంచుదాం. అదే సామెతలలోని అంతరార్థం.

## 48

తెలుగు సామెత : హృదయానికి ముఖం అద్దం

బైబులు సామెత : హృదయములోని భావములను బట్టి మోము ఆనందముగా గాని విచారముగా గాని చూపట్టును (సీరా 13:25)

ముఖ కవళికలు మదిలోని కలవరానికైనా, కళలకైనా అద్దం పడతాయనేది జగమెరిగిన సత్యం. జంతువులు రౌద్రాన్ని ముఖంలో చూపగలవేమో గానీ తక్కిన అనుభూతులను ప్రదర్శించలేవు. ముఖ్యంగా నవ్వడమనేది మానవునికి మాత్రమే చేతనైన చేష్ట. నటులు, నాట్యకారులు నవరసాలను అలవోకగా వదనంలో ప్రదర్శిస్తారు. ఇతర శరీర భాగాల కంటే ముఖమే మనస్సులో ముప్పిరిగొనే భావాలకు ముంజేతి కంకణం.

నటులే కాదు సాధారణ జీవితంలో మనుషులందరూ మనస్సులో కదలాడే భావాలను అప్రయత్నంగానే ముఖంలో వ్యక్తం చేస్తారు. 'వదనం వివర్ణమయింది'; 'కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు'; 'ఆనందంతో విప్పారింది'; 'కళ్ళు మెరిసాయి' వంటి మాటలు ముఖంలో కనిపించే భావ వ్యక్తీకరణను సూచించేవే. ప్రతి భావానికీ తగిన ముఖ కవళికలు ఎవరూ చెప్పనక్కరలేకుండానే ప్రదర్శితమవుతాయి. ఎదుటి వ్యక్తి వాటిని చూచి ఇట్టే పసిగట్టివేస్తాడు.

పసి పిల్లలు మనస్సులోని మాటని మాటల్లో వెళ్ళగక్కేస్తారు. ముఖంలో సైతం నిరభ్యంతరంగా యధేచ్ఛగా ప్రదర్శిస్తారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ భావాలను అణచుకోవడం ముఖంలో కనిపించనీయకుండా జాగ్రత్త పడడం జరుగుతుంటుంది. ఈ కళలో ఆరితేరినవారు తమ మనస్సులో ఏమున్నదో ఎంతమాత్రం ఎదుటివాడికి అంతుబట్టకుండా ముసుగు వేసుకుంటారు. ఇలాటివారితో ఒకింత జాగ్రత్తగా ఉండాలి.

నంది తిమ్మన పారిజాతాపహరణం కావ్య నాయిక సత్యభామ ఇందుకు పూర్తిగా విరుద్ధం.

'అనవిని వ్రేటువడ్డ యురగాంగనయుంబలె నేయి వోయ భ
గ్గున దరికొన్న భీషణ హుతాశన కీల యనంగ లేచి హె
చ్చిన కనుదోయికెంపు తన చెక్కుల కుంకుమ పత్రభంగ సం
జనిత నవీన కాంతి వెదజల్లగ గద్గద ఖిన్న కంఠియై' కనబడుతుంది.

తెలుగు సామెత, బైబులు సామెత ఈ విషయంలో ఏకీభావాన్ని ప్రదర్శిస్తున్నాయి. మనస్సులోని ఆనందం పెదవులపై చిరునవ్వుగా, విప్పారిన కన్నుల్లో కాంతిగా ద్యోతకమవుతుంది. విచారం, అలక మూతి ముడుచుకోవడంలోను, ముడివేసిన భృకుటిలోను వ్యక్తమవుతాయి. వీటన్నిటికి అద్దం పడతాయి ఈ సామెతలు.

లోకమంతటా సర్వులూ తలదాల్చదగిన సత్యాలను సమానార్థకాలైన తెలుగు, బైబులు సామెతలలో ఇంతవరకు పరిశీలించాము. ఇందులోని వైవిధ్యం అపారం. ఆరోగ్యమే మహాభాగ్యమని ఒక సామెత అంటుంటే, ఒంటి కంటే జంట మేలని మరొకటి అంటున్నది. కలసి ఉంటే కలదు సుఖం, కలలు కల్లలే గదా అన్నవి లోక ప్రసిద్ధ సత్యాలు. తల్లితండ్రులను బట్టే వారి తనూభవులుంటారని కొన్ని సామెతలు విశదీకరిస్తున్నాయి. కోపం శత్రువనీ, శాంతం రక్షయనీ, నిజం నిలకడమీద తేలుతుందనీ చెప్పే సార్వత్రిక సత్యాలను ఈ వర్గంలో సందర్శించాము.